# భగవద్గీత

(తాత్పర్యం వాడుక భాషలో)



## మల్లాది
## వెంకట కృష్ణమూర్తి

Presented to the good heart

______________________________

on the occasion of

______________________________

By

your well wisher

______________________________

# *Bhagavadgeeta*

(With meaning in coloquial Telugu)


**Writer**

**Malladi Venkata Krishna Murthy**

1-1-729, # 202 Gandhi Nagar

Hyderabad - 500 080



**First edition**

**September 2015**

**Published by**

*BhagavadGeeta.com*

*115-B,Ground Floor,*

*Vengalarao Nagar, Hyderabad - 500 038*

*Phone: 040 -6597 3335*

*Mobile: 98851 10110*

*Email: team@bhagavadgeeta.com*

(Subject to Hyderabad jurisdiction only)

**Price**

Rs.120/-

**Cover design : pixelbazaar.in**

**Printers**

Sri Sarada Printers, Hyderabad

# భగవద్గీత

(తాత్పర్యం వాడుక భాషలో)

## మల్లాది
## వెంకట కృష్ణమూర్తి

**Publishers**

*BhagavadGeeta.com*

*115-B,Ground Floor,*

*Vengalarao Nagar, Hyderabad - 500 038*




**(వెల రూ.120)**

మరణించిన మనిషి తిరిగి లేచి కూర్చుంటాడా?

చితిలోని మనిషి మళ్ళీ బతికివస్తాడా?

అలాంటి మనిషికి చెందిన నవల పరంజ్యోతి

ఆధ్యాత్మిక జీవితానికి చెందిన నవల ఇది.

జయం తర్వాత మల్లాది వెంకట కృష్ణమూర్తి రాసిన పరంజ్యోతి

ఆధ్యాత్మిక, సాధారణ పాఠకుల్ని కూడా సమానంగా ఆకట్టుకుంటుంది.

Lipi Publications
Gandhi Nagar, Hyderabad - 500 080
Cell Number: **98490 22344**

# భగవద్గీత

(తాత్పర్యం వాడుక భాషలో)

**గీతాధ్యయనశీలస్య ప్రాణాయామపరస్య చ ।**

**నైవసంతిహి పాపాని పూర్వజన్మ కృతాని చ ॥**

భావం : గీతాధ్యయనం చేసేవాడికి, ప్రాణాయామం చేసేవాడికి పూర్వజన్మల్లో చేసిన పాపాలు నశిస్తాయి.

## మొదటి అధ్యాయం - అర్జున విషాదయోగం

ధృతరాష్ట్ర ఉవాచ

**1.** ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః ।

మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ ॥

భావం : *ధృతరాష్ట్రుడు అడిగాడు: ఓ సంజయా! యుద్ధ సన్నద్ధులైన నా వాళ్ళు, పాండవులు ధర్మభూమి అయిన కురుక్షేత్రంలో ఏం చేసారు?*

సంజయ ఉవాచ

**2.** దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా ।

ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ ॥

భావం : సంజయుడు జవాబు చెప్పాడు: అప్పుడు రాజైన దుర్యోధనుడు వ్యూహరచనతో మోహరించి ఉన్న పాండవసైన్యాన్ని చూసి, ద్రోణాచార్యుడి దగ్గరికి వెళ్ళి ఇలా చెప్పాడు.

**3. పశ్యైతాం పాండుపుత్రాణా మాచార్య మహతీం చమూమ్ ।**
**వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా ॥**

భావం : *గురువర్యా! బుద్ధిశాలి, మీ శిష్యుడు అయిన ద్రుపద పుత్రుడు (దృష్టద్యుమ్నుడు) ఏర్పరిచిన వ్యూహం ప్రకారం నిలబడ్డ ఈ పాండవ మహా సైన్యాన్ని చూడండి.*

**4. అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి ।**
**యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః ॥**

**5. ధృష్టకేతు శ్చేకితానః కాశీరాజశ్చ వీర్యవాన్ ।**
**పురుజిత్ కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః ॥**

**6. యుధామన్యుశ్చ విక్రాంత ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ ।**
**సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః ॥**

భావం : *పాండవసేనలో గొప్ప విలుకాళ్ళు, ఇంకా యుద్ధంలో భీమార్జునులతో సమానులైన శూరులు ఉన్నారు. వారిలో యుయుధానుడు (సాత్యకి) విరాటుడు, మహారథుడైన ద్రుపదుడు, ధృష్టకేతువు, చేకితానుడు, వీరుడైన కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, శైభ్యరాజు, వీరులైన యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ఉపపాండవులు ఉన్నారు.*

**7. అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।**
**నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమితే ॥**

భావం : ఓ బ్రాహ్మణోత్తమా! మన పక్షం లోని ప్రముఖులు, సేనా నాయకుల గురించి నీ సమాచారం కోసం చెప్తున్నాను.

**8. భవాన్ భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః ।**
**అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తి స్తథైవ చ ॥**

భావం : మీరు, భీష్ముడు, కర్ణుడు యుద్ధవీరుడైన కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుడి కొడుకు భూరిశ్రవుడు ఉన్నారు.

**9. అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః ।**
**నానాశస్త్ర ప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః ॥**

భావం : ఇంకా నా కోసం తమ ప్రాణాలని ధార పోసే, వివిధ శస్త్రాస్త్రాలు ధరించిన అనేకమంది యుద్ధ విశారదులైన శూరులు ఉన్నారు.

**10. అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ ।**
**పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ ॥**

భావం : అలాంటి అపరిమితమైన మన బలాన్ని భీష్ముడు చక్కగా కాపాడుతున్నాడు. పరిమితమైన పాండవుల సైన్యం భీముడి చేత కాపాడబడుతోంది.

**11. అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః ।**
**భీష్మ మేవాభిరక్షంతు భవంతః సర్వ ఏవ హి ॥**

భావం : మీరంతా వ్యూహంలో మీ మీ స్థానాల్లో ఉండి భీష్ముడిని అన్ని పక్కల నించి కాపాడుతూండండి.

**12. తస్య సంజనయన్ హర్షం కురువృద్ధః పితామహః ।**
**సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్ ॥**

భావం : వీరుడు, కురువృద్ధుడు అయిన భీష్మ పితామహుడు దుర్యోధనుడికి ఉత్సాహం కలిగేలా పెద్దగా సింహనాదం చేసి తన శంఖాన్ని ఊదాడు.

**13. తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః ।**
**సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోభవత్ ॥**

భావం : వెంటనే శంఖాలు, భేరులు, తప్పెటలు, గోముఖవాద్యాలు మోగాయి. ఆ ధ్వనితో దిక్కులు పిక్కటిల్లాయి.

**14. తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ ।**
**మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః ॥**

భావం : తర్వాత తెల్లటి గుర్రాలు కట్టిన గొప్ప రథంలోని కృష్ణార్జునులు తమ దివ్యమైన శంఖాలని గట్టిగా ఊదారు.

**15. పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః ।**
**పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః ॥**

భావం : శ్రీకృష్ణుడు పాంచజన్యం అనే శంఖాన్ని, అర్జునుడు దేవదత్త అనే శంఖాన్ని, అరివీర భయంకరుడైన భీముడు పౌండ్రం అనే శంఖాన్ని ఊదారు.

**16 అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠరః ।**
**నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ ॥**

భావం : కుంతీపుత్రుడు, రాజు అయిన ధర్మరాజు అనంతవిజయం అనే శంఖాన్ని, నకులుడు సుఘోష, సహదేవుడు మణిపుష్పకం అనే శంఖాలని ఊదారు.

**17. కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః ।**
**ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః ॥**
**18. ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।**
**సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ ॥**

భావం : గొప్ప ధనస్సు గల కాశీరాజు, మహారధుడైన శిఖండి, దుష్టద్యుమ్నుడు, విరాటుడు, అపజయం తెలియని సాత్యకి, ద్రుపదుడు, ఉపపాండవులు, గొప్ప భుజబలం గల అభిమన్యుడు వ్యూహం లోంచి వేరువేరుగా తమ శంఖాలని ఊదారు.

**19. స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ ।**
**నభశ్చ పృథివీం చైవ తుములో వ్యనునాదయన్ ॥**

భావం : ఆ శంఖధ్వనికి భూమ్యాకాశాలు దద్దరిల్లాయి. దుర్యోధనుడు మొదలైన వారి గుండెలని అది బద్దలు చేసింది.

**20. అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః ।**
**ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ॥**

**21. హృషీకేశం తదా వాక్యమ్ ఇదమాహ మహీపతే ।**

**అర్జున ఉవాచ**

**సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మే చ్యుత ।**

భావం : ఓ ధృతరాష్ట్ర మహారాజా! తర్వాత యుద్ధం ఆరంభమవుతూండగా యుద్ధ సన్నద్ధులైన కౌరవులని చూసి జెండా మీద హనుమంతుడు గల అర్జునుడు ధనస్సుని చేతిలోకి తీసుకుని శ్రీకృష్ణుడితో ఇలా చెప్పాడు. 'ఓ అచ్యుతా! నా రధాన్ని ఉభయసేనల మధ్య నిలుపు.'

**22. యావదేతాన్నిరీక్షేహం యోద్ధుకామానవస్థితాన్ ।**
**కైర్మయాసహ యోద్ధవ్య మస్మిన్ రణసముద్యమే ॥**

భావం : యుద్ధారంభంలో నేను ఎవరితో యుద్ధం చేయాల్సి ఉందో, అందుకు సిద్ధంగా ఉన్నవారిని చూడటానికి నా రధాన్ని రెండు సేనల మధ్య నిలుపు.

**23. యోత్స్యమానానవేక్షే హం య ఏతే త్ర సమాగతాః ।**
**ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః యుద్ధే ప్రియచికీర్షవః ॥**

*భావం : దుష్టుడైన దుర్యోధనుడికి యుద్ధంలో ప్రియం చేకూర్చడానికి ఇక్కడికి వచ్చి ఉన్న యోధులని నేను చూడాలి.*

**సంజయ ఉవాచ**

**24. ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత ।**
**సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ ॥**

**25. భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ ।**
**ఉవాచ పార్థ పశ్యైతాన్ సమవేతాన్ కురూనితి ॥**

*భావం : సంజయుడు చెప్పాడు : ఓ ధృతరాష్ట్రా! అర్జునుడి మాట విని కృష్ణుడు రెండు సేనల మధ్య, భీష్మద్రోణులు రాజులందరికీ ఎదురుగా తన శ్రేష్ఠమైన రథాన్ని ఆపి, 'ఓ అర్జునా! ఇక్కడ సమావేశమైన ఈ కౌరవులని చూడు' అని చెప్పాడు.*

**26. తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్ ।**
**ఆచార్యాన్ మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా ॥**

**27/1. శ్వశురాన్ సుహృదశ్చైవ సేనయోరుభయోరపి ।**

*భావం : తర్వాత అర్జునుడు అక్కడ ఇరు సేనల్లో ఉన్న తండ్రులని, తాతలని, గురువులని, మేనమామలని, అన్నదమ్ములని, కొడుకులని, మనవళ్ళని, స్నేహితులని, మామలని, తన శ్రేయోభిలాషులని చూసాడు.*

**27/2. తాన్సమీక్ష్య స కౌంతేయః సర్వాన్ బంధూనవస్థితాన్ ॥**
**28/1. కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ ।**

*భావం : అర్జునుడు యుద్ధసన్నద్ధులైన తన బంధువులు అందరినీ చూసి అత్యంత కరుణతో కూడిన దుఃఖంతో ఇలా చెప్పాడు.*

**అర్జున ఉవాచ**

**28/2. దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుం సముపస్థితమ్ ॥**

**29. సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి ।**
**వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే ॥**

**30. గాండీవం స్రంసతే హస్తాత్ త్వక్చైవ పరిదహ్యతే ।**
**న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః ॥**

*భావం : అర్జునుడు చెప్పాడు : ఓ కృష్ణా యుద్ధం చేయడానికి ఇక్కడ చేరిన ఈ బంధువులని చూస్తే నా అవయవాలు పట్టు తప్పుతున్నాయి. నోరు ఎండుకుపోతోంది. శరీరంలో వణుకు, గగుర్పాటు కలుగుతున్నాయి. గాండీవం చేతిలోంచి జారిపోతోంది. చర్మం మండుతోంది. నించోడానికి కూడా నాకు శక్తి లేదు. నా మనసు గిర్రున తిరుగుతోంది.*

**31. నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ ।**
**న చ శ్రేయో నుపశ్యామి హత్వా స్వజనమాహవే ॥**

*భావం : ఓ కేశవా! అనేక అపశకునాలు చూస్తున్నాను. యుద్ధంలో బంధువులని చంపి, ఆ తర్వాత పొందే లాభం నాకు కనిపించడం లేదు.*

**32. న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ ।**
**కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా ॥**

*భావం : కృష్ణా! నాకు విజయం కానీ, రాజ్యం కానీ, సుఖాలు కానీ వద్దు. ఓ కృష్ణా! మనకి ఇలాంటి రాజ్యంతో, భోగాలతో, జీవితంతో ఏం ప్రయోజనం?*

**33. యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ ।**
**త ఇమేవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనానిచ ॥**

**34. ఆచార్యాః పితరః పుత్రాః తథైవ చ పితామహాః ।**
**మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధిన స్తథా ॥**

*భావం : ఎవరి కోసం ఈ రాజ్యాన్ని, భోగాలని, సుఖాలని కోరామో అలాంటి గురువులు, తండ్రులు, కొడుకులు, తాతలు, మేనమామలు, మామలు, మనవలు, బావమరుదులు, ఇంకా మిగిలిన బంధువులు అంతా ప్రాణాల మీద, ధనం మీద ఆశ విడిచి ఈ రణరంగానికి వచ్చారు.*

**35. ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతోపి మధుసూదన ।**
**అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే ॥**

*భావం : ఓ కృష్ణా! నన్ను చంపబోయే వీరిని ముల్లోక రాజ్యాధికారం కోసమైనా నేను చంపడానికి ఇష్టపడను. ఇక ఈ భూలోక రాజ్యం గురించి చెప్పాలా?*

**36. నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతి స్స్యాజ్జనార్దన ।**
**పాపమేవాశ్రయేదస్మాన్ హత్వైతానాతతాయినః ॥**

*భావం : ఓ కృష్ణా! దుర్యోధనుడు మొదలైన వారిని చంపితే మనకి ఏం సంతోషం కలుగుతుంది? (ఏం బావుకుంటాం?) దుర్మార్గులైన వీరిని చంపితే మనకి పాపం వస్తుంది.*

**37. తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్ స్వబాంధవాన్ ।**
**స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ ॥**

*భావం : ఓ మాధవా! కాబట్టి మన బంధువులైన ధృతరాష్ట్రుడి కొడుకులని చంపడం మనకి తగదు. మన వాళ్ళని చంపి మనం ఎలా సుఖపడగలం?*

**38. యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః ।**
**కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ ॥**

**39. కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ ।**
**కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన ॥**

*భావం : ఓ జనార్దనా! రాజ్యలోభంతో మనసు చెడిపోయిన దుర్యోధనుడు మొదలైనవారు వంశనాశనం మిత్రద్రోహం వల్ల కలిగే పాపాన్ని తెలుసుకోలేక పోయారు. కుల నాశనం వల్ల కలిగే నష్టం చక్కగా తెలిసిన మనం ఈ పాపకృత్యం నించి ఎలా విరమించడమో తెలియడం లేదు.*

**40. కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః ।**
**ధర్మే నష్టే కులం కృత్స్నమ్ అధర్మో భిభవత్యుత ॥**

*భావం : కుల నాశనం వల్ల అనాదిగా వచ్చే కులధర్మాలు నశిస్తాయి. ధర్మం నశించగానే కులం అంతటా అధర్మం వ్యాపిస్తుంది.*

**41. అధర్మాభిభవాత్ కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః ।**
**స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః ॥**

*భావం : ఓ కృష్ణా! అధర్మం (పాపం) పెచ్చుపెరిగి కుల స్త్రీలు చెడిపోతారు. స్త్రీలు చెడిపోతే వర్ణ సంకరం కలుగుతుంది.*

**42. సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ ।**
**పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః ॥**

*భావం : వర్ణ సంకరం కుల ఘాతుకులని, కులాన్ని నరకంలో పడేస్తుంది. వారి పితృదేవతలు శ్రాద్ధతర్పణాలు లేక అధోగతి పొందుతారు.*

**43. దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః ।**
**ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః ॥**

*భావం : వర్ణసంకర దోషంతో నాశనమైన కులం యొక్క సనాతనమైన కులధర్మాలు నశించిపోతాయి.*

**44. ఉత్పన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన ।**
**నరకే నియతంవాసో భవతీత్యనుశుశ్రుమ ॥**

భావం : *ఓ కృష్ణా! కులధర్మం నశించిన మనిషికి కలకాలం నరకప్రాప్తి కలుగుతుందని ప్రతీతి.*

**45. అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ ।**
**యత్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః ॥**

భావం : *అయ్యో! ఆశ్చర్యం! మనం రాజసుఖం అనే ఆశతో మన బంధువులని చంపడానికి నడుం కట్టి మహా పాపంలోకి దిగాం.*

**46. యది మామప్రతీకారమ్ అశస్త్రం శస్త్రపాణయః ।**
**ధార్తరాష్ట్రా రణే హన్యుః తన్మే క్షేమతరం భవేత్ ॥**

భావం : *ఆయుధాలు ధరించని, ఎదిరించని నన్ను ఆయుధాలు ధరించిన దుర్యోధనుడు మొదలైన వారు యుద్ధంలో చంపితే అది నాకు మిక్కిలి క్షేమాన్ని కలిగిస్తుంది.*

**సంజయ ఉవాచ**

**47. ఏవముక్త్వార్జునస్సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।**
**విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥**

భావం : సంజయుడు చెప్పాడు : *అర్జునుడు ఇలా చెప్పి దుఃఖంతో చలించిన మనసుతో ధనుర్బాణాలని పారేసి రథం మీద కూలబడిపోయాడు.*

**భారతామృత సర్వస్వం విష్ణోర్వక్త్రాద్వినిస్సృతం**
**గీతాగంగోదకం పీత్వా పునర్జన్మ న విద్యతే ॥**
భావం : భారతామృతంలోని సర్వస్వాన్ని, విష్ణువు ముఖం నించి వెలువడ్డ గీత అనే గంగాజలాన్ని తాగితే పునర్జన్మ ఉండదు.

# రెండో అధ్యాయం- సాంఖ్యయోగం

**సంజయ ఉవాచ**

1. **తం తథా కృపయా విష్టమ శ్రుపూర్ణాకులేక్షణమ్ ।**
**విషీదంతమిదం వాక్యమువాచ మధుసూదనః ॥**

భావం : సంజయుడు చెప్పాడు. *అలా కంట నీరు పెట్టుకుని దుఃఖించే అర్జునుడ్ని చూసి శ్రీకృష్ణుడు కనికరంగా ఇలా చెప్పాడు.*

**శ్రీ భగవాన్ ఉవాచ**

2. **కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్ ।**
**అనార్య జుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున ॥**

భావం : కృష్ణ పరమాత్మ చెప్పాడు. *ఓ అర్జునా! సామాన్యులకి కలిగే, స్వర్గానికి ప్రతిబంధకం అయ్యే, అపకీర్తిని కలిగించే ఈ పిరికితనం ఈ విషమ సమయంలో నీకు ఎక్కడ నించి దాపురించింది?*

3. **క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వయ్యుపపద్యతే ।**
**క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప ॥**

భావం : *అధైర్యాన్ని వదిలెయ్. ఇది నీకు తగదు. నీచమైన మనో దౌర్బల్యాన్ని వదిలి యుద్ధం చేయడానికి లే.*

**అర్జున ఉవాచ**

**4. కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।**
**ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥**

భావం : *అర్జునుడు అడిగాడు. 'ఓ కృష్ణా! భీష్ముడు, ద్రోణుడు పూజింప తగ్గవారు. నేను అలాంటి వారిని ఎదిరించి బాణాలు వేసి ఎలా యుద్ధం చేయగలను?*

**5. గురూనహత్వా హి మహానుభావాన్**
**శ్రేయో భోక్తుం భైక్ష్యమపీహ లోకే ।**
**హత్వార్థకామాంస్తు గురూనిహైవ**
**భుంజీయ భోగాన్ రుధిరప్రదిగ్ధాన్ ॥**

భావం : *మహానుభావులైన గురువులని చంపే బదులు, ఈ లోకంలో భిక్షాన్నం అయినా తిని బతకడం మంచిది కదా! లేదా వారిని చంపి వారి రక్తంతో తడిసిన ధనసంపదలని అనుభవించాలి.*

**6. న చైతద్విద్మః కతరన్నో గరీయో**
**యద్వా జయేమ యది వా నో జయేయుః ।**
**యానేవ హత్వా న జిజీవిషామ**
**స్తేవస్థితాః ప్రముఖే ధార్తరాష్ట్రాః ॥**

భావం : *ఈ యుద్ధంలో ఎవరు జయిస్తారో చెప్పలేం. ఈ రెంటిలో ఏది మనకి ఉత్తమమో కూడా తెలీదు. ఎవరిని చంపాక ఇక మనం జీవించి ఉండాలని అనుకోమో, అలాంటి భీష్మద్రోణులు యుద్ధంలో మన ఎదుట ఉన్నారు.*

**7. కార్పణ్యదోషోపహతస్వభావః**
**పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః ।**
**యచ్ఛ్రేయస్స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే**
**శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్ ॥**

భావం : అజ్ఞానంతో ధర్మం విషయంలో కలిగిన సందేహాన్ని నిన్ను అడుగుతున్నాను. ఏది నాకు నిశ్చయంగా శ్రేయస్కరమో దాన్ని చెప్పు. నేను నీ శిష్యుడ్ని. శరణు పొందిన నన్ను ఆదేశించు.

**8. న హి ప్రపశ్యామి మమాపనుద్యా**
**ద్యచ్ఛోక ముచ్ఛోషణ మింద్రియాణామ్ ।**
**అవాప్య భూమావసపత్న మృద్ధం**
**రాజ్యం సురాణామపి చాధిపత్యమ్ ॥**

భావం : ఈ భూమి మీద ఎదురు లేని సిరిసంపదలతో కూడిన రాజ్యాధికారం లభించినా, చివరికి దేవతల అధికారం ప్రాప్తించినా సరే, నా మానసిక దుఃఖాన్ని చల్లార్చుకునే మార్గం కనుక్కోలేకపోతున్నాను.

**సంజయ ఉవాచ**

**9. ఏవముక్త్వా హృషీకేశం గుడాకేశః పరంతపః ।**
**న యోత్స్య ఇతి గోవింద ముక్త్వా తూష్ణీం బభూవ హ ॥**

భావం : సంజయుడు చెప్పాడు. ఇలా అర్జునుడు శ్రీకృష్ణుడితో 'నేను యుద్ధం చేయను' అని చెప్పి మౌనం వహించాడు.

**10. తమువాచ హృషీకేశః ప్రహసన్నివ భారత ।**
**సేనయోరుభయోర్మధ్యే విషీదంతమిదం వచః ॥**

భావం : ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఉభయ సేనల మధ్య విలపించే అర్జునుడ్ని చూసి శ్రీకృష్ణుడు నవ్వుతూ ఇలా చెప్పాడు.

**శ్రీ భగవాన్ ఉవాచ**

**11. అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః ॥**

భావం : *శ్రీకృష్ణ పరమాత్మ చెప్పాడు. నువ్వు దుఃఖించతగని వారి గురించి దుఃఖిస్తున్నావు. పైగా పండితుడిలా మాట్లాడుతున్నావు. జ్ఞానులైన వారు మరణించిన వారి గురించి కానీ, జీవించి ఉన్నవారి గురించి కానీ ఎన్నడూ దుఃఖించరు.*

(గమనిక : గీతాబోధ ఈ శ్లోకం నించే ప్రారంభమౌతుంది. ఈ శ్లోకాన్ని విత్తనం అని, మిగిలినదంతా దీన్నించి వచ్చిన వృక్షం అని పెద్దలు చెప్తారు)

**12. న త్వేవాహం జాతు నాసం న త్వం నేమే జనా ధిపాః ।**
**న చైవ న భవిష్యామస్సర్వే వయమతః పరమ్ ॥**

భావం : *నేను కానీ, నువ్వు కానీ ఈ రాజులు కానీ ఒకప్పుడు ఉండకుండా, ఇక ముందు లేకుండా లేము. (ఇప్పుడు మాత్రమే ఉన్నాం అన్నది తప్పు భావన. అన్ని కాలాల్లో ఆత్మ శాశ్వతం అని భావం)*

**13. దేహినోస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా ।**
**తథా దేహాంతరప్రాప్తిర్ధీర స్తత్ర న ముహ్యతి ॥**

భావం : *జీవాత్మ ధరించే దేహానికి బాల్య, యవ్వన, వృద్ధాప్యం ఉన్నట్లే, ఇంకొక శరీరం (మరణానంతరం) లభిస్తుంది. జ్ఞాని అయినవాడు ఈ విషయంలో శోకాన్ని పొందడు.*

**14. మాత్రాస్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణసుఖదుఃఖదాః ।**
**ఆగమాపాయినో నిత్యాస్తాం స్తితిక్షస్వ భారత ॥**

భావం : *ఓ అర్జునా! శీతోష్ణాలు, సుఖదుఃఖాలు ఇంద్రియాల విషయ సంయోగం వల్ల కలుగుతున్నాయి. అవి వచ్చిపోయేవి. స్థిరంగా ఉండవు. కాబట్టి వాటిని ఓర్చుకో.*

**15. యం హి న వ్యథయంత్యేతే పురుషం పురుషర్షభ ।**
**సమదుఃఖసుఖం ధీరం సోమృతత్వాయ కల్పతే ॥**

భావం : ఓ పురుషశ్రేష్ఠా! జ్ఞాని సుఖదుఃఖాలని సమానంగా చూస్తాడు. ఏ మనిషిని ఇవి బాధించవో అలాంటి వాడు మోక్షానికి అర్హుడు. (శారీరకబాధలు, మానసికబాధలు అనుభవానికి రాకపోవడం మోక్షానికి సమీపంలో ఉన్నప్పుడే జరుగుతుంది)

**16. నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।**
**ఉభయోరపి దృష్టోంతస్త్వనయో స్తత్త్వ దర్శిభిః ॥**

భావం : అనిత్యమైన (రూప నామాలు కలిగి నశించేది) దేహానికి ఉనికి లేదు. నిత్యమైన (ఆత్మ) దానికి లేమి లేదు. తత్త్వజ్ఞానులైన వారు ఈ రెంటి వాస్తవ స్వరూపాలని తెలుసుకుంటారు.

**17. అవినాశి తు తద్విద్ధి యేన సర్వమిదం తతమ్ ।**
**వినాశమవ్యయస్యాస్య న కశ్చిత్ కర్తుమర్హతి ॥**

భావం : ఈ సమస్త ప్రపంచం దేని చేత (పరమాత్మ) వ్యాపించబడి ఉందో, అది నాశనం లేనిదని తెలుసుకో. నశించని, శాశ్వతమైన దాన్ని ఎవరూ నశింపచేయలేరు. (ఆత్మని)

**18. అంతవంత ఇమే దేహా నిత్యస్యోక్తాశ్శరీరిణః ।**
**అనాశినో ప్రమేయస్య తస్మాద్యుధ్యస్వ భారత ॥**

భావం : ఓ అర్జునా! నిత్యమైంది, నాశరహితమైంది అయిన దేహి (ఆత్మ) ధరించే ఈ దేహాలన్నీ నాశనం అవుతాయి. కాబట్టి (దేహం గురించి దుఃఖించక) నువ్వు యుద్ధం చెయ్యి.

**19. య ఏనం వేత్తి హంతారం యశ్చైనం మన్యతే హతమ్ ।**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే ॥**

*భావం : ఆత్మ ఇతరులని చంపుతుందని కొందరు, చంపబడుతుందని మరి కొందరు భావిస్తారు. వారిద్దరూ అజ్ఞానులే. ఆత్మ చంపదు. చంపబడదు.*

**20. న జాయతే మ్రియతే వా కదాచి**
**న్నాయం భూత్వా భవితా వా న భూయః ।**
**అజో నిత్యశ్శాశ్వతోయం పురాణో**
**న హన్యతే హన్యమానే శరీరే ॥**

*భావం : ఆత్మ ఎప్పుడూ పుట్టదు. చావదు. ఇదివరకు లేకుండా కొత్తగా పుట్టేది కాదు. ఆత్మ జనన మరణాలు లేనిది. శాశ్వతమైంది. ప్రాచీనమైంది. (అన్ని కాలాల్లో ఉండేది) శరీరం చంపబడినా ఆత్మ చంపబడదు. (ఇలాంటి శ్లోకమే కఠోపనిషత్‌లో ఉంది)*

**21. వేదావినాశినం నిత్యం య ఏనమజమవ్యయమ్ ।**
**కథం స పురుషః పార్థ కం ఘాతయతి హంతి కమ్॥**

*భావం : ఓ అర్జునా! ఈ ఆత్మ జనన మరణాలు లేనిదని, నాశనం లేనిదని, నిత్యం (శాశ్వతం) అని ఎవరు తెలుసుకుంటారో వారు ఇంకొకరిని ఎలా చంపించగలరు? ఎలా చంపగలరు?*

**22. వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి ।**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ ॥**

*భావం : మనిషి చిరిగిపోయిన బట్టలని విడిచి కొత్తవి ధరించినట్లుగా ఆత్మ పాత శరీరాన్ని వదిలి కొత్త శరీరాన్ని ధరిస్తుంది.*

**23. నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।**
**న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥**

*భావం : ఈ ఆత్మని ఆయుధాలు గాయపరచలేవు. నిప్పు కాల్చలేదు. నీరు తడప లేదు. గాలి ఆరిపోయేలా చేయలేదు.*

**24. అచ్ఛేద్యోయమదాహ్యో యమక్లేద్యో శోష్య ఏవచ ।**
**నిత్యస్సర్వగతస్థాణు రచలోయం సనాతనః ॥**

*భావం : ఈ ఆత్మ గాయపడదు. కాల్చపడదు. తడవదు. ఆరిపోదు. ఈ ఆత్మ నిత్యం. అంతటా వ్యాపించి ఉంది. స్థిరమైనది. చలనం లేనిది. శాశ్వతమైనది.*

**25. అవ్యక్తో యమచింత్యో యమవికార్యో యముచ్యతే ।**
**తస్మాదేవం విదిత్వైనం నానుశోచితుమర్హసి ॥**

*భావం : ఈ ఆత్మ ఇంద్రియాల చేత తెలుసు కోలేనిది. మనసుకి అందనిది. ఆలోచనలు, భావాలు లేనిది. కనుక దీని కోసం నువ్వు దుఃఖించకు.*

**26. అథ చైనం నిత్య జాతం నిత్యం వా మన్యసే మృతమ్ ।**
**తథాపి త్వం మహాబాహో నైవం శోచితు మర్హసి ॥**

*భావం : ఓ అర్జునా! ఒకవేళ ఈ ఆత్మకి జననమరణాలు ఉన్నాయని నువ్వు భావించినా, దుఃఖించాల్సిన అవసరం లేదు.*

**27. జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యేర్థే న త్వం శోచితు మర్హసి ॥**

*భావం : ఎందుకంటే, పుట్టినవాడికి మరణం తప్పదు. మరణించిన వాడికి పుట్టుకా తప్పదు. తప్పనిసరి అయిన ఈ విషయంలో నువ్వు శోకించడం సరైంది కాదు.*

**28. అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత ।**
**అవ్యక్త నిధనాన్యేవ తత్ర కా పరిదేవనా ॥**

*భావం : ఓ అర్జునా! ప్రాణులన్నీ పుట్టడానికి మునుపు కంటికి కనపడవు. పుట్టాక కనపడి, మరణించాక మళ్ళీ కనపడవు. అలాంటి దేహం గురించి దుఃఖం దేనికి?*

**29. ఆశ్చర్యవత్పశ్యతి కశ్చిదేన**
**మాశ్చర్యవద్వదతి తథైవ చాన్యః ।**
**ఆశ్చర్యవచ్చైనమన్యశ్శృణోతి**
**శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్ ॥**

*భావం : ఈ ఆత్మని ఒకడు ఆశ్చర్యకరమైనదిగా చూస్తాడు. ఇంకొకడు దీని గురించి ఆశ్చర్యమైనదిగా చెప్తాడు. మరొకడు ఆత్మ గురించి ఆశ్చర్యమైన దానిలా వింటాడు. ఈ ముగ్గురికీ దీని గురించి ఏమీ తెలియదు. (అనుభవానికి రాలేదు)*

**30. దేహీ నిత్యమవధ్యోయం దేహే సర్వస్య భారత ।**
**తస్మాత్సర్వాణి భూతాని న త్వం శోచితుమర్హసి ॥**

*భావం : అర్జునా! సమస్త ప్రాణుల దేహాల్లో ఉండే ఈ ఆత్మ ఎన్నడూ చంపబడదు. అందువల్ల ఏ ప్రాణుల గురించీ నువ్వు దుఃఖించకు.*

**31. స్వధర్మమపి చావేక్ష్య న వికంపితు మర్హసి ।**
**ధర్మ్యాద్ధి యుద్ధా చ్ఛ్రేయోన్యత్ క్షత్రియస్య న విద్యతే ॥**

*భావం : అంతేకాక, నీ స్వధర్మమైన (క్షత్రియధర్మం) ధర్మయుద్ధాన్ని మించిన మేలైనది ఇంకోటి లేదు కదా?*

**32. యదృచ్ఛయా చోపపన్నం స్వర్గద్వారమపావృతమ్ ।**
**సుఖినః క్షత్రియాః పార్థ లభంతే యుద్ధమీదృశమ్ ॥**

*భావం : ఓ అర్జునా! కాకతాళీయంగా లభించే స్వర్గద్వారం లాంటి ఇలాంటి యుద్ధాన్ని ఏ క్షత్రియులు పొందుతారో వారు ధన్యులు.*

**33. అథ చేత్త్వమిమం ధర్మ్యం సంగ్రామం న కరిశ్యసి ।**
**తతస్వధర్మం కీర్తిం చ హిత్వా పాపమవాప్స్యసి ॥**

*భావం : నువ్వు ధర్మబద్ధమైన యుద్ధం చేయకపోతే, నీ స్వధర్మం నించి పారిపోయిన వాడివై, కీర్తిని కోల్పోయి పాపాన్ని కూడగట్టుకుంటావు.*

**34. అకీర్తిం చాపి భూతాని కథయిష్యంతి తేవ్యయామ్ ।**
**సంభావితస్య చా కీర్తి ర్మరణా దతిరిచ్యతే ॥**

*భావం : లోకులంతా చిరకాలం నీ అపకీర్తి గురించి చెప్పుకుంటారు. గౌరవప్రదమైన వ్యక్తికి అపకీర్తి మరణం కంటే బాధాకరమైంది.*

**35. భయాద్రణా దుపరతం మంస్యంతే త్వాం మహారథాః ।**
**యేషాం చ త్వం బహుమతో భూత్వా యాస్యసి లాఘవమ్ ॥**

*భావం : పైగా ఏ మహారథులంతా నిన్ను గౌరవిస్తున్నారో వారంతా యుద్ధం నించి భయంతో వెనక్కి తగినవాడిగా నిన్ను భావిస్తారు.*

**36. అవాచ్యవాదాంశ్చ బహూన్ వదిష్యంతి తవాహితాః ।**
**నిందంతస్తవ సామర్థ్యం తతో దుఃఖతరం ను కిమ్ ॥**

*భావం : నీ శత్రువులు నీ సామర్థ్యాన్ని నిందించి అనేక అనరాని మాటలు అంటారు. దాన్ని మించిన దుఃఖం ఏముంటుంది?*

**37. హతో వా ప్రాప్స్యసే స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్ ।**
**తస్మాదుత్తిష్ఠ కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః ॥**

*భావం : అర్జునా! ఒకవేళ నువ్వు ఈ యుద్ధంలో మరణిస్తే వీరస్వర్గం ప్రాప్తిస్తుంది. అలా కాక నువ్వు జయిస్తే రాజభోగాలని అనుభవిస్తావు. అందువల్ల యుద్ధం చెయ్యి.*

**38. సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ ।**
**తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి ॥**

*భావం : సుఖదుఃఖాలని, లాభనష్టాలని, జయాపజయాలని సమానంగా తీసుకుని యుద్ధానికి సిద్ధమవు. ఇలా చేస్తే నీకు పాపం అంటదు.*

**39. ఏషా తేభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగే త్విమాం శృణు ।**
**బుద్ధ్యా యుక్తో యయా పార్థ కర్మబంధం ప్రహాస్యసి ॥**

*భావం : ఓ అర్జునా! ఇంతదాకా ఆత్మ తత్త్వాన్ని జ్ఞానదృష్టితో నీకు చెప్పాను. దాన్ని మళ్ళీ కర్మయోగ దృష్టితో నీకు వివరిస్తాను. దాన్ని నువ్వు ఆకళింపు చేసుకుంటే కర్మ బంధం నించి విముక్తుడివి అవుతావు. విను.*

**40. నేహాభిక్రమనాశోస్తి ప్రత్యవాయో న విద్యతే ।**
**స్వల్పమప్యస్య ధర్మస్య త్రాయతే మహతో భయాత్ ॥**

*భావం : కర్మయోగం నిష్ఫలం అవడం అంటూ ఉండదు. విరుద్ధ ఫలితాలు కూడా ఉండవు. ఈ కర్మయోగానుష్ఠానం కొద్దిగా ఆచరించినా అది (జన్మ మృత్యురూపమైన) భయం నించి రక్షిస్తుంది. (కర్మని నిష్కామ కర్మగా అర్థం చేసుకోవాలి)*

**41. వ్యవసాయాత్మికా బుద్ధిరేకేహ కురునందన ।**
**బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయో వ్యవసాయినామ్ ॥**

భావం : ఓ అర్జునా! ఈ కర్మయోగ ఆచరణలో స్థిరమైన బుద్ధి ఒక్కటే ముఖ్యం. నిశ్చయం లేని వారి బుద్ధులు అనేక విధాలుగా (కోరికల వెంట పరుగులు తీస్తూ) అనంతంగా వ్యాపించి ఉంటాయి.

**42. యామిమాం పుష్పితాం వాచం ప్రవదంత్యవిపశ్చితః ।**
**వేదవాదరతాః పార్థ నాన్యదస్తీతివాదినః ॥**

**43. కామాత్మానః స్వర్గపరా జన్మకర్మఫలప్రదామ్ ।**
**క్రియావిశేషబహులాం భోగైశ్వర్యగతిం ప్రతి ॥**

**44. భోగైశ్వర్యప్రసక్తానాం తయాపహృతచేతసామ్ ।**
**వ్యవసాయాత్మికా బుద్ధిస్సమాధౌ న విధీయతే ॥**

భావం : ఓ అర్జునా! వేదాల్లో కోరికలు తీరే విషయాన్ని తెలిపే (బాహ్యార్థ) భాగాల మీద ఇష్టం కలవారు, అందులో చెప్పిన 'స్వర్గానికి మించింది ఏదీ లేదని' వాదించేవారు, ప్రాపంచిక సుఖాల మీద మనసు పడ్డవారు, స్వర్గాసక్తి కలవారు అవివేకులు. జన్మ, కర్మలని ఫలంగా ఇచ్చే వివిధ కార్యకలాపాలు సత్ఫలితాన్ని ఇవ్వవని తెలియక, ఫలశూన్యమైన మాటలని నమ్మి, భోగైశ్వర్యాల మీద మనసు పడి, భోగభాగ్యాలు కోరే ప్రజలకి దైవధ్యానం మీద ఏకాగ్రబుద్ధి కలగనే కలగదు.

**45. త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।**
**నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥**

భావం : *ఓ అర్జునా! వేదాలు త్రిగుణాలని (సత్త్వ, రజస్సు, తమో గుణాలు) తెలియచేస్తాయి. నువ్వు త్రిగుణాలని, సుఖం దుఃఖం అనే ద్వంద్వాలని వదిలి సదా శుద్ధ సత్త్వాన్ని ఆశ్రయించు. యోగక్షేమాలని పట్టించుకోక ఆత్మ జ్ఞానివవు.*

**46. యావానర్థ ఉదపానే సర్వతస్సంప్లుతోదకే ।**
**తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥**

భావం : *చిన్న బావుల వల్ల ఏ ప్రయోజనం కలుగుతుందో పెద్ద నది వల్ల కూడా అదే ప్రయోజనం కలుగుతుంది. అలాగే సమస్త వేదాల వల్ల కలిగే ప్రయోజనం బ్రహ్మజ్ఞానం వల్ల కలుగుతుంది.*

**47. కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।**
**మా కర్మఫలహేతుర్భూర్మాతే సంగోస్త్వ కర్మణి ॥**

భావం : నీకు కర్మాచరణ మీదే అధికారం ఉంది. కాని కర్మఫలాల మీద అధికారం లేదు. కర్మఫలానికి నువ్వు కారణం కాకూడదు. అలాగే కర్మలని మానద్దు. ప్రతిఫలాపేక్ష లేని బుద్ధితో కర్మలని ఆచరించు.

**48. యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ ।**
**సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥**

భావం : ఓ అర్జునా! నువ్వు యోగనిష్ఠలో ఉండి, నేను, నాది అనే అభిమానాన్ని వదిలిపెట్టి, ఫలితం వచ్చినా రాకపోయినా సమబుద్ధితో కర్మలని చేస్తూనే ఉండు. అలాంటి సమబుద్ధినే యోగం అంటారు.

**49. దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ ।**
**బుద్ధౌశరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః ॥**

భావం : ఓ అర్జునా! సమత్త్వబుద్ధి యోగం (నిష్కామకర్మ) కంటే ఫలాపేక్షతో కూడిన కర్మ తక్కువ. కాబట్టి అలాంటి సమత్వబుద్ధి కర్మలనే చేస్తూండు. కర్మఫలాన్ని కోరేవారు దీనులు.

**50. బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే ।**
**తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ ॥**

భావం : సమత్వబుద్ధితో కర్మని చేసేవాడు ఈ జన్మలోనే పుణ్యపాపాలు రెంటినీ తొలగించుకుంటున్నాడు. కాబట్టి అలాంటి సమత్వ బుద్ధితో కర్మలని చేయడమే, కర్మలందు నేర్పరితనం అవుతుంది. దీన్నే (కర్మ) యోగం అంటారు.

**51. కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః ।**
**జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయమ్ ॥**

భావం : సమత్వబుద్ధితో కర్మలు చేసే వివేకులు వాటి ఫలాలని వదిలేయడంతో జనన మరణ బంధం నించి విడుదల పొంది దుఃఖం లేని పరమపదాన్ని పొందుతారు.

**52. యదా తే మోహకలిలం బుద్ధిర్వ్యతితరిష్యతి ।**
**తదా గంతాసి నిర్వేదం శ్రోతవ్యస్య శ్రుతస్య చ ॥**

*భావం : నీ బుద్ధి ఎప్పుడు అజ్ఞానం అనే మాలిన్యం నించి బయట పడుతుందో అప్పుడు విన్న, వినబోయే వాటి మీద విరక్తిని పొందుతావు.*

**53. శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా ।**
**సమాధా వచలా బుద్ధి స్తదా యోగమవాప్స్యసి ॥**

*భావం : అనేక మాటలని వినడం వల్ల అయోమయానికి గురైన నీ బుద్ధి, ఎప్పుడు పరమాత్మ ధ్యానంలో నిశ్చలంగా, స్థిరంగా ఉంటుందో అప్పుడు నువ్వు ఆత్మ సాక్షాత్కారాన్ని పొందగలవు.*

**అర్జున ఉవాచ**

**54. స్థితప్రజ్ఞస్య కా భాషా సమాధిస్థస్య కేశవ ।**
**స్థితధీః కిం ప్రభాషేత కిమాసీత వ్రజేత కిమ్ ॥**

*భావం : అర్జునుడు అడిగాడు. ఓ కృష్ణా! సమాధిస్థితి పొందిన స్థితప్రజ్ఞుడి లక్షణాలేమిటి? అతను ఎలా మాట్లాడతాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా ప్రవర్తిస్తాడు?*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**55. ప్రజహాతి యదా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్ ।**
**ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థితప్రజ్ఞస్తదోచ్యతే ॥**

*భావం : భగవంతుడు చెప్పాడు. ఓ అర్జునా! ఎవడు మనసులోని సమస్త కోరికలని ఎప్పుడు పూర్తిగా వదిలేసి ఆత్మలోనే, ఆత్మతో తృప్తి చెందుతాడో (మోక్షాన్ని పొందినవాడు) అతన్ని స్థితప్రజ్ఞుడు అంటారు.*

**56. దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః ।**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే ॥**

*భావం : దుఃఖాలకి కృంగిపోనివాడు, సుఖాల మీద ఆసక్తి లేనివాడు, అనురాగం, భయం, కోపం, ద్వేషం పూర్తిగా పోయినవాడిని స్థితప్రజ్ఞుడు అంటారు.*

**57. యస్సర్వత్రానభిస్నేహ స్తత్తత్ప్రాప్య శుభాశుభమ్ ।**
**నాభినందతి న ద్వేష్టి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

*భావం : దేని మీదా మమత లేక, అనుకూల, ప్రతికూల పరిస్థితుల్లో ఆనందం, ద్వేషం లేనివాడే స్థితప్రజ్ఞుడు.*

**58. యదా సంహరతే చాయం కూర్మోంగానీవ సర్వశః ।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్య తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

*భావం : తాబేలు అన్ని అవయవాలని లోపలికి ముడుచుకున్నట్లు ఇంద్రియాలని ఎవడు వాటికి ఆసక్తి గల విషయాల నించి ఉపసంహరించుకుంటాడో అతని జ్ఞానం స్థిరం అవుతుంది. అతడే స్థితప్రజ్ఞుడు.*

**59. విషయా వినివర్తంతే నిరాహారస్య దేహినః ।**
**రసవర్జం రసోప్యస్య పరం దృష్ట్వా నివర్తతే ॥**

*భావం : ఇంద్రియాలు ఇచ్చే సుఖదుఃఖాలని గ్రహించని వాడి నించి అవి తొలగిపోతాయి. కానీ ఇంద్రియసుఖాల వాసన పోదు. ఐతే పరమాత్మని దర్శించాకే (ఆత్మ సాక్షాత్కారం పొందాకే) ఆ వాసనలు తొలగిపోతాయి.*

**60. యతతో హ్యపి కౌంతేయ పురుషస్య విపశ్చితః ।**
**ఇంద్రియాణి ప్రమాథీని హరంతి ప్రసభం మనః ॥**

*భావం : ఓ అర్జునా! ఆత్మ సాక్షాత్కారం కోసం ప్రయత్నించే పండితుడి మనసుని ఇంద్రియాలు క్షోభ పెడుతూ విషయ సుఖాల వైపు బలవంతంగా లాక్కు పోతూంటాయి.*

**61. తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।**
**వశే హి యస్యేంద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

*భావం : తన ఇంద్రియాలు అన్నిటినీ వశపరచుకుని, మనసుని స్థిరంగా నా మీదే (ఆత్మ మీదే) లగ్నం చేసుకుని ఉండాలి. ఎందుకంటే, ఎవరికి ఇంద్రియాలు స్వాధీనంలో ఉంటాయో, అతని జ్ఞానం స్థిరంగా ఉంటుంది.*

**62. ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే ।**
**సంగాత్ సంజాయతే కామః కామాత్క్రోధోభిజాయతే ॥**

*భావం : సుఖాల గురించి ఆలోచించే వాడికి వాటి మీద ఆసక్తి కలుగుతుంది. ఆసక్తి లోంచి కోరిక పుడుతుంది. కోరిక లోంచి (అది నెరవేరక పోతే) కోపం పుడుతుంది.*

**63. క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతివిభ్రమః ।**
**స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశాత్ ప్రణశ్యతి ॥**

*భావం : కోపంలోంచి అవివేకం (ఏం చేస్తున్నాడో, మాట్లాడుతున్నాడో తెలియని స్థితి) కలుగుతుంది. ఆ అవివేకం లోంచి మరపు, ఆ మరపుతో బుద్ధి నశిస్తుంది. బుద్ధి నశించగానే మనిషి నశించిపోతాడు (పూర్తిగా చెడినవాడు అవుతాడు)*

**64. రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్ ।**
**ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి ॥**

*భావం : మనసుని ఆధీనంలో ఉంచుకున్నవాడు రాగద్వేషాలు లేకుండా తన ఆధీనంలో ఉన్న ఇంద్రియాలతో అన్నపానాది విషయాలు అనుభవిస్తున్నా, మనశ్శాంతిని పొందుతాడు.*

**65. ప్రసాదే సర్వదుఃఖానాం హానిరస్యోపజాయతే ।**
**ప్రసన్నచేతసో హ్యాశు బుద్ధిః పర్యవతిష్ఠతి ॥**

*భావం : మనశ్శాంతి వల్ల అతని సమస్త దుఃఖాలు నశిస్తాయి. మనసు తేలికగా పరమాత్మ మీద స్థిరమవుతుంది.*

**66. నాస్తి బుద్ధిరయుక్తస్య న చాయుక్తస్య భావనా ।**
**న చా భావయతః శాంతిరశాంతస్య కుతః సుఖమ్ ॥**

*భావం : ఇంద్రియ నిగ్రహం లేని వాడికి వివేక బుద్ధి కలగదు. ఆత్మచింతన కూడా కలగదు. అవి లేనివాడికి శాంతి లభించదు. శాంతి లేని వాడికి సుఖం ఎలా లభిస్తుంది?*

**67. ఇంద్రియాణాం హి చరతాం యన్మనోను విధీయతే ।**
**తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావమివాంభసి ॥**

*భావం : సుఖాలని కోరే ఇంద్రియాలలో ఏ ఇంద్రియం మీద మనసు ఆసక్తి చూపిస్తుందో ఆ ఒక్క ఇంద్రియమే నీటి మీది పడవని గాలి ఎలా నెట్టేస్తుందో అలా మనిషి వివేకాన్ని లాక్కుపోతుంది.*

**68. తస్మాద్యస్య మహాబాహో! నిగృహీతాని సర్వశః ।**
**ఇంద్రియాణీంద్రియార్థేభ్యః తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥**

*భావం : ఓ అర్జునా! కాబట్టి ఎవరు తమ ఇంద్రియాలని సుఖాల మీదకి పోనీయకుండా పూర్తిగా అరికడతారో అతని జ్ఞానం స్థిరంగా ఉంటుంది.*

**69. యా నిశా సర్వ భూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।**
**యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥**

*భావం : సమస్త ప్రాణులకి ఏది (తత్త్వం) రాత్రి అయి (కనపడక) ఉంటుందో అది ఇంద్రియ నిగ్రహం గల యోగికి పగలుతో సమానం. (ఎరుకతో ఉంటాడు) దేని యందు ప్రాణులు మేల్కొని ఉన్నారో (భోగాసక్తిగా ఉన్నారో) అది తత్త్వవేత్తలకి రాత్రి. (భోగాలు కోరరు)*

**70. ఆపూర్వమాణమచలప్రతిష్ఠం**
**సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।**
**తద్వత్కామా యం ప్రవిశంతి సర్వే**
**స శాంతి మాప్నోతి న కామకామీ ॥**

*భావం : నీటితో సంపూర్ణంగా నిండి నిశ్చలంగా ఉన్న సముద్రం లోకి నదులు ఎలా ప్రవేశిస్తున్నాయో, అలాగే భోగాలన్నీ ఎవరిని చేరి అతన్ని చలింప చేయకుండా లీనమవుతాయో ఆ స్థితప్రజ్ఞుడు శాంతిని పొందుతాడు. భోగాసక్తుడు శాంతిని పొందలేడు.*

**71. విహాయ కామాన్ యఃసర్వాన్ పుమాం శ్చరతి నిస్స్పృహః ।**
**నిర్మమో నిరహంకారః స శాంతి మధిగచ్ఛతి ॥**

*భావం : ఎవడు కోరికల మీద ఎలాంటి ఆసక్తి లేకుండా, అన్ని కోరికలని విడిచి అహంకార మమకారాలు లేకుండా ఉంటాడో అతనే శాంతిని పొందుతున్నాడు.*

**72. ఏషా బ్రాహ్మీ స్థితిః పార్థ నైనాం ప్రాప్య విముహ్యతి ।**
**స్థిత్వాస్యా మంతకాలేపి బ్రహ్మనిర్వాణ మృచ్ఛతి ॥**

*భావం : ఓ అర్జునా! బ్రాహ్మీస్థితి అంటే ఇదే. దీనిని పొందినవాడు తిరిగి ఎన్నటికీ మోహాన్ని పొందడు. ఈ స్థితిలో ఉన్న వాడు తుదిశ్వాస సమయంలో కూడా బ్రహ్మానందాన్ని (మోక్షాన్ని) పొందుతాడు.*

**గీతా ధీతా చ యేనాపి భక్తిభావేన చోత్తమా।**
**వేదాశాస్త్రపురాణాని తేనాధీతాని సర్వశః ॥**
భావం : ఉత్తమమైన ఈ గీతా శాస్త్రాన్ని భక్తిభావంతో పారాయణం చేసేవాడు సమస్త వేదాలని, శాస్త్రాలని, పురాణాలని పారాయణం చేసినట్లే అవుతుంది.

# మూడో అధ్యాయం - కర్మయోగం

అర్జున ఉవాచ

1. జ్యాయసీ చేత్కర్మణస్తే మతా బుద్ధిర్జనార్దన ।
తత్కిం కర్మణి ఘోరే మాం నియోజయసి కేశవ ॥

భావం : *అర్జునుడు చెప్పాడు: ఓ కేశవా! జ్ఞానం కంటే కర్మ శ్రేష్ఠమని నువ్వు భావిస్తే అప్పుడు నన్ను ఈ భయంకరమైన (యుద్ధ) కర్మని ఎందుకు చేయమంటున్నావు?*

2. వ్యామిశ్రేణేవ వాక్యేన బుద్ధిం మోహయసీవ మే ।
తదేకం వద నిశ్చిత్య యేన శ్రేయోహమాప్నుయామ్ ॥

భావం : *నీ కలగాపులగపు మాటలతో నా బుద్ధిని కలవరపెడుతున్నావు. కాబట్టి నాకు ఏది శ్రేయస్కరమో దాన్ని (కర్మ,జ్ఞానాల్లో ఒక దాన్ని) నిశ్చయంగా చెప్పు.*

శ్రీ భగవాన్ ఉవాచ

3. లోకేస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ ।
జ్ఞానయోగేన సాంఖ్యానాం కర్మయోగేన యోగినామ్ ॥

భావం : *భగవానుడు చెప్పాడు. ఓ అర్జునా! ఈ లోకంలో ఇదివరకు నేను జ్ఞానమార్గం లోని వారికి జ్ఞానయోగాన్ని కర్మమార్గం లోని వారికి కర్మయోగాన్ని అనుష్ఠించమని చెప్పాను.*

4. **న కర్మణా మనారంభాత్ నైష్కర్మ్యం పురుషోశ్నుతే ।**
**న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి ॥**

భావం : *మనిషి కర్మలని చేయకపోవడం ద్వారా ఆత్మజ్ఞానం పొందడు. కర్మని వదిలిపెట్టినంత మాత్రాన మోక్షసిద్ధిని పొందలేడు.*

5. **న హి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।**
**కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః ॥**

భావం : *ఏ కాలంలోనూ క్షణమైనా కర్మ చేయకుండా ఎవడూ ఉండలేడు. ఎందుకంటే, ప్రకృతి వల్ల పుట్టిన గుణాల చేత ప్రతీ వాడు స్వతంత్రం లేక కర్మని చేస్తూనే ఉన్నాడు.*

6. **కర్మేంద్రియాణి సంయమ్య య ఆస్తే మనసా స్మరన్ ।**
**ఇంద్రియార్థాన్ విమూఢాత్మా మిథ్యాచారః స ఉచ్యతే ॥**

భావం : *ఎవడు కర్మేంద్రియాలని అణచి వేసి, మనసులో భోగాలని స్మరిస్తున్నాడో ఆ మూఢుడ్ని కపటి అంటారు.*

7. **యస్త్వింద్రియాణి మనసా నియమ్యారభతేర్జున ।**
**కర్మేంద్రియైః కర్మయోగమసక్తః స విశిష్యతే ॥**

భావం : *ఓ అర్జునా! ఎవడు ఇంద్రియాలన్నిటినీ మనసుతో వశపరచుకుని, కర్మేంద్రియ జ్ఞానేంద్రియాలని రాగద్వేషాలు లేకుండా ఆచరిస్తున్నడో వాడు శ్రేష్ఠుడు.*

8. **నియతం కురు కర్మత్వం కర్మ జ్యాయో హ్యకర్మణః ।**
**శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః ॥**

భావం : *నువ్వు శాస్త్రాలు విధించిన కర్మని చెయ్యి. కర్మలు మానడం కంటే, చేయడమే ఉత్తమం. కర్మ చేయకపోతే నీకు శరీర నిర్వహణ కూడా సాధ్యం కాదు.*

9. **యజ్ఞార్థాత్ కర్మణోన్యత్ర లోకోయం కర్మబంధనః ।**
**తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగః సమాచర ॥**

భావం : *ఓ అర్జునా! యజ్ఞం కోసం చేసే(లోకం హితం లేదా భక్తి హితమైన) కర్మలు కాక ఇతరమైన కర్మలు చేయడం వల్ల మనుషులు కర్మబంధంలో చిక్కుపడతారు. కాబట్టి ఫలాసక్తి లేకుండా యజ్ఞం కోసమే (నిష్కామ) కర్మని చెయ్యి.*

10. **సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా పురోవాచ ప్రజాపతిః ।**
**అనేన ప్రసవిష్యధ్వమ్ ఏష వోస్త్విష్టకా మధుక్ ॥**

భావం : *బ్రహ్మదేవుడు యజ్ఞాలతో పాటు ప్రజలని సృష్టించి 'ఈ యజ్ఞాల ద్వారా మీరు వృద్ధి చెందండి. ఇవి మీ కోరికలని నెరవేరుస్తాయి' అని చెప్పాడు.*

11. **దేవాన్భావయతానేన తే దేవా భావయంతు వః ।**
**పరస్పరం భావయంతః శ్రేయః పరమవాప్స్యథ ॥**

భావం : *ఈ యజ్ఞాల ద్వారా దేవతలని తృప్తి పరచండి. వారు మిమ్మల్ని తృప్తి పరుస్తారు. ఈ విధంగా మీరు పరస్పరం సంతృప్తి చెందుతూ ఉత్కృష్టమైన శ్రేయస్సుని పొందుతారు.*

12. **ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః ।**
**తైర్దత్తా న ప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః ॥**

భావం : *యజ్ఞంతో సంతృప్తి చెందిన దేవతలు మీకు ఇష్టమైన భోగాలని ప్రసాదిస్తారు. వాటిని ఎవడు తిరిగి ఆ దేవతలకి సమర్పించకుండా తానే అనుభవిస్తాడో వాడు దొంగే అవుతాడు.*

13. **యజ్ఞశిష్టాశినః సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః ।**
**భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్ ॥**

భావం : *యజ్ఞంలో భగవంతుడికి నైవేద్యం పెట్టిన పదార్థాన్ని తినే సజ్జనుడు అన్ని పాపాల నించి విముక్తుడవుతాడు. తమ కోసమే ఆహారాన్ని వండుకునే పాపులు పాపాన్నే తింటున్నారు.*

**14. అన్నాద్భవంతి భూతాని పర్జన్యా దన్నసంభవః ।**
**యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞః కర్మసముద్భవః ॥**

**15. కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్ ।**
**తస్మాత్ సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్ ॥**

భావం : *అన్నం నించి ప్రాణులు జన్మిస్తున్నాయి. వర్షాల వల్ల ఆహారం ఉత్పత్తి అవుతోంది. యజ్ఞం వల్ల వర్షాలు కురుస్తాయి. సత్కర్మల వల్ల యజ్ఞం చేయబడుతోంది. వేదాల వల్ల సత్కర్మలు కలుగుతున్నాయి. వేదాలు కాలాతీతుడైన పరమాత్మ నించి పుట్టాయి. అందువల్ల సర్వవ్యాపి అయిన పరమాత్మ సర్వదా యజ్ఞాలలోనే ఉంటాడని తెలుసుకో.*

**16. ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః ।**
**అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి ॥**

భావం : *ఓ అర్జునా! ఈ ప్రకారం కొనసాగే సృష్టిచక్రాన్ని అనుసరించి నడచుకోని వాడు ఇంద్రియ సుఖలోలుడై వ్యర్థంగా పాపజీవితాన్ని గడుపుతున్నాడు.*

**17. యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః ।**
**ఆత్మన్యేవ చ సంతుష్టస్తస్య కార్యం న విద్యతే ॥**

భావం : *ఎవడు ఆత్మలోనే క్రీడిస్తూ, ఆత్మతోనే తృప్తిని పొందుతూ ఆత్మతోనే సంతోషపడతాడో అలాంటి వాడికి (ఆత్మ జ్ఞానికి) చేయాల్సిన కర్తవ్యం అంటూ ఏదీ ఉండదు.*

**18. నైవ తస్య కృతేనార్థో నాకృతేనేహ కశ్చన ।**
**న చాస్య సర్వభూతేషు కశ్చిదర్థవ్యపాశ్రయః ॥**

*భావం : అలాంటి మహాత్ముడికి ఈ లోకంలో కర్మ చేయడం వల్ల ప్రయోజనం కానీ, చేయకపోవడం వల్ల దోషం కానీ ఉండదు. అతనికి సర్వప్రాణులతో ఏదో ప్రయోజనం కోరి (స్వార్థపూరితమైనది) చేయాల్సిన కర్మ కూడా ఏదీ ఉండదు.*

**19. తస్మాదసక్తః సతతం కార్యం కర్మ సమాచర ।**
**అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః ॥**

*భావం : అందువల్ల నువ్వు రాగద్వేషాలు లేకుండా చేయాల్సిన కర్మని చక్కగా చేస్తూండు. ఫలాపేక్ష లేకుండా కర్మని చేసేవాడు మోక్షాన్ని పొందుతాడు.*

**20. కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః ।**
**లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి ॥**

*భావం : జనకుడు మొదలైన వారు నిష్కామకర్మ చేతనే మోక్షాన్ని పొందారు. నువ్వు ప్రజలని సన్మార్గంలో నడిపించే ఉద్దేశంతో అయినా కర్మలని చేయాలి.*

**21. యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః ।**
**స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥**

*భావం : ఉత్తముడు చేసే పనినే మిగిలిన వారు కూడా చేస్తారు. అతను దేన్ని ప్రమాణంగా తీసుకుని చేస్తాడో లోకులు కూడా దాన్నే అనుసరిస్తారు.*

**22. న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన ।**
**నానవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి ॥**

*భావం : ఓ అర్జునా! నాకు ముల్లోకాల్లో చేయాల్సిన పని అంటూ ఏదీ లేదు. నేను పొందింది, పొందాల్సింది అంటూ లేదు. అయినా నేను కర్మలు చేస్తూనే ఉన్నాను.*

**23. యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః ।**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥**

*భావం : ఓ పార్థా! ఎందుకంటే, నేను ఎప్పుడైనా చురుకుగా కర్మలని చేయకపోతే మనుషులు అన్ని విధాల నా మార్గాన్నే (దాన్నే) అనుసరిస్తారు.*

**24. ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మచేదహమ్ ।**
**సంకరస్య చ కర్తా స్యాముపహన్యామిమాః ప్రజాః ॥**

*భావం : కర్మలు చేయకపోతే ప్రజలంతా చెడిపోతారు. నేను అల్లకల్లోలానికి కారణం అవుతాను. ప్రజలని చెడగొట్టిన వాడిని కూడా అవుతాను.*

**25. సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత ।**
**కుర్యాద్విద్వాం స్తథాసక్తః చికీర్షుర్లోకసంగ్రహమ్ ॥**

*భావం : ఓ అర్జునా! అజ్ఞానులు కర్మల మీది ఆసక్తితో ఎలా వాటిని ఆచరిస్తున్నారో, జ్ఞానులు అలాగే వాటిలో చిక్కుకోకుండా ఆసక్తిరహితులై లోకకళ్యాణం కోసం కర్మలని చేయాలి.*

**26. న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసంగినామ్ ।**
**జోషయే త్సర్వకర్మాణి విద్వాన్యుక్తః సమాచరన్ ॥**

*భావం : ఫలాసక్తితో కర్మలు చేసే అజ్ఞానుల బుద్ధిని మరల్చే ప్రయత్నం జ్ఞాని చేయకూడదు. తాను అన్ని కర్మలని నేర్పుతో ఆచరిస్తూ, చూసేవారు ఆ ప్రకారం అనుష్ఠించేలా చేయాలి.*

**27. ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః ।**
**అహంకార విమూఢాత్మా కర్తాహమితి మన్యతే ॥**

*భావం : ప్రకృతి వల్ల పుట్టిన గుణాలతోనే అన్ని పనులు చేయబడుతున్నాయి. కాని అవివేకుడైన వాడు అహంకారంతో 'నేనే చేస్తున్నాను' అని భావిస్తున్నాడు.*

**28. తత్త్వవిత్తు మహాబాహో గుణకర్మవిభాగయోః ।**
**గుణా గుణేషు వర్తంత ఇతి మత్వా న సజ్జతే ॥**

భావం : *ఓ అర్జునా! గుణాలు, కర్మల గురించి తెలిసిన జ్ఞాని, ఇంద్రియాలు భోగాల మీద ఆసక్తితో ఉంటాయని తెలిసి వాటితో సంబంధం కలిగి ఉండదు.*

**29. ప్రకృతేర్గుణసమ్మూఢాః సజ్జంతే గుణకర్మసు ।**
**తానకృత్స్నవిదో మందాన్ కృత్స్నవిన్న విచాలయేత్ ॥**

భావం : *ప్రకృతి యొక్క త్రిగుణాలతో మోహితులైనవారు ఆ గుణాల మీద, కర్మల మీద ఆసక్తి కలిగి ఉంటారు. అలాంటి జ్ఞానహీనులైన మందమతులని అన్నీ తెలిసిన జ్ఞాని చలింపచేయకూడదు. (కర్మలని మానేట్లు చేయకూడదు)*

**30. మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మ చేతసా ।**
**నిరాశీర్నిర్మమో భూత్వా యుధస్వ విగతజ్వరః ॥**

భావం : *కర్మలన్నిటినీ నాకు (పరమాత్మకి) ఆధ్యాత్మ మనసుతో సమర్పించి ఆశ, మమకారం లేని వాడివై, దుఃఖం మాని యుద్ధం చెయ్యి.*

**31. యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః ।**
**శ్రద్ధావంతో నసూయంతో ముచ్యంతే తేపి కర్మభిః ॥**

భావం : *ఎవరు అసూయ లేకుండా ఎల్లప్పుడూ (నేను చెప్పిన) ఈ మాటలని శ్రద్ధగా అనుసరిస్తారో వారు కూడా కర్మబంధం నించి విముక్తి చెందుతారు.*

**32. యే త్వేతదభ్యసూయంతో నానుతిష్ఠంతి మే మతమ్ ।**
**సర్వజ్ఞానవిమూఢాంస్తాన్ విద్ధి నష్టానచేతసః ॥**

భావం : *ఎవరు నేను చెప్పిన ఈ అభిప్రాయాన్ని (నిష్కామకర్మని) ద్వేషిస్తూ అనుసరించరో వారు బుద్ధిహీనులై, ఏ విధమైన జ్ఞానం లేనివారై నష్టపోతారని తెలుసుకో.*

**33. సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవానపి ।**
**ప్రకృతిం యాంతి భూతాని నిగ్రహః కిం కరిష్యతి ॥**

భావం : *(లౌకిక) జ్ఞాని తన స్వభావం ప్రకారమే నడుచుకుంటాడు. సర్వప్రాణులు కూడా తమ స్వభావాన్ని అనుసరించే నడుచుకుంటాయి. కాబట్టి నిగ్రహం ఏమి చేయగలదు? (కర్మలని ఎలా వదిలేయగలరు?)*

**34. ఇంద్రియస్యేంద్రియస్యార్థే రాగద్వేషౌ వ్యవస్థితౌ ।**
**తయోర్న వశమాగచ్ఛేత్ తౌ హ్యస్య పరిపంథినౌ ॥**

భావం : *ప్రతీ ఇంద్రియానికి అది అనుభవించే భోగాల మీద ఇష్టాయిష్టాలు ఏర్పడి ఉన్నాయి. ఆ రెండూ మనుషులకి శత్రువులు.*

**35. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।**
**స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః ॥**

భావం : *చక్కగా చేయబడే ఇతరుల ధర్మం కంటే, సుగుణం లేకపోయినా తన ధర్మమే శ్రేష్టమైనది. తన ధర్మాచరణలో మరణమైనా మంచిదే. పర ధర్మం చేయటం భయంకరమైనది.*
*(స్వధర్మాన్ని ఆత్మోన్నతిగా, పర ధర్మాన్ని లౌకిక జీవితంగా పెద్దలు విశ్లేషించారు)*

**అర్జున ఉవాచ**

**36. అథ కేన ప్రయుక్తోయం పాపం చరతి పూరుషః ।**
**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥**

భావం : *అర్జునుడు అడిగాడు: ఓ కృష్ణా! కానీ మనిషి ఇష్టం లేకపోయినా ప్రేరేపించబడి, నియోగించబడ్డ వాడిలా బలవంతంగా ఎందువల్ల పాపాన్ని ఆచరిస్తున్నాడు?*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**37. కామ ఏష క్రోధ ఏష రజోగుణసముద్భవః ।**
**మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥**

*భావం : శ్రీకృష్ణుడు చెప్పాడు. ఓ అర్జునా! దీనికి రజోగుణం నించి పుట్టిన కోరిక కారణం. ఈ కోరికే (తీరకపోతే) క్రోధంగా మారుతుంది. కోరిక భోగాలతో చల్లారదు. మహాపాపాలకి కారణమైన ఈ కోరికని మోక్షమార్గంలో శత్రువు అని తెలుసుకో.*

**38. ధూమేనావ్రియతే వహ్నిః యథాదర్శో మలేన చ ।**
**యథోల్బేనావృతో గర్భస్తథా తేనేదమావృతమ్ ॥**

*భావం : పొగ చేత అగ్ని, మురికి చేత అద్దం, మాయ చేత గర్భమందలి శిశువు ఎలా కప్పబడి ఉంటాయో అలా జ్ఞానం కోరికతో కప్పబడి ఉంది.*

**39 ఆవృతం జ్ఞానమేతేన జ్ఞానినో నిత్యవైరిణా ।**
**కామరూపేణ కౌంతేయ దుష్పూరేణానలేన చ ॥**

*భావం : ఓ అర్జునా! కోరిక ఎన్నటికీ చల్లార్చలేని అగ్ని లాంటిది. జ్ఞానికి సదా శత్రువైన ఈ కోరిక చేత (లౌకికుడి) జ్ఞానం కప్పబడి ఉంది.*

**40. ఇంద్రియాణి మనో బుద్ధిరస్యాధిష్ఠానముచ్యతే ।**
**ఏతైర్విమోహయత్యేష జ్ఞానమావృత్య దేహినమ్ ॥**

*భావం : ఇంద్రియాలు, మనసు, బుద్ధి ఈ కోరికకి నివాస స్థానాలు. వీటిలో కోరిక (ఆత్మ) జ్ఞానాన్ని కప్పి, మనిషిని మోహితుడిగా (వాటిని వదలనీకుండా) చేస్తోంది.*

**41. తస్మాత్ త్వమింద్రియాణ్యాదౌ నియమ్య భరతర్షభ ।**
**పాప్మానాం ప్రజహి హ్యేనం జ్ఞానవిజ్ఞాననాశనమ్ ॥**

*భావం : ఓ అర్జునా! కాబట్టి నువ్వు మొదటగా ఇంద్రియాలని వశపరచుకో. జ్ఞానవిజ్ఞానాలని నాశనం చేసే మహాపాపమైన ఈ కోరికని తప్పకుండా సంపూర్ణంగా నశింపచెయ్యి.*

**42. ఇంద్రియాణి పరాణ్యాహుః ఇంద్రియేభ్యః పరం మనః ।**
**మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః ॥**

*భావం : దేహం కంటే ఇంద్రియాలు గొప్పవి. ఇంద్రియాల కంటే మనసు గొప్పది. మనసు కంటే బుద్ధి గొప్పది. బుద్ధి కంటే శ్రేష్ఠమైనది ఆత్మ అని పెద్దలు చెప్తారు.*

**43. ఏవం బుద్ధేః పరం బుద్ధ్వా సంస్తభ్యాత్మానమాత్మనా ।**
**జహి శత్రుం మహాబాహో కామరూపం దురాసదమ్ ॥**

*భావం : ఓ అర్జునా! ఈ ప్రకారం ఆత్మ బుద్ధి కంటే శ్రేష్ఠమైనదని తెలుసుకుని బుద్ధితో (వివేకంతో) మనసుని లొంగదీసుకుని జయించడానికి కష్టమైన కోరిక అనే శత్రువుని నిర్మూలించు.*

**సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః ।**
**పార్థోవత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ ॥**
భావం : ఉపనిషత్తులనే ఆవుల నించి, గోపాల కృష్ణుడు పితికే గీతామృతం అనే పాలకి అర్జునుడు దూడ. సద్బుద్ధి గల జిజ్ఞాసులు కూడా ఆ పాలని తాగుతారు.

# నాలుగో అధ్యాయం - జ్ఞాన యోగం

శ్రీ భగవాన్ ఉవాచ

1 ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహమవ్యయమ్ ।
వివస్వాన్ మనవే ప్రాహ మనురిక్ష్వాకవే బ్రవీత్ ॥

భావం : *భగవానుడు చెప్పాడు: నాశనం లేని ఈ నిష్కామకర్మ యోగాన్ని నేను సూర్యుడికి బోధించాను. సూర్యుడు (తన కొడుకైన) వైవస్వత మనువుకి చెప్పాడు. మనువు (తన కొడుకైన) ఇక్ష్వాకుడికి చెప్పాడు.*

2. ఏవం పరంపరా ప్రాప్తమిమం రాజర్షయో విదుః ।
స కాలేనేహ మహతా యోగో నష్టః పరంతప ॥

భావం : *ఓ అర్జునా! ఇలా పరంపరగా వచ్చిన ఈ నిష్కామకర్మ యోగాన్ని రాజర్షులు తెలుసుకున్నారు. చాలాకాలం గడిచాక ఈ యోగం ఈ లోకంలో అదృశ్యమైంది (ప్రచారంలో లేదు)*

3. స ఏవాయం మయా తేద్య యోగః ప్రోక్తః పురాతనః ।
భక్తోసి మే సఖా చేతి రహస్యం హ్యేతదుత్తమమ్ ॥

భావం : *ఈ యోగం మిక్కిలి శ్రేష్ఠమైనది. గోప్యమైంది. నువ్వు నా భక్తుడివి, మిత్రుడివి కనుక ఈ పురాతనమైన నిష్కామ కర్మయోగాన్ని ఇప్పుడు నీకు చెప్పాను.*

**అర్జున ఉవాచ**

**4. అపరం భవతో జన్మ పరం జన్మ వివస్వతః ।**
**కథమేతద్విజానీయాం త్వమాదౌ ప్రోక్తవానితి ॥**

భావం : *అర్జునుడు చెప్పాడు : నీ జన్మ ఇటీవలిది. సూర్యుడి జన్మ ప్రాచీనమైనది. నువ్వు దీన్ని సూర్యుడికి బోధించావన్న విషయాన్ని నేనెలా నమ్మటం?*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**5. బహూని మే వ్యతీతాని జన్మాని తవ చార్జున ।**
**తాన్యహం వేద సర్వాణి న త్వం వేత్థ పరంతప ॥**

భావం : *కృష్ణుడు చెప్పాడు : ఓ అర్జునా! నీకు, నాకు అనేక జన్మలు గడిచాయి. అవన్నీ నాకు తెలుసు. నీకు తెలియవు.*

**6. అజోపి సన్నవ్యయాత్మా భూతానామీశ్వరోపి సన్ ।**
**ప్రకృతిం స్వామధిష్ఠాయ సంభవామ్యాత్మమాయయా ॥**

భావం : *నేను జన్మలు లేని వాడిని. సదా ఉండేవాడిని. సమస్త ప్రాణులకి ఈశ్వరుడిని అయి నా ప్రకృతిని వశపరచుకుని నా మాయా శక్తితో పుడుతున్నాను. (అవతరిస్తున్నాను)*

**7. యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత ।**
**అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥**

భావం : *ఓ అర్జునా! ఎప్పుడెప్పుడు ధర్మానికి హాని కలిగి, అధర్మం పెరిగిపోతుందో, అప్పుడు నన్ను నేను సృష్టించుకుంటూంటాను.*

**8. పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్ ।**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥**

*భావం : మంచివారిని రక్షించడానికి, దుష్టులని నాశనం చేయడానికి, ధర్మాన్ని సుస్థిరం చేయడానికి ప్రతీ యుగంలో (అవసరమైనప్పుడల్లా) అవతరిస్తూంటాను.*

**9. జన్మ కర్మ చ మే దివ్య మేవం యో వేత్తి తత్త్వతః ।**
**త్యక్త్వా దేహం పునర్జన్మ నైతి మామేతి సోర్జున ॥**

*భావం : ఓ అర్జునా! ఎవరు నా దివ్యమైన జన్మలని, కర్మలని నిజంగా తెలుసు కుంటున్నాడో అతను మరణించాక తిరిగి పుట్టక నన్నే చేరతాడు. (ముక్తిని పొందుతాడు)*

**10. వీతరాగభయక్రోధా మన్మయా మాముపాశ్రితాః ।**
**బహవో జ్ఞానతపసా పూతా మద్భావమాగతాః ॥**

*భావం : కోరిక, భయం, కోపం లేకుండా మనసుని నా మీదే లగ్నం చేసి నన్ను ఆశ్రయించిన అనేకులు (జ్ఞానులు, భక్తులు) జ్ఞాన తపస్సుతో పవిత్రులై మోక్షాన్ని పొందారు.*

**11. యే యథా మాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్ ।**
**మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥**

*భావం : ఓ అర్జునా! ఎవరు ఏ విధంగా నన్ను సేవిస్తారో వారిని ఆ ప్రకారమే నేను అనుగ్రహిస్తాను. మనుషులు అన్ని విధాలా నా మార్గాన్నే అనుసరిస్తారు.*

**12. కాంక్షంతః కర్మణాం సిద్ధిం యజంత ఇహ దేవతాః ।**
**క్షిప్రం హి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా ॥**

*భావం : ఈ లోకంలో కర్మఫలాన్ని కోరేవారు దేవతలని ఆరాధిస్తారు. ఎందుకంటే, మనుష్య లోకంలో కర్మఫలం త్వరగా లభిస్తుంది.*

**13. చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః ।**
**తస్య కర్తారమపి మాం విద్ధ్య కర్తార మవ్యయమ్ ॥**

*భావం : సత్త్వ రజో తామస గుణాలతో చేయబడే కర్మల విభజనని అనుసరించి నాలుగు వర్ణాలని నేనే సృష్టించాను. దీనికి నేను కర్తనైనప్పటికీ (ప్రకృతికి అతీతుడుగా) నేను సృష్టించనివాడిని(కర్త కానట్లు) నాశనరహితుడిని అని తెలుసుకో.*

**14. న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా ।**
**ఇతి మాం యోభిజానాతి కర్మభిర్న స బధ్యతే ॥**

*భావం : నాకు కర్మఫలాపేక్ష లేదు కాబట్టి, నన్ను కర్మలు బంధించవు. ఈ విధంగా నన్ను ఎవడు తెలుసుకుంటారో, వాడు కర్మలతో బంధింపబడడు.*

**15. ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః ।**
**కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్ ॥**

*భావం : పూర్వం ఇది తెలుసుకుని ఎందరో ముముక్షువులు నిష్కామ కర్మలు చేసారు. కాబట్టి నువ్వు వారిలా నిష్కామ కర్మనే ఆచరించు.*

**16. కిం కర్మ కిమకర్మేతి కవయోప్యత్ర మోహితాః ।**
**తత్తే కర్మ ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వా మోక్ష్యసే శుభాత్ ॥**

*భావం : ఏది కర్మ? ఏది అకర్మ? అనే విషయంలో పండితులు కూడా తికమక పడుతున్నారు. దేని వల్ల నువ్వు సంసార బంధం నించి విముక్తుడివి అవుతావో ఆ కర్మని నీకు చక్కగా వివరిస్తాను.*

**17. కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః ।**
**అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః ॥**

*భావం : శాస్త్రం విధించిన కర్మ, నిషేధించిన కర్మల (వికర్మ) గురించి తెలుసుకోవాలి. అలాగే కర్మ చేయకుండా ఉండడం (అకర్మ) గురించి కూడా తెలుసుకోవాలి. ఎందుకంటే కర్మ తత్త్వం చాలా రహస్యమైంది.*

18. **కర్మణ్యకర్మ యః పశ్యేదకర్మణి చ కర్మ యః ।**
**స బుద్ధిమాన్ మనుష్యేషు స యుక్తః కృత్స్నకర్మకృత్ ॥**

భావం : *ఎవరు కర్మలో అకర్మని (కర్తృత్వ భావం లేకుండా చేయడం) అకర్మలో (కర్మ చేయకపోవడం) కర్మని చూస్తారో వాడు మనుషులలో వివేకవంతుడు. అతను యోగి మరియు సమస్త కర్మలని చేసేవాడు అవుతాడు.*

19. **యస్య సర్వే సమారంభాః కామసంకల్పవర్జితాః ।**
**జ్ఞానాగ్ని దగ్ధకర్మాణం తమాహుః పండితం బుధాః ॥**

భావం : *ఎవరి సమస్త కర్మలు, కోరిక, సంకల్పం లేకుండా ఉంటాయో అవి జ్ఞానం అనే అగ్ని చేత భస్మమవుతాయి. అతన్ని జ్ఞానులు మహాత్ముడిగా చెప్తారు.*

20. **త్యక్త్వా కర్మఫలాసంగం నిత్యతృప్తో నిరాశ్రయః ।**
**కర్మణ్యభిప్రవృత్తోపి నైవ కించిత్కరోతి సః ॥**

భావం : *కర్మఫలం మీద ఆసక్తి లేక, ప్రాపంచిక విషయాలని ఆశ్రయించక, సదా సంతృప్తి గలవాడై కర్మలు చేసినా నిజానికి ఆ కర్మలకి అతను కర్త కాదు.*

21. **నిరాశీర్యతచిత్తాత్మా త్యక్తసర్వపరిగ్రహః ।**
**శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥**

భావం : *ఆశ లేనివాడు, మనసుని, ఇంద్రియాలని నిగ్రహించిన వాడు, భోగాలని విడిచిపెట్టిన వాడు శారీరక కర్మలు చేసినా పాపాన్ని పొందడు.*

22. **యదృచ్ఛాలాభసంతుష్టో ద్వంద్వాతీతో విమత్సరః ।**
**సమః సిద్ధావసిద్ధౌ చ కృత్వాపి న నిబధ్యతే ॥**

భావం : *ప్రయత్నించకుండానే దొరికిన దాంతో తృప్తి పొందిన వాడు, సుఖదుఃఖాలనే ద్వంద్వాలకి అతీతుడు, అసూయ లేని వాడు, ఫలప్రాప్తి లభించినా, లభించకపోయినా సమభావంతో ఉండేవాడు కర్మ చేసినా దాని చేత బంధింపబడడు.*

**23. గతసంగస్య ముక్తస్య జ్ఞానావస్థితచేతసః ।**
**యజ్ఞాయాచరతః కర్మ సమగ్రం ప్రవిలీయతే ॥**

భావం : *దేని మీదా బంధం లేనివాడు, ఇష్టాయిష్టాలు (రాగద్వేషాలు) దేహాభిమానం లేని వాడు, పరమాత్మ జ్ఞానం మీదే ఏకాగ్రత గలవాడు కేవలం యజ్ఞం కోసమే (భగవత్ ప్రీతి కోసం) కర్మ చేస్తే అతని కర్మ మొత్తం నశించిపోతుంది.*

**24. బ్రహ్మార్పణం బ్రహ్మ హవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మసమాధినా ॥**

భావం : *యజ్ఞంలోని హోమసాధనాలు బ్రహ్మం. హోమద్రవ్యాలు బ్రహ్మమే. హోమాగ్ని, హోమం చేసేవాడు, హోమం చేయబడింది అన్నీ బ్రహ్మస్వరూపాలే. యజ్ఞం ద్వారా లభించే ఫలితం కూడా బ్రహ్మమే.*

**25. దైవమేవాపరే యజ్ఞం యోగినః పర్యుపాసతే ।**
**బ్రహ్మాగ్నావపరే యజ్ఞం యజ్ఞేనైవోపజుహ్వతి ॥**

భావం : కొందరు యోగులు యజ్ఞంతో దేవతారాధనని చేస్తున్నారు. మరి కొందరు బ్రహ్మాగ్నితో ఆత్మ యజ్ఞాన్ని చేస్తున్నారు.

**26. శ్రోత్రాదీనీంద్రియాణ్యన్యే సంయమాగ్నిషు జుహ్వతి ।**
**శబ్దాదీన్విషయానన్య ఇంద్రియాగ్నిషు జుహ్వతి ॥**

భావం : *కొందరు చెవి మొదలైన పంచేంద్రియాలని నిగ్రహం అనే అగ్నిలో హోమం చేస్తారు. ఇంకొందరు శబ్దం మొదలైన ఇంద్రియ క్రియలని (పంచ జ్ఞానాలు) ఇంద్రియాలనే అగ్నిలో హోమం చేస్తారు.*

**27. సర్వాణీంద్రియకర్మాణి ప్రాణకర్మాణి చాపరే ।**
**ఆత్మసంయమయోగాగ్నౌ జుహ్వతి జ్ఞానదీపితే ॥**

భావం : *మరి కొందరు అన్ని ఇంద్రియాల క్రియలని, ప్రాణాల క్రియలని జ్ఞానంచే ప్రకాశింపబడిన మనోనిగ్రహ యోగం అనే అగ్నిలో హోమం చేస్తారు.*

28. **ద్రవ్యయజ్ఞాస్తపోయజ్ఞా యోగయజ్ఞాస్తథాపరే ।**
**స్వాధ్యాయ జ్ఞానయజ్ఞాశ్చ యతయః సంశితవ్రతాః ॥**

భావం : *కొందరు దానధర్మాలతో యజ్ఞం చేస్తారు. కొందరు తపస్సుతో యజ్ఞం చేస్తారు. కొందరు యోగంతో యజ్ఞం చేస్తారు. ఇంకొందరు వేదాధ్యయనంతో యజ్ఞం చేస్తారు. వారంతా ప్రయత్నంతో పట్టుదలగా ఆ యజ్ఞాలని చేస్తారు.*

29. **అపానే జుహ్వతి ప్రాణం ప్రాణే పానం తథాపరే ।**
**ప్రాణాపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః ॥**

భావం : *ప్రాణాయామాన్ని చేసే కొందరు శ్వాస గతిని నిరోధించి అపాన వాయువులో ప్రాణ వాయువుని, ప్రాణ వాయువులో అపాన వాయువుని హోమం చేస్తారు. (పూరక, కుంభక, రేచకాలు అని భావం)*

30 **అపరే నియతాహారాః ప్రాణాన్ ప్రాణేషు జుహ్వతి ।**
**సర్వేప్యేతే యజ్ఞవిదో యజ్ఞక్ష పితకల్మషాః ॥**

భావం : *ఇంకొందరు ఆహార నియమాలతో ప్రాణ వాయువులందే హోమం చేస్తున్నారు. వీరంతా యజ్ఞాన్ని చేసేవారు. ఆ యజ్ఞాలతో పాపాలు నశిస్తాయి.*

31. **యజ్ఞశిష్టామృతభుజో యాంతి బ్రహ్మ సనాతనమ్ ।**
**నాయం లోకోస్త్యయజ్ఞస్య కుతోన్యః కురుసత్తమ ॥** (31)

భావం : *ఓ కురువంశశ్రేష్ఠా! ఈ యజ్ఞాలు చేసాక లభించే అమృతరూపమైన అన్నాన్ని తినేవారు శాశ్వతమైన పరబ్రహ్మాన్ని పొందుతారు. వీటిలో ఒక్క యజ్ఞాన్నయినా చేయనివాడికి ఈ లోకంలో సుఖం లేదు. ఇక పర లోకంలో సుఖం ఎక్కడిది?*

32. **ఏవం బహువిధా యజ్ఞా వితతా బ్రహ్మణో ముఖే ।**
**కర్మజాన్ విద్ధి తాన్ సర్వానేవం జ్ఞాత్వా విమోక్ష్యసే ॥**

*భావం : ఇలా అనేక విధాలైన యజ్ఞాలు వేదాల్లో సవివరంగా చెప్పబడ్డాయి. అవన్నీ కర్మల నించి పుట్టాయని (కర్మకి సంబంధించినవే అని) తెలుసుకోవడం వల్ల విముక్తుడివి అవుతావు.*

**33. శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప ।**
**సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే ॥**

*భావం : ఓ అర్జునా! ద్రవ్య (దానధర్మాల) యజ్ఞం కంటే, జ్ఞాన యజ్ఞం శ్రేష్ఠమైనది. ఎందుకంటే, (ద్రవ్య యజ్ఞంలో) కర్మలన్నీ నాశనం కాక, జ్ఞాన యజ్ఞంలోనే అవి నశిస్తాయి.*

**34. తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా ।**
**ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః ॥**

*భావం : తత్త్వవేత్తలకి సాష్టాంగ నమస్కారం చేసి, సమయం చూసి వినయంగా ప్రశ్నించి, సేవ చేసి అలాంటి జ్ఞానాన్ని తెలుసుకో. జ్ఞానులు నీకు ఉపదేశిస్తారు.*

**35. యద్ జ్ఞాత్వా న పునర్మోహమేవం యాస్యసి పాండవ ।**
**యేన భూతాన్యశేషేణ ద్రక్ష్యస్యాత్మన్యథో మయి ॥**

*భావం : ఓ అర్జునా! దీన్ని తెలుసుకుంటే మరల ఇలాంటి (అజ్ఞానం) మోహం నువ్వు పొందవు. అలాగే సమస్త ప్రాణులని నీ ఆత్మలో, నాలో కూడా (పరమాత్మలో) చూడగలవు.*

**36. అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాపకృత్తమః ।**
**సర్వం జ్ఞానప్లవేనైవ వృజినం సంతరిష్యసి ॥**

*భావం : నువ్వు అందరు పాపాత్ముల కంటే ఎక్కువ పాపం చేసినా, ఆ సమస్త పాపసముద్రాన్ని జ్ఞానం అనే తెప్పతో చక్కగా దాటగలవు.*

**37. యథైధాంసి సమిద్ధోగ్ని భస్మసాత్కురుతేర్జున ।**
**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥**

*భావం : ఓ అర్జునా! బాగా మండే నిప్పు, కట్టెలని ఎలా బూడిద చేస్తుందో, అలా జ్ఞానం అనే అగ్ని సమస్త కర్మలని భస్మం చేస్తుంది.*

**38. న హి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే ।**
**తత్స్వయం యోగసంసిద్ధః కాలేనాత్మని విందతి ॥**

*భావం : ఈ ప్రపంచంలో జ్ఞానంతో సమానంగా పవిత్రమైంది ఇంకోటి లేదు. అలాంటి జ్ఞానాన్ని చిత్తశుద్ధి గలవాడు కాలక్రమంలో తన లోనే స్వయంగా పొందుతాడు. (అనుభవిస్తాడు)*

**39. శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేంద్రియః ।**
**జ్ఞానం లబ్ధ్వా పరామ్ శాంతిమచిరేణా ధిగచ్ఛతి ॥**

*భావం : శ్రద్ధ గలవాడు, నిష్ఠ గలవాడు, ఇంద్రియాలని పూర్తిగా జయించినవాడు జ్ఞానాన్ని పొందుతాడు. ఆ (ఆత్మ) జ్ఞానం కలిగిన వెంటనే పరమ శాంతిని పొందుతాడు.*

**40. అజ్ఞశ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి ।**
**నాయం లోకోస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥**

*భావం : జ్ఞానం, శ్రద్ధ లేని వాడు, సందేహించే వాడు పూర్తిగా భ్రష్టుడవుతాడు. శంకిత మనస్కుడికి ఇహ లోకంలో కాని పర లోకంలో కానీ ఎలాంటి సుఖం ఉండదు.*

**41. యోగసన్న్యస్తకర్మాణం జ్ఞానసంఛిన్నసంశయమ్ ।**
**ఆత్మవంతం న కర్మాణి నిభధ్నంతి ధనంజయ ॥**

*భావం : ఓ అర్జునా! నిష్కామకర్మ యోగిని, జ్ఞానంతో (వివేకంతో) సందేహాలు నివృత్తి చెందిన బ్రహ్మజ్ఞానిని కర్మలు బంధించవు.*

**42.** **తస్మాదజ్ఞానసంభూతం హృత్స్థం జ్ఞానాసినాత్మనః ।**
**ఛిత్త్వైనం సంశయం యోగమాతిష్ఠోత్తిష్ఠ భారత ॥** (42)

*భావం : ఓ అర్జునా! అందువల్ల నీ మనసులో అజ్ఞానంతో పుట్టిన ఈ సందేహాన్ని జ్ఞానం అనే కత్తితో ఖండించి నిష్కామకర్మ యోగాన్ని ఆచరించు. లే. (యుద్ధం చెయ్యి)*

**గీతా గంగాయ గాయత్రీ గోవిందేతి హృదిస్థితే।**
**చతుర్గకార సమ్యుక్తే పునర్జన్మ నవిద్యతే॥**
భావం : గీత, గంగ, గాయత్రి, గోవిందుడు అనే
ఈ నాలుగు 'గ' కార యుక్త పదార్థాలని ఎవడు
హృదయంలో ధరిస్తాడో అట్టి వాడికి పునర్జన్మ లేదు.

# ఐదో అధ్యాయం - కర్మసన్యాస యోగం

అర్జున ఉవాచ

1. సన్న్యాసం కర్మణాం కృష్ణ పునర్యోగం చ శంససి ।
యచ్ఛ్రేయ ఏతయోరేకం తన్మే బ్రూహి సునిశ్చితమ్ ॥

*భావం : అర్జునుడు చెప్పాడు : ఓ కృష్ణా! నువ్వు ఓసారి కర్మలని వదిలేయాలని చెప్తూ, మరో సారి కర్మయోగాన్ని ప్రశంసిస్తున్నావు. ఈ రెంటిలో ఏది మంచిదో బాగా ఆలోచించి అది నాకు చెప్పు.*

శ్రీ భగవాన్ ఉవాచ

2. సన్న్యాసః కర్మయోగశ్చ నిశ్శ్రేయసకరావుభౌ ।
తయోస్తు కర్మసన్న్యాసాత్కర్మయోగో విశిష్యతే ॥

*భావం : కృష్ణ భగవానుడు చెప్పాడు : కర్మత్యాగం, (నిష్కామ) కర్మయోగం అనే రెండూ మోక్షాన్ని కలగచేస్తాయి. ఈ రెంటిలో కర్మత్యాగం కంటే కర్మయోగమే మంచిది.*

3. జ్ఞేయః స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి ।
నిర్ద్వంద్వో హి మహాబాహో సుఖం బంధాత్ప్రముచ్యతే ॥

*భావం : ఓ అర్జునా! దేనినీ ద్వేషించని, కోరని వాడు సదా సన్న్యాసి అని తెలుసుకో. ఎందుకంటే, ఇష్టాయిష్టాలు (రాగద్వేషాలు) లేని వాడు సంసారబంధం నించి తేలిగ్గా విముక్తుడు అవుతాడు.*

**4. సాంఖ్యయోగౌ పృథగ్బాలాః ప్రవదంతి న పండితాః ।**
**ఏకమప్యాస్థితః సమ్యక్ ఉభయోర్విందతే ఫలమ్ ॥**

*భావం : జ్ఞాన యోగం, కర్మ యోగం (ఫలితాలు) వేరు అని అవివేకులు చెప్తారు. కానీ వివేకులు చెప్పరు. ఈ రెంటిలో ఏ ఒక్క దాన్నైనా చక్కగా ఆచరిస్తే ఆ రెంటి ఫలాన్ని (మోక్షాన్ని) పొందుతారు.*

**5. యత్సాంఖ్యైః ప్రాప్యతే స్థానం తద్యోగైరపి గమ్యతే ।**
**ఏకం సాంఖ్యం చ యోగం చ యః పశ్యతి స పశ్యతి ॥**

*భావం : జ్ఞానయోగులు దేన్ని (మోక్షాన్ని) పొందుతారో దాన్నే కర్మయోగులు కూడా పొందుతారు. జ్ఞానయోగాన్ని, కర్మ యోగాన్ని ఒకటిగా (ఒకే ఫలితం ఇచ్చేదిగా) చూసేవాడు యదార్థాన్ని గ్రహించిన వాడు.*

**6. సన్న్యాసస్తు మహాబాహో దుఃఖమాప్తుమయోగతః ।**
**యోగయుక్తో మునిర్బ్రహ్మ న చిరేణాధిగచ్ఛతి ॥**

*భావం : ఓ అర్జునా! కర్మయోగం ఆచరించకుండా జ్ఞానయోగాన్ని పొందడం కష్టం. కర్మయోగం చేసేవాడు త్వరగా బ్రహ్మాన్ని పొందుతాడు.*

**7. యోగయుక్తో విశుద్ధాత్మా విజితాత్మా జితేంద్రియః ।**
**సర్వభూతాత్మభూతాత్మా కుర్వన్నపి న లిప్యతే ॥**

*భావం : నిష్కామ కర్మయోగం ఆచరించే వాడికి మనసు పరిశుద్ధమై, మనసుని, ఇంద్రియాలని జయించ గలుగుతాడు. సమస్త ప్రాణుల్లోని ఆత్మ, తన ఆత్మ ఒకటే అని తెలుసుకున్నాక కర్మలు చేస్తున్నా అవి బంధం కావు.*

**8. నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్ ।**
**పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్ ॥**

**9. ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్నిమిషన్నపి ।**
**ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్ ॥**

*భావం : ఆత్మజ్ఞాని చూస్తున్నా, వింటున్నా, తాకుతున్నా, వాసన చూస్తున్నా, తింటున్నా, నడుస్తున్నా, నిద్రిస్తున్నా, ఊపిరి పీల్చి వదులుతున్నా, మాట్లాడుతున్నా, ఇస్తున్నా, తీసుకుంటున్నా, కళ్ళని తెరుస్తున్నా, మూస్తున్నా, ఇంద్రియాలే తమతమ పనులు చేస్తున్నాయని, తానేమీ కొద్దిగా కూడా చేయడం లేదని భావిస్తాడు.*

**10. బ్రహ్మణ్యాధాయ కర్మాణి సంగం త్యక్త్వా కరోతి యః ।**
**లిప్యతే న స పాపేన పద్మపత్రమివాంభసా ॥**

*భావం : ఎవడు తను చేసే కర్మలని పరబ్రహ్మకి (ఫలితాన్ని కోరక) అర్పించి బంధాన్ని విడిచిపెడుతున్నాడో అలాంటి వాడిని, నీరు తామరాకుని అంటనట్లుగా పాపం అంటదు.*

**11. కాయేన మనసా బుద్ధ్యా కేవలైరింద్రియైరపి ।**
**యోగినః కర్మ కుర్వంతి సంగం త్యక్త్వాత్మశుద్ధయే ॥**

*భావం : నిష్కామ కర్మయోగులు ఫలాసక్తిని వదిలి, చిత్తశుద్ధి కోసం శరీరం, మనసు, బుద్ధి ఇంద్రియాలతో కర్మలని చేస్తారు.*

**12. యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీమ్ ।**
**అయుక్త కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే ॥**

*భావం : నిష్కామ కర్మ యోగి కర్మఫలాలని విడిచిపెట్టి భగవత్ ప్రాప్తి సంబంధమైన శాంతిని పొందుతున్నాడు. ఫలాపేక్షతో కర్మ చేసేవాడు కోరికతో, కర్మఫలం మీద ఆసక్తితో కర్మబంధంలో చిక్కుకుంటున్నాడు.*

**13. సర్వకర్మాణి మనసా సన్న్యస్యాస్తే సుఖం వశీ ।**
**నవద్వారే పురే దేహీ నైవ కుర్వాన్నకారయన్ ॥**

భావం : ఇంద్రియ నిగ్రహం గల మనిషి మనసులో అన్ని కర్మ ఫలాలని వదిలేసి, కర్మలని చేయక, చేయించక, తొమ్మిది ద్వారాలు గల పట్టణం అనే శరీరంలో ఆనందాన్ని అనుభవిస్తున్నాడు.

**14. న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।**
**న కర్మఫలసంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥**

భావం : లోకంలో కర్మలని కానీ, కర్తృత్వాన్ని కానీ, కర్మఫలాలతో సంబంధాన్ని కానీ పరమాత్మ సృష్టించడం లేదు. ఇవన్నీ ప్రకృతే చేస్తోంది.

**15. నాదత్తే కస్యచిత్పాపం న చైవ సుకృతం విభుః ।**
**అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః ॥**

భావం : పరమాత్మ ఎవరి పాపాన్ని కానీ, పుణ్యాన్ని కాని స్వీకరించడు. జ్ఞానం అజ్ఞానంతో కప్పబడడంతో ప్రాణులు భ్రమ చెందుతున్నారు.

**16. జ్ఞానేన తు తదజ్ఞానం యేషాం నాశితమాత్మనః ।**
**తేషామాదిత్యవత్ జ్ఞానం ప్రకాశయతి తత్పరమ్ ॥**

భావం : ఆ అజ్ఞానం ఆత్మజ్ఞానంతో నశించగానే వారి జ్ఞానం సూర్యుడిలా పరబ్రహ్మాన్ని ప్రకాశింపచేస్తుంది. (ముక్తి లభిస్తుంది)

**17. తద్బుద్ధయ స్తదాత్మాన స్తన్నిష్ఠా స్తత్పరాయణాః ।**
**గచ్ఛంత్యపునరావృత్తిం జ్ఞాననిర్ధూతకల్మషాః ॥**

భావం : పరమాత్మ మీదే బుద్ధి, మనసు కేంద్రీకరించి, పరమాత్మ యందే నిష్ఠ కలిగి, పరమాత్మనే తీవ్రంగా కోరే వారి పాపాన్ని జ్ఞానం నశింపచేస్తుంది. మరు జన్మ లేని స్థితిని (మోక్షాన్ని) వారు పొందుతారు.

18. విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః ॥

భావం : జ్ఞానులు విద్య, వినయ సంపద కలిగిన బ్రాహ్మణుడ్ని, ఆవుని, ఏనుగుని, కుక్కని, కుక్క మాంసం తినే వాడిని సమదృష్టితో (తన లోని ఆత్మే వారిలో కూడా ఉందని తెలుసుకుని) చూస్తారు.

19. ఇహైవ తైర్జితః సర్గో యేషాం సామ్యే స్థితం మనః ।
నిర్దోషం హి సమం బ్రహ్మ తస్మా ద్బ్రహ్మణి తే స్థితాః ॥

భావం : ఎవరి మనసు సమదృష్టితో స్థిరంగా ఉంటుందో వారు ఈ జన్మ లోనే జనన మరణ చక్రాన్ని జయిస్తారు. బ్రహ్మం దోషం లేనిది. సమమైంది. కాబట్టి వారు అలాంటి బ్రాహ్మీస్థితిలో ఉంటారు.

20. న ప్రహృష్యేత్ప్రియం ప్రాప్య నోద్విజేత్ప్రాప్య చా ప్రియమ్ ।
స్థిరబుద్ధిరసమ్మూఢో బ్రహ్మవిద్బ్రహ్మణి స్థితః ॥

భావం : స్థిరమైన బుద్ధి కలవాడు, ఆశాపాశాలు లేని వాడు, బ్రహ్మలో స్థిరపడిన వాడు అయిన బ్రహ్మజ్ఞాని, ఇష్టమైన దానికి పొంగిపోడు. అయిష్టమైన దానికి దుఃఖపడడు.

21. బాహ్యస్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్ ।
స బ్రహ్మయోగయుక్తాత్మా సుఖమక్షయమశ్నుతే ॥

భావం : ప్రపంచం లోని సుఖదుఃఖాల మీద ఆసక్తి లేని వాడు ఆత్మ ఇచ్చే సుఖాన్ని పొందుతాడు. అతను బ్రహ్మనిష్ట (సమాధి) లో నిరంతరం సుఖాన్ని పొందుతాడు.

22. యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।
ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ॥

భావం : ఓ అర్జునా! ఇంద్రియభోగాలు దుఃఖాన్ని ఇస్తాయి. వాటికి మొదలు, తుది ఉంటాయి. వివేకికి వాటి మీద ఆసక్తి ఉండదు. అవి తాత్కాలికమైనవి.

**23. శక్నోతీహైవ యస్సోఢుం ప్రాక్ఛరీరవిమోక్షణాత్ ।**
**కామక్రోధోద్భవం వేగం స యుక్తః స సుఖీ నరః ॥**

భావం : మరణానికి మునుపే, ఈ లోకం లోనే కామక్రోధాల ఉద్వేగాన్ని అదుపులో ఉంచుకునే సమర్థుడు యోగి, సుఖి అవుతాడు.

**24. యోంతఃసుఖోంతరారామ స్తథాంతర్జ్యోతిరేవ యః ।**
**స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోధిగచ్ఛతి ॥**

భావం : ఆత్మలోనే ఆనందాన్ని పొందుతూ, ఆత్మలోనే రమిస్తూ, ఆత్మలోనే ప్రకాశవంతుడైన యోగి, బ్రహ్మస్వరూపుడై బ్రహ్మ నిర్వాణాన్ని పొందుతాడు.

**25. లభంతే బ్రహ్మనిర్వాణమృషయః క్షీణకల్మషాః ।**
**ఛిన్నద్వైధా యతాత్మానః సర్వభూతహితేరతాః ॥**

భావం : పాపాన్ని పోగొట్టుకున్న వారు, అన్ని అనుమానాలు నివృత్తి చేసుకున్న వారు, మనసు ఇంద్రియాలని స్వాధీన పరచుకున్న వారు సర్వప్రాణుల హితాన్ని కోరే వారు అయిన ఋషులు మోక్షాన్ని పొందుతున్నారు.

**26. కామక్రోధవియుక్తానాం యతీనాం యతచేతసామ్ ।**
**అభితో బ్రహ్మనిర్వాణం వర్తతే విదితాత్మనామ్ ॥**

భావం : కామక్రోధాలు లేని వారు, మనో నిగ్రహం కలవారు, ఆత్మతత్త్వాన్ని తెలుసుకున్న జ్ఞానులు అంతటా పరబ్రహ్మాన్నే చూస్తారు.

**27. స్పర్శాన్ కృత్వా బహిర్బాహ్యాన్ చక్షుశ్చైవాంతరే భ్రువోః ।**
**ప్రాణాపానౌ సమౌ కృత్వా నాసాభ్యంతరచారిణౌ ॥**

**28. యతేంద్రియమనోబుద్ధి ర్మునిర్మోక్షపరాయణః ।**
**విగతేచ్ఛాభయక్రోధో యస్సదా ముక్త ఏవ సః ॥**

భావం : *ప్రాపంచిక భోగాలని వదిలేసి, చూపుని కనుబొమల మధ్య నిలిపి, నాసికలో సంచరించే ప్రాణాపాన వాయువులని సమస్థితిలో ఉంచి, తద్వారా మనసు, బుద్ధి, ఇంద్రియాలని నిగ్రహించి, కోరిక, భయం, కోపాలని విడిచిపెట్టిన మోక్షాసక్తుడైన ముని ఎప్పుడు ముక్తుడే.*

**29. భోక్తారం యజ్ఞతపసాం సర్వలోకమహేశ్వరమ్ ।**
**సుహృదం సర్వభూతానాం జ్ఞాత్వా మాం శాంతిమృచ్ఛతి ॥**

భావం : *యజ్ఞాలు, తపస్సుల ఫలితాలని అనుభవించే, సమస్త లోకాలకి ఈశ్వరుడు, సర్వప్రాణులకి హితుడైన నన్ను తెలుసుకున్న మనిషి శాంతిని పొందుతాడు.*

ఏ శృణ్వంతి పఠంతేవ గీతాశాస్త్ర మహర్నిశం ।
న తేవై మానుషా జ్ఞేయా దేవరూపా న సంశయః ॥
భావం : ఎవరు గీతా శాస్త్రాన్ని సదా వింటూ, చదువుతూ ఉంటారో అలాంటి వారిని మానవులు అనకూడదు. వారు నిస్సందేహంగా దేవతలే.

# ఆరో అధ్యాయం- ఆత్మ సంయమ యోగం

శ్రీ భగవాన్ ఉవాచ

1. అనాశ్రితః కర్మఫలం కార్యం కర్మ కరోతి యః ।
స సన్న్యాసీ చ యోగీ చ న నిరగ్నిర్నచా క్రియః ॥

*భావం : కృష్ణ భగవానుడు చెప్పాడు : చేయవలసిన కర్మలని ఫలాపేక్ష లేకుండా ఆచరించే వాడే నిజమైన సన్న్యాసి, యోగి అవుతాడు. కేవలం అగ్నిహోత్రాన్ని వదిలిన వాడు, కర్మలని విడిచిపెట్టిన వాడు సన్న్యాసి, యోగి కాడు.*

2. యం సన్న్యాసమితి ప్రాహుర్యోగం తం విద్ధి పాండవ ।
న హ్యసన్న్యస్తసంకల్పో యోగీ భవతి కశ్చన ॥

*భావం : ఓ అర్జునా! సన్న్యాసమే యోగం అని తెలుసుకో. ఎందుకంటే, సంకల్పాలని (కోరికలని) వదలని వాడు యోగి కాలేడు.*

3. ఆరురుక్షోర్మునేర్యోగం కర్మ కారణముచ్యతే ।
యోగారూఢస్య తస్యైవ శమః కారణముచ్యతే ॥

*భావం : యోగాన్ని పొందదల్చిన యోగికి (సాధకుడికి) నిష్కామ కర్మ సాధనం. దానిలో పరిపక్వత పొందిన యోగికి సంకల్పరాహిత్యం సాధనం అవుతుంది.*

4. యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే ।
సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢ స్తదోచ్యతే ॥

భావం : ఇంద్రియ భోగాల మీద, కర్మల మీద ఆసక్తి లేక, అన్ని సంకల్పాలని విడిచిపెట్టిన వాడు యోగారూఢుడు అవుతాడు.

**5. ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్ ।**
**ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః ॥**

భావం : తనని తానే (సంసార సాగరం నించి) ఉద్ధరించుకోవాలి తప్ప తనకి తానే అధోగతిని పొందకూడదు. ఎందుకంటే, తనకు తానే బంధువు, తనకి తానే శత్రువు.

**6. బంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః ।**
**అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్ ॥**

భావం : మనసుని, ఇంద్రియాలని జయించిన వాడు, తనకి తానే బంధువు, జయించక పోతే తనకి తానే శత్రువు అవుతాడు.

**7. జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః ।**
**శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానావమానయోః ॥**

భావం : మనసుని జయించిన వాడు, పరమశాంతి గలవాడు అయిన మనిషికి శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, మానావమానాలు కలిగినా, పరమాత్మ అనుభవం తప్ప ఇంకేమీ తోచదు.

**8. జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః ।**
**యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మ కాంచనః ॥**

భావం : జ్ఞానవిజ్ఞానాలతో తృప్తి చెందినవాడు, భావరహితుడు, ఇంద్రియాలని జయించినవాడు, మట్టి గడ్డ, రాయి, బంగారాలని సమానంగా చూసేవాడు యోగి అవుతాడు.

**9. సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థ ద్వేష్య బంధుషు ।**
**సాధుష్వపి చ పాపేషు సమబుద్ధి ర్విశిష్యతే ॥**

*భావం : ప్రతిఫలాన్ని ఆశించక ఉపకారం చేసే వారు, ప్రతిఫలాన్ని ఆశించి ఉపకారం చేసేవారు, శత్రువులు, తటస్థులు, మధ్యస్థులు, విరోధులు, బంధువులు, పుణ్యాత్ములు, పాపుల పట్ల సమభావాన్ని కలిగిన వాడే శ్రేష్ఠుడు.*

**10. యోగీ యుంజీత సతతమాత్మానం రహసి స్థితః ।**
**ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీ రపరిగ్రహః ॥**

*భావం : యోగి ఏకాంతంలో వంటరిగా, మనసు, ఇంద్రియాలని వశం చేసుకుని, ఆశ లేని వాడై, ఇతరుల నించి ఏమీ స్వీకరించక సదా మనసుని పరమాత్మ మీదే లగ్నం చెయ్యాలి.*

**11. శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః ।**
**నాత్యుచ్ఛ్రితం నాతినీచం చేలాజినకుశోత్తరమ్ ॥**

**12. తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః ।**
**ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగ మాత్మవిశుద్ధయే ॥**

*భావం : శుభ్రమైన ప్రదేశంలో మరీ ఎత్తుగా కాని, మరీ పొట్టిగా కాని లేని దర్భాసనం, దాని మీద జింక చర్మం, దాని మీద వస్త్రం పరిచిన ఆసనం ఏర్పాటు చేసుకోవాలి. ఆ ఆసనం మీద కూర్చుని మనసుని ఏకాగ్రం చేసి, మనసుని ఇంద్రియాలని స్వాధీనం చేసుకుని ఆత్మశుద్ధి కోసం ధ్యానయోగాన్ని సాధన చేయాలి.*

**13. సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః ।**
**సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్ ॥**

**14 ప్రశాంతాత్మా విగతభీః బ్రహ్మచారివ్రతే స్థితః ।**
**మనః సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః ॥**

*భావం : శరీరం, తల, మెడ తిన్నగా నిలిపి, కదలకుండా స్థిరంగా ఉంచి, దిక్కులు చూడక నిశ్చలంగా ముక్కు కొనపై దృష్టి నిలపాలి. భయాన్ని వదిలి ప్రశాంతంగా బ్రహ్మచర్య వ్రతాన్ని పాటిస్తూ మనో నిగ్రహంతో నా మీదే మనసు పెట్టి (పరమాత్మ మీద) నన్నే ధ్యానిస్తూ సాధన చేయాలి.*

**15. యుంజన్నేవం సదాత్మానం యోగీ నియతమానసః ।**
**శాంతిం నిర్వాణపరమాం మత్సంస్థా మధిగచ్ఛతి ॥**

*భావం : మనో నిగ్రహం కల యోగి సదా మనసుని ఆత్మ జ్ఞానంలో లగ్నం చేసి, మోక్షరూపమైన శాంతిని పొందుతాడు.*

**16. నాత్యశ్నతస్తు యోగోస్తి న చైకాంతమనశ్నతః ।**
**న చాతిస్వప్నశీలస్య జాగ్రతో నైవ చార్జునః ॥**

*భావం : అర్జునా! ఎక్కువగా తినేవాడికి, అసలు తినని వాడికి, ఎక్కువగా నిద్రించే వాడికి, ఎక్కువగా మేలుకునే వాడికి యోగ సిద్ధి కలుగదు.*

**17. యుక్తాహారవిహారస్య యుక్తచేష్టస్య కర్మసు ।**
**యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా ॥**

*భావం : మితమైన ఆహారం, నడవడి కలవాడు, కర్మలు మితంగా చేసేవాడు, మితమైన నిద్ర, మెలకువ కల వాడికి (జననమరణ సంసార) దుఃఖం పోతుంది.*

**18. యదా వినియతం చిత్తమాత్మన్యేవావతిష్ఠతే ।**
**నిఃస్పృహః సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే తదా ॥**

*భావం : ఎప్పుడు మనసు వశంలోకి వచ్చి పరమాత్మ మీదే స్థిరంగా ఉంటుందో, ఎప్పుడు అన్ని కోరికల మీద అభిలాష లేనివాడు అవుతాడో అప్పుడు అతను యోగసిద్ధిని (సమాధిస్థితి) పొందినవాడు అవుతాడు.*

**19. యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా ।**
**యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః ॥**

భావం : *గాలి వీచని చోట దీపం ఎలా కదలక నిశ్చలంగా ఉంటుందో, అలా పరమాత్మ ధ్యానం చేసే యోగి నిగ్రహించిన మనసు నిశ్చలంగా (ఆలోచనా రహితంగా) ఉంటుంది.*

**20. యత్రోపరమతే చిత్తం నిరుద్ధం యోగసేవయా ।**
**యత్ర చైవాత్మనాత్మానం పశ్యన్నాత్మని తుష్యతి ॥**

**21. సుఖమాత్యంతికం యత్తద్బుద్ధిగ్రాహ్యమతీంద్రియమ్ ।**
**వేత్తి యత్ర న చైవాయం స్థితశ్చలతి తత్త్వతః ॥**

**22. యం లబ్ధ్వా చాపరం లాభం మన్యతే నాధికం తతః ।**
**యస్మిన్ స్థితో న దుఃఖేన గురుణాపి విచాల్యతే ॥**

**23. తం విద్యాద్దుఃఖసంయోగవియోగం యోగసంజ్ఞితమ్ ।**
**స నిశ్చయేన యోక్తవ్యో యోగోనిర్విణ్ణచేతసా ॥**

భావం : *యోగాభ్యాసంతో వశపడిన మనసు ఎక్కడ పరమ శాంతిని పొందుతుందో, ఎక్కడ మనసు స్వ స్వరూపాన్ని చూస్తుందో, ఎక్కడ యోగి తనలోనే ఆనందాన్ని పొందుతాడో, ఎక్కడ యోగి ఇంద్రియాలకి అందని, బుద్ధితో గ్రహించే అంతం లేని సుఖాన్ని అనుభవిస్తున్నాడో, ఇంకా ఆ స్వానుభవ ఆనందం నించి ఏ మాత్రం జారిపోకుండా, దేనిని పొందాక ఇతర లాభాలని తను అనుభవించే దాని కన్నా గొప్పవిగా అనుకోడో, గొప్ప దుఃఖం వల్ల కూడా చలించడో, దుఃఖం సంబంధం కొంచెమైనా లేని ఆ స్థితిని ధ్యానయోగం అని తెలుసుకోవాలి. కలత చెందని మనసుతో, పట్టుదలతో దాన్ని సాధించాలి.*

**24. సంకల్పప్రభవాన్ కామాం స్త్యక్త్వా సర్వానశేషతః ।
మనసై వేంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥**

**25. శనైః శనైరుపరమేద్బుద్ధ్యా ధృతిగృహీతయా ।
ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥**

*భావం : సంకల్పాల నించి కలిగే అన్ని కోరికలని పూర్తిగా వదిలేసి, ఇంద్రియాలని సమస్త విషయాల నించి మనసుతో నిగ్రహించి, ధైర్యంగా వివేకంతో మెల్లమెల్లగా మనస్సుని (ప్రాపంచిక విషయాల నించి) మరలించాలి. దాన్ని ఆత్మలో స్థిరపరచాలి. మరే ఇతర ఆలోచనని చేయకూడదు.*

**26. యతో యతో నిశ్చరతి మనశ్చంచలమస్థిరమ్ ।
తతస్తతో నియమ్యైతదాత్మన్యేవ వశం నయేత్ ॥**

*భావం : మనసు చపలమైంది. నిలకడ లేనిది. అది ఎక్కడెక్కడికి వెళ్తే అక్కడ నించి మరల్చి దాన్ని ఆత్మకి వశం చేయాలి. (మనసుని పరమాత్మ మీదే స్థిరంగా నిలపాలి)*

**27. ప్రశాంతమనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్ ।
ఉపైతి శాంతరజసం బ్రహ్మభూతమకల్మషమ్ ॥**

*భావం : ప్రశాంతమైన మనసు కలవాడు, ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి తొలగినవాడు, పాపరహితుడు, బ్రహ్మభావనతో ఉన్నవాడు అయిన ఈ ధ్యానయోగి సర్వోత్తమమైన సుఖాన్ని పొందుతాడు.*

**28. యుంజన్నేవం సదాత్మానం యోగీ విగతకల్మషః ।
సుఖేన బ్రహ్మసంస్పర్శమత్యంతం సుఖమశ్నుతే ॥**

*భావం : ఈ ప్రకారం సదా మనసుని ఆత్మలో కేంద్రీకరిస్తూ, దోషరహితుడైన యోగి తేలిగ్గా బ్రహ్మానుభవమైన పరమసుఖాన్ని అనుభవిస్తాడు.*

**29. సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥**

భావం : *యోగ మనసు గల (యోగంలో పరాకాష్ట చెందిన) వాడు సమస్త సృష్టిలోని అన్ని ప్రాణుల్లో తను ఉన్నట్లుగా, సర్వప్రాణులు తనలోనే ఉన్నట్లుగా సమదృష్టితో గ్రహిస్తాడు.*

**30. యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి ।**
**తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి ॥**

భావం : *ఎవడు సర్వప్రాణులలో నన్ను చూస్తాడో, సమస్త ప్రాణులని నాలో చూస్తాడో వాడికి నేను కనిపిస్తాను. అతనూ నాకు కనపడతాడు.*

**31. సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః ।**
**సర్వథా వర్తమానోపి స యోగీ మయి వర్తతే ॥**

భావం : *ఎవరు భేదబుద్ధి లేక సర్వప్రాణుల్లో నన్ను కొలుస్తాడో ఆ యోగి ఎలా ప్రవర్తించినా నాలోనే (పరమాత్మ లోనే) ఉన్నవాడు.*

**32. ఆత్మౌపమ్యేన సర్వత్ర సమం పశ్యతి యోర్జున ।**
**సుఖం వా యది వా దుఃఖం స యోగీ పరమో మతః ॥**

భావం : *అర్జునా! సమస్త ప్రాణులని తనతో సమానంగా, సుఖదుఃఖాలని కూడా సమానంగా ఎవడు చూస్తాడో ఆ యోగి పరమశ్రేష్ఠుడు.*

**అర్జున ఉవాచ**

**33. యోయం యోగస్త్వయా ప్రోక్తస్సామ్యేన మధుసూదన ।**
**ఏతస్యాహం న పశ్యామి చంచలత్వాత్ స్థితిం స్థిరామ్ ॥**

భావం : *అర్జునుడు చెప్పాడు : ఓ కృష్ణా! మనసు పరిపరివిధాల పోకుండా నిగ్రహం తోనే సిద్ధించే యోగాన్ని నువ్వు ఉపదేశించావు. కాని మనసు చంచలం అవడం వల్ల దాన్ని (ధ్యానంలో) ఎలా నిలపాలో నేను తెలుసుకోలేక పోతున్నాను.*

**34. చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢమ్ ।**
**తస్యాహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥**

*భావం : ఓ కృష్ణా! మనస్సు చంచలమైంది. క్షోభ పెట్టేది. బలమైంది. దృఢమైంది. గాలిని బంధించడంలా దానిని నిగ్రహించడం చాలా కష్టమని నేను భావిస్తున్నాను.*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**35. అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।**
**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥**

*భావం : కృష్ణుడు చెప్పాడు : ఓ అర్జునా! మనసుని నిగ్రహించడం కష్టమే. అది నిస్సందేహంగా చంచలమైందే. ఐనా అభ్యాసం చేత, వైరాగ్యం చేత దాన్ని వశపరచుకోవచ్చు.*

**36. అసంయతాత్మనా యోగో దుష్ప్రాప ఇతి మే మతిః ।**
**వశ్యాత్మనా తు యతతా శక్యో వాప్తుముపాయతః ॥**

*భావం : మనసుని వశం చేసుకోలేని వాడికి యోగస్థితి కలగదు అని నా అభిప్రాయం. ఉపాయంతో, ప్రయత్నంతో మనసుని స్వాధీనం చేసుకుని యోగస్థితి పొందడం సాధ్యమే.*

**అర్జున ఉవాచ**

**37. అయతిః శ్రద్ధయోపేతో యోగాచ్చలితమానసః ।**
**అప్రాప్య యోగసంసిద్ధిం కాం గతిం కృష్ణ గచ్ఛతి ॥**

*భావం : అర్జునుడు అడిగాడు : కృష్ణా! శ్రద్ధ కలవాడికి నిగ్రహశక్తి లేక, మనసు జారి యోగసిద్ధిని పొందకపోతే అతని గతి ఏమిటి?*

**38. కచ్చిన్నోభయవిభ్రష్టః ఛిన్నాభ్రమివ నశ్యతి ।**
**అప్రతిష్ఠో మహాబాహో విమూఢో బ్రహ్మణః పథి ॥**

*భావం : ఓ కృష్ణా! మోక్షమార్గంలో స్థిరత్వం లేనివాడు, మూర్ఖుడు, ఇహపరాలు రెంటికీ చెడినవాడు చెదిరిన మేఘంలా అధోగతి పాలవుతాడా?*

**39. ఏతం మే సంశయం కృష్ణ ఛేత్తుమర్హస్యశేషతః ।**
**త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా న హ్యుపపద్యతే ॥**

*భావం : కృష్ణా! ఈ నా సందేహాన్ని పూర్తిగా పోగొట్టడానికి నువ్వే సమర్థుడివి. నువ్వు తప్ప నాకు ఇంకొకరు లేరు కదా!*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**40. పార్థ నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే ।**
**న హి కల్యాణకృత్ కశ్చిత్ దుర్గతిం తాత గచ్ఛతి ॥**

*భావం : కృష్ణ భగవానుడు చెప్పాడు : ఓ అర్జునా! అలాంటి వాడికి ఈ లోకంలో కానీ, పర లోకంలో కానీ అధోగతి కలగదు నాయనా! మంచి పనులు చేసేవాడు ఎన్నడూ చెడిపోడు.*

**41. ప్రాప్య పుణ్యకృతాం లోకానుషిత్వా శాశ్వతీః సమాః ।**
**శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టో భిజాయతే ॥**

*భావం : యోగభ్రష్టుడు (యోగం నించి జారిపోయిన వాడు) మరణానంతరం పుణ్యాత్ముల లోకానికి వెళ్ళి, అనేక సంవత్సరాలు ఉన్నాక సదాచారులైన శ్రీమంతుల ఇంట్లో పుడతాడు.*

**42. అథవా యోగినామేవ కులే భవతి ధీమతామ్ ।**
**ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్ ॥**

*భావం : లేదా జ్ఞానవంతులైన యోగుల వంశంలో పుడతాడు. ఐతే లోకంలో ఇలాంటి జన్మ దుర్లభం.*

**43. తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదేహికమ్ ।**
**యతతే చ తతో భూయః సంసిద్ధౌ కురునందన ॥**

*భావం : ఓ అర్జునా! అతను యోగకులంలో జన్మించాక పూర్వజన్మ వాసనతో తిరిగి యోగ సంపర్కాన్ని పొందుతాడు. ఆ పూర్వజన్మ సంస్కారం వల్ల అతడు మోక్షం కోసం మునుపటి కన్నా అధిక ప్రయత్నం చేస్తాడు.*

**44. పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోపి సః ।**
**జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే ॥**

*భావం : యోగభ్రష్టుడు తన ప్రయత్నం లేకుండానే పూర్వజన్మ అభ్యాసం చేత యోగం వైపుకి ఈడ్చబడతాడు. యోగం మీద ఆసక్తి కలగగానే వేదాలలో చెప్పిన సకామ కర్మానుష్ట ఫలాన్ని దాటేస్తాడు.*

**45. ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః ।**
**అనేకజన్మసంసిద్ధస్తతో యాతి పరాం గతిమ్ ॥**

*భావం : పట్టుదలతో ప్రయత్నించే యోగి పాపరహితుడై అనేక జన్మల్లో చేసిన అభ్యాసంతో ఈ జన్మలోనే సర్వోత్తమమైన మోక్షాన్ని పొందుతాడు.*

**46. తపస్విభ్యోధికో యోగీ జ్ఞానిభ్యోపి మతోధికః ।**
**కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున ॥**

*భావం : యోగి తపస్వి కన్నా, శాస్త్రజ్ఞానుల కన్నా, అగ్నిహోత్రాది కర్మలు చేసే వారి కన్నా శ్రేష్ఠుడు. కనుక ఓ అర్జునా! నువ్వు యోగివి కమ్ము.*

**47. యోగినామపి సర్వేషాం మద్గతేనాంతరాత్మనా ।**
**శ్రద్ధావాన్ భజతే యో మాం స మే యుక్తతమో మతః ॥**

*భావం : యోగులందరి లోనూ ఎవరు నా మీదే మనసుని నిలిపి శ్రద్ధతో నన్ను ధ్యానిస్తున్నారో వారు సర్వశ్రేష్ఠులని నా అభిప్రాయం.*

**సారధ్య మర్జునస్స్యదౌ కుర్వన్ గీతామృతం దదౌ ।**
**లోకత్రయోపకార తస్మై కృష్ణాత్మనే నమః ।।**
భావం : ఏ మహనీయుడు పూర్వం అర్జునుడికి రధసారధ్యం చేస్తూ కూడా ముల్లోకాలకి మహోపకారం చేయడానికి అతనికి గీతామృతం ఇచ్చాడో అలాంటి శ్రీకృష్ణుడికి నమస్కారం.

# ఏడో అధ్యాయం - విజ్ఞాన యోగం

**శ్రీ భగవాన్ ఉవాచ**

1. **మయ్యాసక్తమనాః పార్థ యోగం యుంజన్మదాశ్రయః ।**
**అసంశయం సమగ్రం మాం యథా జ్ఞాస్యసి తచ్ఛృణు ॥**

భావం : *భగవానుడు చెప్పాడు : ఓ పార్థా! నామీదే ఆసక్తి గల మనసుతో నన్నే (ఆత్మ స్వరూపుడిగా) ఆశ్రయించి, యోగాన్ని అభ్యసిస్తూ, అనుమానం లేకుండా నన్ను పూర్తిగా ఎలా తెలుసుకోగలవో చెప్తాను. విను.*

2. **జ్ఞానం తేహం సవిజ్ఞానమిదం వక్ష్యామ్యశేషతః ।**
**యద్జ్ఞాత్వా నేహ భూయోన్యత్ జ్ఞాతవ్యమవశిష్యతే ॥**

భావం : *దేనిని తెలుసుకున్న తర్వాత ఇక ఈ ప్రపంచంలో తెలుసుకోవాల్సింది మరొకటి మిగిలి ఉండదో, అలాంటి అనుభవంతో కూడిన ఈ జ్ఞానాన్ని నీకు సంపూర్ణంగా చెప్తాను.*

3. **మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।**
**యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః ॥**

భావం : *వేల మంది మనుషులలో (ముముక్షువులలో) ఏ ఒక్కడో మోక్షసిద్ధి కోసం ప్రయత్నిస్తున్నాడు. అలా ప్రయత్నించిన వారిలో ఎవరో ఒకరే నా వాస్తవ స్వరూపాన్ని తెలుసుకుంటున్నారు.*

**4. భూమిరాపోనలో వాయుః ఖం మనో బుద్ధిరేవచ ।**
**అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతిరష్టధా ॥**

భావం : *భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం, మనసు, బుద్ధి, అహంకారం అని నా ప్రకృతి (మాయ) ఎనిమిది విధాలుగా విభజింపబడింది.*

**5. అపరేయమితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్ ।**
**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్ ॥**

భావం : *ఓ అర్జునా! ఈ జడ (అపర) ప్రకృతి చాలా అల్పమైంది. ఇది కాక, ఈ ప్రపంచాన్నంతా ధరించే జీవరూపమైన మరో శ్రేష్ఠమైన ప్రకృతి (పర లేక చేతన ప్రకృతి) ఉందని తెలుసుకో.*

**6. ఏతద్యోనీని భూతాని సర్వాణీత్యుపధారయ ।**
**అహం కృత్స్నస్య జగతః ప్రభవ ప్రలయస్తథా ॥**

భావం : *సమస్త ప్రాణులు (జడ, చేతనాలు) పర, అపర ప్రకృతుల వల్లనే ఉత్పన్నం అవుతున్నాయని తెలుసుకో. నేనే సమస్త ప్రపంచం ఉత్పత్తికి, నాశనానికి మూల కారణం.*

**7. మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ ।**
**మయి సర్వమిదం ప్రోతం సూత్రే మణిగణా ఇవ ॥**

భావం : *ఓ ధనంజయా! నాకంటే శ్రేష్ఠమైనది ఇంకోటి లేదు. దారంలో మణుల్లా, ఈ సమస్త ప్రపంచం కూర్చబడింది.*

**8. రసోహమప్సు కౌంతేయ ప్రభాస్మి శశిసూర్యయోః ।**
**ప్రణవఃసర్వవేదేషు శబ్దః ఖే పౌరుషం నృషుః ॥**

*భావం : ఓ అర్జునా! నీటిలోని రుచిని నేనే. సూర్యచంద్రుల కాంతి, సమస్త వేదాల్లోని ఓంకారం, ఆకాశంలోని శబ్దం, మనుషుల్లోని పరాక్రమం నేనే.*

**9. పుణ్యోగంధః పృథివ్యాం చ తేజశ్చాస్మి విభావసౌ ।**
**జీవనం సర్వభూతేషు తపశ్చాస్మి తపస్విషు ॥**

*భావం : భూమి మీది సుగంధం, అగ్ని లోని తేజస్సు నేనే. సమస్త ప్రాణుల్లోని జీవం (చైతన్యం లేదా ఆయువు) మునులు చేసే తపస్సు నేనే.*

**10. బీజం మాం సర్వభూతానాం విద్ధి పార్థ సనాతనమ్ ।**
**బుద్ధిర్బుద్ధిమతామస్మి తేజస్తేజస్వినామహమ్ ॥**

*భావం : ఓ అర్జునా! సమస్త ప్రాణులకి నన్ను శాశ్వతమైన బీజంగా (కారణంగా) తెలుసుకో. బుద్ధిమంతుల్లోని ప్రజ్ఞ (వివేకం) తేజోవంతుల్లోని తేజాన్ని నేనే.*

**11. బలం బలవతాం చాహం కామరాగవివర్జితమ్ ।**
**ధర్మావిరుద్ధో భూతేషు కామోస్మి భరతర్షభ ॥**

*భావం : ఓ భరతశ్రేష్ఠా! నేను బలవంతులలో గల కోరిక లేని బలాన్ని. ప్రాణుల్లోని ధర్మానికి వ్యతిరేకం కాని కోరికని.*

**12. యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చయే ।**
**మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి ॥**

*భావం : సాత్త్విక, రాజసిక, తామస గుణాలు నావల్లే కలుగుతున్నాయి. కానీ వానిలో నేను లేను. అవి నాలో లేవు. (త్రిగుణాతీతుడు)*

**13. త్రిభిర్గుణమయైర్భావైరేభిః సర్వమిదం జగత్ ।**
**మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్ ॥**

*భావం : ఈ మూడు గుణాల (సత్త్వ రజస్తమో గుణాల) చేత ప్రపంచం మొత్తం మోహం (అవివేకం) చెందుతోంది. ఈ త్రిగుణాలకి అతీతుడు, నాశరహితుడు అయిన నన్ను (మనుషులు) తెలుసుకోలేకపోతున్నారు.*

**14. దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ॥**

*భావం : అలౌకికమైన త్రిగుణాత్మకమైన (సత్త్వ, రజ, తమో గుణాలు) నా మాయ దాటడం కష్టం. నన్ను ఎవరు శరణు పొందుతారో వారే ఈ మాయని (సంసార సముద్రాన్ని) దాటగలరు.*

**15. న మాం దుష్కృతినో మూఢాః ప్రపద్యంతే నరాధమాః ।**
**మాయయాపహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితాః ॥**

*భావం : పాపులు, బుద్ధిహీనులు, మాయతో జ్ఞానం అపహరించబడిన వారు (అజ్ఞానులు) రాక్షస స్వభావం గలవారు, నీచులు నన్ను పొందరు.*

**16. చతుర్విధా భజంతే మాం జనాః సుకృతినోర్జున ।**
**ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥**

*భావం : ఓ అర్జునా! ఆపదలో ఉన్న వారు, భగవంతుడి గురించి తెలుసుకునే ఆసక్తి గలవారు, ధనాన్ని కోరేవారు, జ్ఞాని అనే నాలుగు రకాల పుణ్యాత్ములు నన్ను భజిస్తున్నారు.*

**17. తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే ।**
**ప్రియో హి జ్ఞానినోత్యర్థమహం స చ మమ ప్రియః ॥**

*భావం : ఈ నలుగురిలో సదా నన్నే తలుస్తూ, ఒక్క పరమాత్మ యందే భక్తి గలవాడైన జ్ఞానికి నేను ఇష్టుడ్ని. అతను కూడా నాకు ఇష్టుడు.*

**18. ఉదారాః సర్వ ఏవైతే జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్ ।**
**ఆస్థితః స హి యుక్తాత్మా మామేవానుత్తమాం గతిమ్ ॥**

*భావం : వీరంతా (ముందు శ్లోకంలో చెప్పిన నలుగురు) మంచివారు. కానీ వారిలో జ్ఞాని సాక్షాత్తు నేనే అని నా అభిప్రాయం. ఎందుకంటే అతడు మనసుని నా మీదే స్థిరంగా ఉంచి, పొందదగిన వాటిలో సరోత్తమమైనదిగా నన్నే ఎంచి ఆశ్రయించాడు.*

**19. బహూనాం జన్మనామంతే జ్ఞానవాన్మాం ప్రపద్యతే ।**
**వాసుదేవః సర్వమితి స మహాత్మా సుదుర్లభః ॥**

*భావం : అనేక జన్మల తర్వాత జ్ఞాని అంతా భగవంతుడే అని తెలుసుకుని నన్నే పొందుతాడు. అలాంటి మహాత్ముడు లోకంలో చాలా అరుదు.*

**20. కామైస్తైస్తైర్హృతజ్ఞానాః ప్రపద్యంతేన్యదేవతాః ।**
**తం తం నియమమాస్థాయ ప్రకృత్యా నియతాః స్వయా ॥**

*భావం : మనుషులు తమ జన్మ సంస్కారంతో ప్రేరేపింపబడి, ఆయా (ప్రాపంచిక) కోరికలతో జ్ఞానం దొంగిలించ బడ్డవారై (అవివేకులై) ఆయా నియమాలని అవలంబించి ఇతర దేవతలని ఆరాధిస్తున్నారు.*

**21. యో యో యాం యాం తనుం భక్తః శ్రద్ధయార్చితుమిచ్ఛతి ।**
**తస్య తస్యాచలాం శ్రద్ధాం తామేవ విదధామ్యహమ్ ॥**

*భావం : ఏ ఏ భక్తుడు ఏ ఏ దేవతా రూపాన్ని శ్రద్ధతో పూజించాలని కోరుతున్నాడో వారికి ఆయా దేవతల మీదే భక్తిశ్రద్ధలు స్థిరంగా ఉండేలా చేస్తున్నాను.*

**22. స తయా శ్రద్ధయా యుక్తస్తస్యారాధన మీహతే ।**
**లభతే చ తతః కామాన్ మయైవ విహితాన్ హి తాన్ ॥**

*భావం : భక్తుడు ఫలాన్ని కోరి శ్రద్ధతో ఆయా దేవతలని పూజిస్తున్నాడు. నా అనుగ్రహంతో ఆ దేవతల ద్వారా కోరిన భోగాలని పొందుతున్నాడు.*

**23. అంతవత్తు ఫలం తేషాం తద్భవత్యల్పమేధసామ్ ।**
**దేవాన్ దేవయజో యాంతి మద్భక్తా యాంతి మామపి ॥**

*భావం : అల్పబుద్ధులు (భోగాలని కోరే భక్తులు) కోరే ఫలాలు (భోగాలు) నశించేవి. దేవతలని పూజించే వారు దేవతలనే పొందుతారు. నా భక్తులు నన్నే (పరమాత్మని) పొందుతారు.*

**24. అవ్యక్తం వ్యక్తిమాపన్నం మన్యంతే మామబుద్ధయః ।**
**పరం భావమజానంతో మమావ్యయమనుత్తమమ్ ॥**

*భావం : శాశ్వతమైన, సర్వోత్తమమైన, పరాప్రకృతి లక్షణమైన నా తత్త్వాన్ని అవివేకులు తెలుసుకోలేరు. కళ్ళకి, ఇంద్రియాలకి కనపడని నన్ను మానవమాత్రుడిగా భావిస్తున్నారు.*

**25. నాహం ప్రకాశః సర్వస్య యోగమాయాసమావృతః ।**
**మూఢోయం నాభిజానాతి లోకో మామజమవ్యయమ్ ॥**

*భావం : యోగమాయతో కప్పబడిన నేను అందరికీ కనిపించను. అవివేకులు నన్ను చావుపుట్టుకలు లేనివాడిగా, నాశనం లేనివాడిగా తెలుసుకోలేరు.*

**26. వేదాహం సమతీతాని వర్తమానాని చార్జున ।**
**భవిష్యాణి చ భూతాని మాం తు వేద న కశ్చన ॥**

*భావం : ఓ అర్జునా! గడిచిన, వర్తమాన, భవిష్యత్ కాలాలకి చెందిన చరాచర ప్రాణులన్నీ నాకు తెలుసు. నన్ను మాత్రం ఎవరూ తెలుసుకోలేరు.*

**27. ఇచ్ఛాద్వేషసముత్థేన ద్వంద్వమోహేన భారత ।**
**సర్వభూతాని సమ్మోహం సర్గే యాంతి పరంతప ॥**

భావం : శత్రువులని తపింపచేయు ఓ అర్జునా! సమస్త ప్రాణులు, పుట్టుకతోనే ఇష్టాయిష్టాల వల్ల కలిగే సుఖదుఃఖాల ప్రభావంతో అజ్ఞానంలో పడిపోతున్నారు.

**28. యేషాం త్వంతగతం పాపం జనానాం పుణ్యకర్మణామ్ ।**
**తే ద్వంద్వమోహనిర్ముక్తా భజంతే మాం దృఢవ్రతాః ॥**

భావం : నిష్కామ భావంతో పుణ్యం చేసే వారి పాపం నాశనమై, వారు ద్వంద్వాల నించి (సుఖదుఃఖాల నించి) విడువబడి దృఢమనస్కులై నన్నే సేవిస్తారు.

**29. జరామరణ మోక్షాయ మామాశ్రిత్య యతంతి యే ।**
**తే బ్రహ్మ తద్విదుః కృత్స్నమధ్యాత్మం కర్మ చాఖిలమ్ ॥**

భావం : వార్ధక్యం, మరణాలని పోగొట్టుకోడానికి ఎవరు నన్ను ఆశ్రయించి ప్రయత్నం చేస్తున్నారో వారు సమస్తమైన ప్రత్యగాత్మ స్వరూపాన్ని, అన్ని కర్మలు ఆ బ్రహ్మమే అని తెలుసుకుంటారు.

**30. సాధిభూతాధిదైవం మాం సాధియజ్ఞం చ యే విదుః ।**
**ప్రయాణకాలేపి చ మాం తే విదుర్యుక్తచేతసః ॥**

భావం : అధిభూత, అధిదైవ, అధియజ్ఞాలతో కూడిన నన్ను ఎవరు తెలుసుకుంటారో, వారు మనోనిగ్రహంతో మరణ సమయంలో నన్నే చేరతారు.

**కృష్ణవృక్ష సముద్భూతా గీతామృత హరీతకీ।**
**మానుష్షైః కిం న ఖాద్యేత కలౌ మలవిరోచినీ।**
భావం : కృష్ణుడనే చెట్టుకి కాసిన గీతామృతం అనే
కరక్కాయని ప్రజలు ఎందుకు తినటం లేదు?
తింటే, అది కలి మలం అంతా పోగొడుతుంది.

# ఎనిమిదో అధ్యాయం - అక్షరబ్రహ్మ యోగం

అర్జున ఉవాచ

1. **కిం తద్బ్రహ్మ కిమధ్యాత్మం కిం కర్మ పురుషోత్తమ ।**
**అధిభూతం చ కిం ప్రోక్తమధిదైవం కిముచ్యతే ॥**

2. **అధియజ్ఞః కథం కోఽత్ర దేహేఽస్మిన్మధుసూదన ।**
**ప్రయాణకాలే చ కథం జ్ఞేయోఽసి నియతాత్మభిః ॥**

*భావం : అర్జునుడు అడిగాడు : ఓ కృష్ణా! బ్రహ్మం అంటే ఏమిటి? ఆధ్యాత్మం అంటే ఏమిటి? కర్మంటే ఏమిటి? అధిభూతం అంటే ఏమిటి? అధి దైవం ఏది? ఈ దేహంలోని అధియజ్ఞుడు ఎవరు? అతన్ని తెలుసుకోవడం ఎలా? తుదిశ్వాస సమయంలో మనసు నిగ్రహం గల వారికి నువ్వు ఎలా తెలుస్తున్నావు?*

శ్రీ భగవాన్ ఉవాచ

3. **అక్షరం బ్రహ్మ పరమం స్వభావోఽధ్యాత్మముచ్యతే ।**
**భూతభావోద్భవకరో విసర్గః కర్మసంజ్ఞితః ॥**

*భావం : కృష్ణుడు చెప్పాడు : సర్వోత్తమమైనదీ, శాశ్వతమైనదీ బ్రహ్మం. ఆధ్యాత్మం అంటే జీవాత్మ. కర్మ అంటే సమస్త ప్రాణులని సృష్టించే క్రియ.*

4. **అధిభూతం క్షరో భావః పురుషశ్చాధిదైవతమ్ ।**
**అధియజ్ఞో హమేవాత్ర దేహే దేహభృతాం వర ॥**

*భావం : ఓ అర్జునా! నశించే పదార్థానికి అధిభూతం అని పేరు. విరాట్ పురుషుడు అధిదైవం. దేహంలో నేనే (పరమాత్మే) అధియజ్ఞుడు.*

5. **అంతకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కలేబరమ్ ।**
**యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః ॥**

*భావం : మరణకాలంలో నన్నే స్మరిస్తూ తుదిశ్వాసని విడిచేవాడు నా స్వరూపాన్ని (నన్నే) పొందుతున్నాడు. ఇందులో కొంచెం కూడా సందేహం లేదు.*

6. **యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కలేబరమ్ ।**
**తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః ॥**

*భావం : ఓ అర్జునా! మరణకాలంలో ఎవడు దేన్ని (ఆలోచనలు, రూపం) ఆలోచిస్తూ శరీరాన్ని విడుస్తాడో, వాడు ఆ భావంతో ఆ రూపాన్నే పొందుతాడు. (కారణం వాడు ఎప్పుడూ వాటినే స్మరిస్తూంటాడు)*

7. **తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్యచ ।**
**మయ్యర్పితమనోబుద్ధిః మామేవైష్యస్యసంశయః ॥**

*భావం : కాబట్టి ఎల్లప్పుడూ నన్నే స్మరిస్తూండు. యుద్ధాన్ని (స్వధర్మాన్ని) కూడా చేయి. నీ మనసు, బుద్ధి నాకు సమర్పిస్తే నన్నే పొందుతావు. ఇందులో సందేహం లేదు.*

8. **అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా ।**
**పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్ ॥**

*భావం : ఓ అర్జునా! మనసుని ఎటూ పోనీయక దివ్యపురుషుడైన పరమాత్మని క్షణక్షణం స్మరించేవాడు నన్నే పొందుతాడు.*

9. కవిం పురాణమనుశాసితార
మణోరణీయాంసమనుస్మరేద్యః ।
సర్వస్య ధాతారమచింత్యరూప
మాదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥

10. ప్రయాణకాలే మనసాచలేన
భక్త్యా యుక్తో యోగబలేన చైవ
భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య సమ్యక్
స తం పరం పురుషముపైతి దివ్యమ్ ॥

*భావం : పరమభక్తుడు మరణసమయంలో ధ్యానాభ్యాస యోగబలంతో ప్రాణాలని కనుబొమల మధ్యే చక్కగా నిలిపి, సర్వజ్ఞుడు, సనాతనుడు, జగత్పాలకుడు అణువు కంటే మిక్కిలి సూక్ష్మమైన వాడు, సర్వజగత్తుకి ఆధారమైనవాడు, ఊహకి అందని రూపం గల వాడు, సూర్యుడిలా సదా ప్రకాశించేవాడు (స్వయంప్రకాశకుడు) అజ్ఞానం అనే అంధకారానికి అవతల ఉన్నవాడు అయిన పరమాత్ముని పొందుతున్నాడు.*

11. యదక్షరం వేదవిదో వదంతి
విశంతి యద్యతయో వీతరాగాః ।
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి
తత్తే పదం సంగ్రహేణ ప్రవక్ష్యే ॥

*భావం : వేదవేత్తలు దేన్ని శాశ్వతమైనదిగా చెప్తారో, కోరికలు నశించిన జితేంద్రియులు బ్రహ్మచర్యాన్ని అనుష్టించి ఏ పరమపదాన్ని అందుకుంటారో ఆ పరమపదం గురించి నీకు వివరంగా చెప్తాను.*

12. సర్వద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్యచ ।
మూర్ధ్న్యాధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణమ్ ॥

**13. ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్ ।**
**యః ప్రయాతి త్యజన్దేహం స యాతి పరమాం గతిమ్ ॥**

*భావం : ఎవడు అన్ని ఇంద్రియాలని నిగ్రహించి, ఆత్మలో మనసుని, శిరస్సులో (బ్రహ్మరంధ్రంలో) ప్రాణవాయువుని నిలిపి, ఏకాగ్రధ్యానం దృఢంగా చేస్తూ, పరబ్రహ్మ స్వరూపమైన 'ఓం' అనే అక్షరాన్ని పలుకుతూ, నన్ను (పరమాత్మని) విడవకుండా స్మరిస్తూ శరీరాన్ని వదులుతాడో అతడు సర్వోన్నత స్థానాన్ని (మోక్షాన్ని) పొందుతున్నాడు.*

**14. అనన్యచేతాస్సతతం యో మాం స్మరతినిత్యశః ।**
**తస్యాహం సులభః పార్థ నిత్యయుక్తస్య యోగినః ॥**

*భావం : ఓ అర్జునా! ఎవడు మనసులో ఇతర విషయాలు లేకుండా సదా నన్ను నిరంతర ధ్యానంతో స్మరిస్తాడో అలాంటి వాడికి నేను సులభంగా లభిస్తాను.*

**15. మాముపేత్య పునర్జన్మ దుఃఖాలయ మశాశ్వతమ్ ।**
**నాప్నువంతి మహాత్మానస్సంసిద్ధిం పరమాం గతాః ॥**

*భావం : సర్వోత్తమమైన మోక్షాన్ని పొందిన మహాత్ములు నన్ను చేరాక, దుఖాలకి నిలయమైన, అశాశ్వతమైన జన్మని తిరిగి పొందరు.*

**16. ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావర్తినోర్జున ।**
**మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే ॥**

*భావం : ఓ అర్జునా! బ్రహ్మలోకం చేరే దాకా గల అన్ని లోకాలు పునర్జన్మ కలిగినవి. నన్ను పొందితే ఇక పునర్జన్మే లేదు.*

**17. సహస్రయుగపర్యంతమహర్యద్బ్రహ్మణో విదుః ।**
**రాత్రిం యుగసహస్రాంతం తే హోరాత్రవిదో జనాః ॥**

*భావం : ఏ మనుషులు బ్రహ్మదేవుడి యొక్క పగలు వేయి యుగాల పరిమితి కలది అని, రాత్రి వేయి యుగాల పరిమితి కలది అని తెలుసుకుంటారో అలాంటి వారు రాత్రింబగళ్ళ (కాలం) తత్త్వం బాగా తెలిసినవారవుతారు.*

**18. అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవంత్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయంతే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥**

*భావం : సమస్త చరాచర వస్తువులన్నీ బ్రహ్మదేవుడి పగటి సమయంలో అవ్యక్తం (శూన్యం) నించి పుడతాయి. రాత్రి ప్రారంభంలో అవ్యక్తం (శూన్యం)లో లీనమవుతాయి.*

**19. భూతగ్రామస్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।**
**రాత్ర్యాగమేవశః పార్థ ప్రభవత్యహరాగమే ॥**

*భావం : ఓ అర్జునా! పూర్వకల్పం లోని అలాంటి ఈ ప్రాణులు సముదాయమే కర్మ ఫలితంగా పుట్టి పుట్టి (అనేక జన్మలెత్తి) బ్రహ్మదేవుడి రాత్రి ఆరంభంలో లయం చెందుతున్నాయి. తిరిగి బ్రహ్మదేవుడి పగటి ప్రారంభంలో పుడుతున్నాయి.*

**20. పరస్తస్మాత్తు భావోన్యోవ్యక్తో వ్యక్తాత్ సనాతనః ।**
**యః స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥**

*భావం : సమస్త ప్రాణికోటి నశించినా, అవ్యక్తం కంటె వేరైనది, ఉత్తమమైనది, ఇంద్రియాలు తెలుసుకోలేనిది, సనాతనమైనది అయిన అది (పరబ్రహ్మం) నశించదు.*

**21. అవ్యక్తోక్షర ఇత్యుక్తస్తమాహుః పరమాం గతిమ్ ।**
**యం ప్రాప్య న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥**

*భావం : ఏ పరమాత్మ (ఇంద్రియాలకి) అవ్యక్తుడు, శాశ్వతుడు అని చెప్పబడ్డాడో అతనినే సర్వోత్తమమైన పొందదగ్గ వాడిగా వేదవేత్తలు చెప్తున్నారు. ఏ స్థానాన్ని పొందితే మరల జన్మించరో అదే నా శ్రేష్ఠమైన స్థానం.*

**22. పురుషః స పరః పార్థ భక్త్యా లభ్యస్త్వనన్యయా ।**
**యస్యాంతఃస్థాని భూతాని యేన సర్వమిదం తతమ్ ॥**

భావం : *ఓ అర్జునా! ప్రాణులన్నీ ఎవరిలో ఉన్నాయో, ఎవరితో ఈ సమస్త జగత్తూ వ్యాపించబడి ఉందో ఆ పరమాత్ముని ఏకాగ్రభక్తి చేతనే పొందచ్చు.*

**23. యత్ర కాలే త్వనావృత్తిమావృత్తిం చైవ యోగినః ।**
**ప్రయాతా యాంతి తం కాలం వక్ష్యామి భరతర్షభ ॥**

భావం : *ఓ భరతశ్రేష్ఠా! ఏ కాలంలో మరణించిన యోగులు తిరిగి రారో, (పుట్టరో) ఏ కాలంలో మరణించిన యోగులు తిరిగి జన్మిస్తారో ఆ కాలాల (రెండు మార్గాల) గురించి చెప్తున్నాను.*

**24. అగ్నిర్జ్యోతిరహఃశ్శుక్ల షణ్మాసా ఉత్తరాయణమ్ ।**
**తత్ర ప్రయాతా గచ్ఛంతి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః ॥**

భావం : *అగ్ని, ప్రకాశం, పగలు (అధిదేవతలుగా) గల శుక్లపక్షం లోని ఆరు నెలలు ఉత్తరాయణం. ఆ కాలంలో మరణించే బ్రహ్మవేత్తలు బ్రహ్మన్నే పొందుతున్నారు. (జ్యోతిర్మయ మార్గం లేదా దేవయానం)*

**25. ధూమో రాత్రిస్తథా కృష్ణష్షణ్మాసా దక్షిణాయనమ్ ।**
**తత్ర చాంద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే ॥**

భావం : *పొగ, రాత్రి (అధిదేవతలుగా) గల ఆరు నెలలు కృష్ణపక్షం దక్షిణాయనం. ఆ కాలంలో మరణించిన యోగి చంద్ర సంబంధంమైన ప్రకాశాన్ని పొంది తిరిగి జన్మిస్తున్నాడు. (ధూమ్రమార్గం లేదా పితృయానం)*

**26. శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే ।**
**ఏకయా యాత్యనావృత్తిమన్యయావర్తతే పునః ॥**

భావం : *శుక్ల,కృష్ణ పక్షాలు రెండూ ప్రపంచంలో శాశ్వతంగా ఉంటాయి. అందులో ఒక దాంట్లో మోక్షాన్ని, రెండో దాంట్లో పునర్జన్మని మనుషుడు పొందుతున్నాడు.*

**27. నైతే సృతీ పార్థ జానన్ యోగీ ముహ్యతి కశ్చన ।**
**తస్మాత్సర్వేషు కాలేషు యోగయుక్తో భవార్జున ॥**

భావం : *ఓ అర్జునా! ఈ రెండు మార్గాలని తెలిసిన ఏ యోగీ ప్రాపంచిక సుఖాల వెంటపడడు. కాబట్టి నువ్వు ఎల్లప్పుడూ యోగయుక్తుడిగా ఉండు.*

**28. వేదేషు యజ్ఞేషు తపస్సు చైవ**
**దానేషు యత్పుణ్యఫలం ప్రదిష్టమ్ ।**
**అత్యేతి తత్సర్వమిదం విదిత్వా**
**యోగీ పరం స్థానముపైతి చాద్యమ్ ॥**

భావం : *యోగి దీన్ని (ఈ అధ్యాయంలో చెప్పబడ్డ తత్త్వాన్ని) తెలుసుకుంటే వేదాల్లో, యజ్ఞాల్లో, దానాల్లో, తపస్సుల్లో ఏ ఫలం వస్తుందో దాన్ని మించిన పుణ్యఫలాన్ని పొంది సర్వోత్కృష్టమైన బ్రహ్మాన్ని పొందుతాడు.*

**గంగా గీతా తథా భిక్షుః కపిలాశ్వత్థసేవనం।**
**వాసరం పద్మనాభశ్చ పావనం కిం కలౌ యుగే ।**
భావం : కలియుగంలో గంగా నది, గీత, సాధువు, కపిలగోవు, రావి చెట్టు, విష్ణు సంబంధ పర్వదినాలని మించి సేవించడానికి ఇంకేం ఉన్నాయి?

# తొమ్మిదో అధ్యాయం

# రాజవిద్యా రాజగుహ్యా యోగం

శ్రీ భగవాన్ ఉవాచ

1. **ఇదం తు తే గుహ్యతమం ప్రవక్ష్యామ్యనసూయవే ।**
**జ్ఞానం విజ్ఞానసహితం యద్జ్ఞాత్వా మోక్ష్యసే శుభాత్ ॥**

భావం : భగవానుడు చెప్పాడు : దేనిని తెలుసుకుంటే, అశుభం నించి (సంసారబంధం) విముక్తి చెందుతావో అలాంటి అతి రహస్యమైన, అనుభవ జ్ఞానంతో కూడిన బ్రహ్మజ్ఞానాన్ని అసూయ లేని నీకు చక్కగా బోధిస్తున్నాను.

2. **రాజవిద్యా రాజగుహ్యం పవిత్రమిదముత్తమమ్ ।**
**ప్రత్యక్షావగమం ధర్మ్యం సుసుఖం కర్తుమవ్యయమ్ ॥**

భావం : *ఈ బ్రహ్మజ్ఞానం అన్ని విద్యల్లోకి శ్రేష్ఠమైనది. అతి రహస్యమైంది. సర్వోత్కృష్టమైంది, పవిత్రమైంది. ప్రత్యక్షంగా తెలుసుకోతగ్గది. ధర్మమైనది. చేయడానికి మిక్కిలి సులభమైనది. నాశనం లేనిది.*

3. **అశ్రద్ధధానాః పురుషా ధర్మస్యాస్య పరంతప ।**
**అప్రాప్య మాం నివర్తంతే మృత్యుసంసారవర్త్మని ॥**

*భావం : ఓ అర్జునా! ఈ ధర్మం (ఆత్మజ్ఞానం) మీద శ్రద్ధ లేని మనుషులు నన్ను పొందక మృత్యురూపమైన సంసారమార్గంలో పడి తిరుగుతున్నారు.*

**4. మయా తతమిదం సర్వం జగదవ్యక్తమూర్తినా ।**
**మత్స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః ॥**

*భావం : ఇంద్రియాలకి అందని నాచేత ఈ ప్రపంచం మొత్తం ఆవరించబడింది. సమస్త ప్రాణులు నాలో ఉన్నాయి. కానీ నేను వాటిలో లేను.*

**5. న చ మత్స్థాని భూతాని పశ్య మే యోగమైశ్వరమ్ ।**
**భూతభృన్న చ భూతస్థో మమాత్మా భూతభావనః ॥**

*భావం : ఈ ప్రాణులని సృష్టించి పోషించేది నేనే అయినా, నిజానికి నేను వాటిలో లేను.*

**6. యథాకాశస్థితో నిత్యం వాయుస్సర్వత్రగో మహాన్ ।**
**తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ ॥**

*భావం : గొప్పదైన గాలి ఎప్పుడూ ఎలా ఆకాశంలో అంతటా నిండి ఉంటుందో అలా సమస్తప్రాణులు నాలో నిండి ఉన్నాయి.*

**7. సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికామ్ ।**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ ॥**

*భావం : ఓ అర్జునా! సర్వప్రాణులు కల్పాంతంలో (ప్రళయ కాలంలో) నన్నే (ప్రకృతి) చేరతాయి. కల్పారంభంలో (సృష్టికాలంలో) వాటిని నేను తిరిగి సృష్టిస్తున్నాను.*

**8. ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః ।**
**భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్ ॥**

భావం : స్వతంత్రం లేని సమస్త ప్రాణులు ప్రకృతికి (మాయకి) ఆధీనమై ఉండడంతో, నేను వారిని నా ప్రకృతి (మాయ) ద్వారా మళ్ళీ మళ్ళీ సృష్టిస్తున్నాను.

**9. న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ ।**
**ఉదాసీనవదాసీన మసక్తం తేషు కర్మసు ॥**

భావం : ఓ అర్జునా! ఆ కర్మల్లో (సృష్టి, లయాల్లో) తటస్థుడిగా, ఆసక్తి లేకుండా ఉండే నన్ను ఆ కర్మలు బంధించవు.

**10. మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతే సచరాచరమ్ ।**
**హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే ॥**

భావం : ఓ అర్జునా! అధ్యక్షుడిగా (సాక్షిగా) ఉన్న నేను ప్రకృతి (మాయ)తో చరాచర ప్రపంచాన్ని సృష్టిస్తున్నాను. ఇందువల్లే సంసారచక్రం పరిభ్రమిస్తోంది.

**11. అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితమ్ ।**
**పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్ ॥**

భావం : నా పరమతత్త్వం తెలియని అవివేకులు సర్వప్రాణులకి ఈశ్వరుడైన నన్ను, లోకకళ్యాణం కోసం మనిషిగా పుట్టినప్పుడు తక్కువగా ఊహిస్తున్నారు.

**12. మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః ।**
**రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః ॥**

భావం : వారు పనికిరాని ఆశలు, కర్మలతో బుద్ధిహీనులై మోహాన్ని కలగచేసే రాక్షస, అసురీ సంబంధమైన స్వభావాన్నే ఆశ్రయిస్తున్నారు.

**13. మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః ।**
**భజంత్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయమ్ ॥**

భావం : ఓ అర్జునా! దైవీప్రకృతిని ఆశ్రయించి, సర్వప్రాణులకి నేనే కారణమని, శాశ్వతుడినని తెలుసుకుని ఇతర ఆలోచనలు మాని మహాత్ములు నన్ను సేవిస్తున్నారు.

**14. సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః ।**
**నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే ॥**

భావం : వారు (మహాత్ములు) సదా నన్ను కీర్తిస్తూ, దృఢచిత్తంతో ప్రయత్నిస్తూ, భక్తితో నమస్కరిస్తూ, నిత్యం ఏకాగ్రతతో నన్నే పూజిస్తున్నారు.

**15. జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే ।**
**ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్ ॥**

భావం : మరి కొందరు జ్ఞానయజ్ఞంతో, అద్వైతభావంతో, ఇంకొందరు ద్వైతభావంతో ఇలా అనేక విధాలుగా విశ్వరూపుడైన నన్ను ఉపాసిస్తున్నారు.

**16. అహం క్రతురహం యజ్ఞః స్వధాహమహమౌషధమ్ ।**
**మంత్రో హమహమేవాజ్యమహమగ్నిరహం హుతమ్ ॥**

భావం : క్రతువుని నేనే. యజ్ఞాన్ని నేనే. మంత్రాన్ని నేనే. హోమద్రవ్యాన్ని నేనే. అగ్నిని నేనే. హోమకర్మని నేనే.

**17. పితాహమస్య జగతో మాతా ధాతా పితామహః ।**
**వేద్యం పవిత్ర మోంకార ఋక్సామయజురేవ చ ॥**

భావం : ఈ ప్రపంచానికి నేనే తండ్రిని, తల్లిని. కర్మఫల ప్రదాతని. తాతని. తెలుసుకోదగ్గ వాడిని. పవిత్రుడ్ని. ఓంకారాన్ని. ఋగ్వేదం,సామ, యజుర్వేదం మొదలైనవి నేనే.

**18. గతిర్భర్తా ప్రభుస్సాక్షీ నివాసశ్శరణం సుహృత్ ।**
**ప్రభవః ప్రలయః స్థానం నిధానం బీజమవ్యయమ్ ॥**

భావం : పరమలక్ష్యాన్ని. భరించువాడిని (పోషించువాడిని), ప్రభువుని, సాక్షిని, ప్రాణులందరికీ నివాసస్థానాన్ని. శరణం పొంద తగినవాడిని. ప్రతిఫలం కోరక మంచి చేసేవాడిని. సృష్టి, స్థితి, లయాలకి కర్తని. అపార అనుగ్రహం కలవాడిని. నాశనం కాని బీజాన్ని (మూల కారణాన్ని) నేనే.

**19. తపామ్యహమహం వర్షం నిగృహ్ణామ్యుత్సృజామి చ ।**
**అమృతం చైవ మృత్యుశ్చ సదసచ్చాహమర్జున ॥**

భావం : ఓ అర్జునా! సూర్య రూపంలో నేనే తపిస్తున్నాను. వర్షాన్ని నేనే కురిపిస్తున్నాను. నిలిపేస్తున్నాను. మోక్షాన్ని, మరణాన్ని నేనే. శాశ్వతమైన ఆత్మని, అశాశ్వతమైన సమస్త వస్తుజాలాన్ని నేనే.

**20. త్రైవిద్యా మాం సోమపాః పూతపాపా**
**యజ్ఞైరిష్ట్వా స్వర్గతిం ప్రార్థయంతే ।**
**తే పుణ్యమాసాద్య సురేంద్రలోక**
**మశ్నంతి దివ్యాన్దివి దేవభోగాన్ ॥**

భావం : మూడు వేదాలని అధ్యయనం చేసి సోమపానం చేసినవారు, పాపాలు తొలగిన వారు యజ్ఞాలతో నన్ను పూజించి స్వర్గప్రాప్తిని కోరతారు. వారు పుణ్యఫలమైన దేవేంద్రలోకం వెళ్ళి దివ్యభోగాలు అనుభవిస్తారు.

**21. తే తం భుక్త్వా స్వర్గలోకం విశాలం**
**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి ।**
**ఏవం త్రయీధర్మ మనుప్రపన్నా**
**గతాగతం కామకామా లభంతే ॥**

భావం : స్వర్గాభిలాషులు విశాలమైన స్వర్గలోకంలో పుణ్యాలు అనుభవించి, అవి ఖర్చవగానే తిరిగి మనిషిగా జన్మిస్తున్నారు. స్వర్గప్రాప్తి కోసం వేదకర్మలని చేసిన ఆ భోగాభిలాషులు రాకపోకలు(జననమరణాలని) పొందుతున్నారు.

**22. అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।**
**తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥**

*భావం : ఎవరు ఇతర ఆలోచనలు లేక, నన్నే ఏకాగ్రతతో ధ్యానిస్తున్నారో, వారి యోగక్షేమాలని నేను చూసుకుంటాను.*
*(యోగం = వస్తుప్రాప్తి, క్షేమం = ప్రాప్తించిన వస్తు రక్షణ)*

**23. యే ప్యన్యదేవతా భక్తా యజంతే శ్రద్ధయాన్వితాః ।**
**తేపి మామేవ కౌంతేయ యజంత్యవిధిపూర్వకమ్ ॥**

*భావం : ఓ అర్జునా! ఎవరు ఇతర దేవతలని శ్రద్ధగా ఆరాధిస్తారో వారు కూడా క్రమం తప్పి (అజ్ఞానంతో) నన్ను ఆరాధించినట్లే.*

**24. అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ ।**
**న తు మామభిజానంతి తత్త్వేనాతశ్చ్యవంతి తే ॥**

*భావం : ఎందుకంటే, అన్ని యజ్ఞాలకి నేనే భోక్తని. ప్రభువుని. వారు నా పరమేశ్వర తత్త్వాన్ని తెలుసుకోక పతనం అవుతున్నారు. (పునర్జన్మని పొందుతున్నారు)*

**25. యాంతి దేవవ్రతా దేవాన్ పితౄన్ యాంతి పితృవ్రతాః ।**
**భూతాని యాంతి భూతేజ్యా యాంతి మద్యాజినోపి మామ్ ॥**

*భావం : దేవతలని పూజించేవారు దేవలోకానికి, పితృదేవతలని ఆరాధించే వారు పితృలోకాన్ని, భూతాలని ఆరాధించేవారు భూతలోకానికి వెళ్తున్నారు. నన్ను ఆరాధించే భక్తులు నన్నే పొందుతారు.*

**26. పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।**
**తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః ॥**

**భావం :** *ఎవరు నిర్మలభక్తితో ఆకుని కాని, పువ్వుని కాని, పండుని కానీ, నీటిని కానీ నాకు సమర్పిస్తారో వాటిని నేను ప్రీతితో స్వీకరిస్తున్నాను.*

**27. యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్ ।**
**యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్ ॥**

*భావం : ఓ అర్జునా! నువ్వు చేసే కర్మని, తినే ఆహారాన్ని, దానాన్ని (యజ్ఞం) హోమాన్ని, తపస్సుని నాకే సమర్పించు.*

**28. శుభాశుభఫలై రేవం మోక్ష్యసే కర్మబంధనైః ।**
**సన్న్యాసయోగయుక్తాత్మా విముక్తో మాముపైష్యసి ॥**

*భావం : ఇలా సమస్త కర్మలని నాకే సమర్పిస్తే, ఆ కర్మ ఫలాలుగా వచ్చే పుణ్యపాపాల కర్మబంధం నించి విముక్తుడివై నన్నే పొందుతావు.*

**29. సమోహం సర్వభూతేషు న మే ద్వేష్యోస్తి న ప్రియః ।**
**యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్ ॥**

*భావం : నేను సమస్తప్రాణుల్లో సమానంగా ఉంటాను. నాకు ప్రియులు కానీ, అప్రియులు కానీ లేరు. కానీ నన్ను ఎవరు భక్తితో సేవిస్తారో వారు నాలోనే ఉంటారు. నేను కూడా వారిలో ఉంటాను.*

**30. అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్ ।**
**సాధురేవ స మంతవ్యస్సమ్యగ్వ్యవసితో హి సః ॥**

*భావం : మిక్కిలి దుర్మార్గుడైనా, ఏకాగ్ర భక్తితో నన్ను పూజిస్తే, వాడిని సత్పురుషుడిగానే భావించాలి. ఎందుకంటే, అతను ఉత్తమ మనో నిశ్చయం కలవాడు (పరమాత్ముని పూజించడం తప్ప ఇంకోటి లేదని నిశ్చయించుకున్న వాడు)*

**31. క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి ।**
**కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి ॥**

*భావం : ఓ కౌంతేయా! అతను (నన్నాశ్రయించిన పాపాత్ముడు) వెంటనే ధర్మాత్ముడై, శాశ్వతమైన పరమశాంతిని పొందుతాడు. 'నా భక్తుడు ఎన్నడూ చెడిపోడు' అన్నది నిశ్చయం.*

**32. మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేపి స్యుః పాపయోనయః ।**
**స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేపి యాంతి పరాంగతిమ్ ॥**

*భావం : ఓ అర్జునా! పాపజన్మని పొందని వారు, ఇంకా స్త్రీలు, వైశ్యులు, శూద్రులు నన్ను ఆశ్రయించి తప్పక మోక్షం పొందుతారు.*

**33. కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా ।**
**అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వ మామ్ ॥**

*భావం : పుణ్యాత్ములైన బ్రాహ్మణులు, అలాగే భక్తులైన రాజులు నన్ను పూజిస్తే పరమపదాన్ని పొందుతారని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. అందువల్ల అశాశ్వతమైన (క్షణభంగురమైన) సుఖం లేని ఈ లోకాన్ని పొందిన నువ్వు నన్ను సేవించు.*

**34. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామేవైష్యసి యుక్త్వైవమాత్మానం మత్పరాయణః ॥**

*భావం : నన్నే పూజిస్తూ నా భక్తుడివై నాకు నమస్కరించు. ఈ విధంగా మనసు నామీదే నిలిపి నన్నే పరమావధిగా చేసుకుంటే నన్నే పొందుతావు.*

**భగవద్గీతా కించి దధీతా గంగాజలలవకణికా పీతా।**

**సకృదపి ఏన మురారిసమర్చా తస్య కరోతి యమోపి న చర్చాం॥**

భావం : ఎవడు భగవద్గీతని కొంచెమైనా అధ్యయనం చేస్తాడో, గంగ నీటిని రవ్వంతైనా తాగుతాడో, విష్ణుమూర్తిని ఒక్క సారైనా పూజిస్తాడో అలాంటి వాడి గురించి యముడు చర్చించడు. (నరకానికి వెళ్ళడని భావం)

# పదో అధ్యాయం - విభూతి యోగం

శ్రీ భగవాన్ ఉవాచ

1. **భూయ ఏవ మహాబాహో శృణు మే పరమం వచః ।**
**యత్తేహం ప్రీయమాణాయ వక్ష్యామి హితకామ్యయా ॥**

భావం : *భగవానుడు చెప్పాడు : ఓ అర్జునా (నా మాటలతో) సంతోషించే నీకు హితాన్ని కలిగించే శ్రేష్టమైన విషయాలని మళ్ళీ చెప్తున్నాను. వాటిని విను.*

2. **న మే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః ।**
**అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః ॥**

భావం : నా ఉత్పత్తి (అవతార రహస్యం) దేవతలకి, మహార్షులకి తెలియదు. అన్ని విధాలా నేను వారికి ఆది పురుషుడ్ని కదా?

3. **యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరమ్ ।**
**అసమ్మూఢస్స మర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే ॥**

భావం : *ఎవడు నన్ను జన్మరహితుడిగా, అనాది అయినవాడుగా, అన్ని లోకాలకి ఈశ్వరుడిగా తెలుసుకుంటాడో, అతను మనుషుల్లో జ్ఞాని. అతడు సర్వ పాపాల నించి విముక్తుడవుతాడు.*

4. **బుద్ధిః జ్ఞానమసమ్మోహః క్షమా సత్యం దమశ్శమః ।**
**సుఖం దుఃఖం భవోభావో భయం చా భయమేవచ ॥**

5. **అహింసా సమతా తుష్టిస్తపో దానం యశో యశః ।**
**భవంతి భావా భూతానాం మత్త ఏవ పృథగ్విధాః ॥**

భావం : *ప్రాపంచిక సుఖాల పట్ల విముఖత, బుద్ధి, జ్ఞానం, ఓర్పు, సత్యం, ఇంద్రియనిగ్రహం. మనోనిగ్రహం, సుఖదుఖాలు, పుట్టుక, నాశనం, భయం, నిర్భయం, అహింస, సమత, తృప్తి, తపస్సు, దానం, కీర్తి, అపకీర్తి... ఇలా జీవుల్లోని వివిధ భావాలు నా వల్లే కలుగుతున్నాయి.*

6. **మహర్షయస్సప్త పూర్వే చత్వారో మనవస్తథా ।**
**మద్భావా మానసా జాతా యేషాం లోక ఇమాః ప్రజాః ॥**

భావం : *లోకంలోని ప్రజల పూర్వీకులైన సప్తమహర్షులు, సనక సనందనాదులు (నలుగురు దేవర్షులు) మనువులు (పధ్నాలుగుమంది) నన్ను దైవంగా తెలుసుకున్నవారు. వీరు నా మనో సంకల్పంతో పుట్టారు.*

7. **ఏతాం విభూతిం యోగం చ మమ యో వేత్తి తత్త్వతః ।**
**సో వికంపేన యోగేన యుజ్యతే నాత్ర సంశయః ॥**

భావం : *నా ఐశ్వర్యాన్ని, యోగతత్త్వాన్ని నిజంగా తెలుసుకున్నవాడు నిశ్చలయోగి (భక్తుడు) అవుతాడు. ఈ విషయంలో సందేహం లేదు.*

8. **అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।**
**ఇతి మత్వా భజంతే మాం బుధా భావసమన్వితాః ॥**

భావం : *'నేనే (పరమాత్మ) ఈ సమస్త జగత్తు ఆవిర్భావానికి కారణం. నావల్లే ఈ సమస్తం నడుస్తోంది' అని వివేకవంతులు తెలుసుకుని పరిపూర్ణ భక్తిశ్రద్ధలతో నన్ను (పరమాత్మని) సేవిస్తున్నారు.*

**9.** **మచ్చిత్తా మద్గతప్రాణాః బోధయంతః పరస్పరమ్ ।**
**కథయంతశ్చ మాం నిత్యం తుష్యంతి చ రమంతి చ ॥**

*భావం : వారు తమ మనసులని నా మీదే లగ్నం చేసి, తమ ప్రాణాలని నాకు అంకితం చేసి, నా గురించి ఒకరికొకరు బోధించుకుంటూ, ముచ్చటించుకుంటూ సదా సంతృప్తిని, ఆనందాన్ని పొందుతున్నారు.*

**10.** **తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం ఏన మాముపయాంతి తే ॥**

*భావం : సదా నా మీదే మనసు లగ్నం చేసి, నన్ను ప్రీతితో సేవించేవారికి నన్ను పొందగల జ్ఞానయోగాన్ని (సంసారబంధం నించి విడివడే జ్ఞానాన్ని) ప్రసాదిస్తున్నాను.*

**11.** **తేషామేవానుకంపార్థ మహమజ్ఞానజం తమః ।**
**నాశయామ్యాత్మభావస్థో జ్ఞానదీపేన భాస్వతా ॥**

*భావం : అలాంటి భక్తుల మీద దయ చూపిస్తూ, వారి అంతఃకరణలో నిలిచి, ప్రకాశించే జ్ఞానదీపంలా నేను వారి అజ్ఞానాంధకారాన్ని నశింపచేస్తున్నాను.*

**అర్జున ఉవాచ**

**12.** **పరం బ్రహ్మ పరం ధామ పవిత్రం పరమం భవాన్ ।**
**పురుషం శాశ్వతం దివ్యమాదిదేవమజం విభుమ్ ॥**

**13.** **ఆహుస్త్వామ్ ఋషయస్సర్వే దేవర్షిర్నారదస్తథా ।**
**అసితో దేవలో వ్యాసస్స్వయం చైవ బ్రవీషి మే ॥**

*భావం : అర్జునుడు చెప్పాడు : నువ్వు పరమ పురుషుడివి, శాశ్వతుడివి, ఆదిదేవుడివి, జన్మరహితుడివి, సర్వవ్యాపకుడివి, పరబ్రహ్మవి, పరంధాముడివి, పరమ పావనుడివి అని దేవర్షి నారదుడు, అసితుడు, దేవలుడు, వేదవ్యాసుడు మొదలైన ఋషులంతా చెప్పారు. ఇప్పుడు నువ్వు స్వయంగా అదే నాకు చెప్తున్నావు.*

14. సర్వమేతదృతం మన్యే యన్మాం వదసి కేశవ ।
న హి తే భగవాన్ వ్యక్తిం విదుర్దేవా న దానవాః ॥

*భావం : ఓ కేశవా! నువ్వు నాకు చెప్పినదంతా సత్యమని అనుకుంటున్నాను. నీ యొక్క నిజస్వరూపం దేవతలకి కానీ, దానవులకి కానీ తెలీదు కదా?*

15. స్వయమేవాత్మనాత్మానం వేత్థ త్వం పురుషోత్తమ ।
భూతభావన భూతేశ దేవదేవ జగత్పతే ॥

*భావం : ఓ పురుషోత్తమా! సమస్త ప్రాణుల సృష్టి కర్తా! సకల జీవప్రదాతా! ఓ దేవదేవా! జగన్నాధా! నీ గురించి నీకు స్వయంగా తెలుసు.*

16. వక్తు మర్హస్యశేషేణ దివ్యాహ్యాత్మ విభూతయః ।
యాభిర్విభూతిభిర్లోకానిమాంస్త్వం వ్యాప్య తిష్ఠసి ॥

*భావం : కాబట్టి ఏ ఐశ్వర్యాలతో నువ్వు ఈ లోకాల్లో వ్యాపించి ఉన్నావో, దివ్యమైన అలాంటి నీ ఐశ్వర్యాలని సంపూర్ణంగా నువ్వే చెప్పగలవు.*

17. కథం విద్యామహం యోగిస్త్వాం సదా పరిచింతయన్ ।
కేషు కేషు చ భావేషు చింత్యోసి భగవన్మయా ॥

*భావం : ఓ యోగేశ్వరా! నేను సదా ఏ విధంగా ధ్యానం చేస్తూ నిన్ను తెలుసుకోగలను? హే భగవాన్! ఏ ఏ భావాలతో నిన్ను నేను ధ్యానించాలి?*

18. విస్తరేణాత్మనో యోగం విభూతిం చ జనార్ధన ।
భూయః కథయ తృప్తిర్హి శృణ్వతో నాస్తి మే మృతమ్ ॥

*భావం : ఓ జనార్దనా! నీ యోగశక్తిని, ప్రపంచంలోని ఐశ్వర్యాలని విశదంగా మళ్ళీ చెప్పు. ఎందుకంటే, నీ మధురమైన మాటలు ఎంత విన్నా నాకు తనివి తీరడం లేదు.*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**19. హంత తే కథయిష్యామి దివ్యా హ్యాత్మవిభూతయః ।**
**ప్రాధాన్యతః కురుశ్రేష్ఠ నాస్త్యంతో విస్తరస్య మే ॥**

*భావం : భగవానుడు చెప్పాడు : ఓ అర్జునా! నా ఐశ్వర్యాలకి అంతమే లేదు. ఇప్పుడు దివ్యమైన వాటిలో ముఖ్యమైనవి (విభూతులు) నీకు చెప్తాను.*

**20. అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః ।**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ ॥**

*భావం : ఓ అర్జునా! సమస్త ప్రాణుల హృదయాల్లో ఉన్న ఆత్మని నేనే. ప్రాణుల సృష్టి స్థితి లయలూ నేనే.*

**21. ఆదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్ ।**
**మరీచిర్మరుతామస్మి నక్షత్రాణామహం శశీ ॥**

*భావం : (అదితి పన్నెండు మంది కొడుకులైన) ఆదిత్యులలో నేను విష్ణువుని. ప్రకాశస్వరూపుల్లో కిరణాలు గల సూర్యుడ్ని. (ఏడుగురు) మరుత్తులలో మరీచిని. (పరివహుడ్ని) నక్షత్రాలలో చంద్రుడ్ని.*

**22. వేదానాం సామవేదోఽస్మి దేవానామస్మి వాసవః ।**
**ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానామస్మి చేతనా ॥**

*భావం : వేదాల్లో నేను సామవేదాన్ని. దేవతల్లో ఇంద్రుడ్ని. ఇంద్రియాల్లో మనసుని. ప్రాణుల్లో ప్రాణశక్తిని.*

**23. రుద్రాణాం శంకరశ్చాస్మి విత్తేశో యక్షరక్షసామ్ ।**
**వసూనాం పావకశ్చాస్మి మేరుశ్శిఖరిణామహమ్ ॥**

*భావం : (ఏకాదశ) రుద్రుల్లో శంకరుడ్ని. యక్ష రాక్షసుల్లో కుబేరుడ్ని. (ఎనిమిది మంది) వసువుల్లో అగ్నిని. పర్వతాల్లో మేరు పర్వతాన్ని.*

**24. పురోధసాం చ ముఖ్యం మాం విద్ధి పార్థ బృహస్పతిమ్ ।**
**సేనానీనామహం స్కందస్సరసామస్మి సాగరః ॥**

భావం : *ఓ అర్జునా! పురోహితుల్లో ముఖ్యుడైన బృహస్పతిని. సేనానాయకుల్లో కుమారస్వామిని. సరస్సులలో సముద్రాన్ని నేనే.*

**25. మహర్షీణాం భృగురహం గిరామస్మ్యేకమక్షరమ్ ।**
**యజ్ఞానాం జపయజ్ఞోస్మి స్థావరాణాం హిమాలయః**

భావం : *మహర్షుల్లో భృగుమహర్షిని. శబ్దంలో ఏకాక్షరమైన 'ఓం' కారాన్ని. యజ్ఞాల్లో జపయజ్ఞాన్ని. స్థిర పదార్థాల్లో హిమాలయ పర్వతాన్ని.*

**26. అశ్వత్థః సర్వవృక్షాణాం దేవర్షీణాం చ నారదః ।**
**గంధర్వాణాం చిత్రరథః సిద్ధానాం కపిలో మునిః ॥**

భావం : *వృక్షాల్లో రావి చెట్టుని. దేవర్షులలో నారదుడ్ని. గంధర్వులలో చిత్రరథుడ్ని. సిద్ధులలో కపిల మునిని.*

**27. ఉచ్చైఃశ్రవసమశ్వానాం విద్ధి మామమృతోద్భవమ్ ।**
**ఐరావతం గజేంద్రాణాం నరాణాం చ నరాధిపమ్ ॥**

భావం : *గుర్రాలలో క్షీరసాగర మథనంలో పుట్టిన ఉచ్చైశ్రవాన్ని. భద్రగజాల్లో ఐరావతాన్ని. మనుషులలో రాజుని.*

**28. ఆయుధానామహం వజ్రం ధేనూనామస్మి కామధుక్ ।**
**ప్రజనశ్చాస్మి కందర్పః సర్పాణామస్మి వాసుకిః ॥**

భావం : *ఆయుధాలలో వజ్రాయుధాన్ని, పాడి ఆవుల్లో కామధేనువుని. జీవులని ఉత్పత్తి చేసే మన్మధుడిని. సర్పాలలో వాసుకిని.*

**29. అనంతాశ్చాస్మి నాగానాం వరుణో యాదసామహమ్ ।**
**పితౄణామర్యమా చాస్మి యమస్సంయమతామహమ్ ॥**

భావం : నాగులలో అనంతుడ్ని. జలదేవతల్లో వరుణుడ్ని. పితృదేవతల్లో ఆర్యం నేనే. శాసకుల్లో యముడ్ని.

**30. ప్రహ్లాదశ్చాస్మి దైత్యానాం కాలః కలయతామహమ్ ।**
**మృగాణాం చ మృగేంద్రోఽహం వైనతేయశ్చ పక్షిణామ్ ॥**

భావం : అసురుల్లో ప్రహ్లాదుడ్ని. గణికులలో కాలాన్ని. మృగాల్లో సింహాన్ని. పక్షుల్లో గరుత్మంతుడిని.

**31. పవనః పవతామస్మి రామః శస్త్రభృతామహమ్ ।**
**ఝషాణాం మకరశ్చాస్మి స్రోతసామస్మి జాహ్నవీ ॥**

భావం : పవిత్రం చేసేవారిలో వాయువుని. ఆయుధధారుల్లో శ్రీరాముడిని. చేపల్లో మొసలిని. నదుల్లో గంగా నదిని.

**32. సర్గాణామాదిరంతశ్చ మధ్యం చైవాహమర్జున ।**
**అధ్యాత్మవిద్యా విద్యానాం వాదః ప్రవదతామహమ్ ॥**

భావం : ఓ అర్జునా! సృష్టికి ఉత్పత్తి, స్థితి, లయం నేనే. విద్యల్లో ఆధ్యాత్మ విద్యని. (తత్త్వనిర్ణయ) వివాదాల్లో వాదం నేనే.

**33. అక్షరాణామకారోఽస్మి ద్వంద్వః సామాసికస్య చ ।**
**అహమేవాక్షయః కాలో ధాతాహం విశ్వతోముఖః**

భావం : అక్షరాల్లో 'అ'కారాన్ని. సమాసాలలో ద్వంద్వసమాసాన్ని. నాశనం లేని కాలాన్ని నేనే. విశ్వతోముఖుడైన కర్మఫల ప్రదాతని (బ్రహ్మ దేవుడ్ని) నేనే.

**34. మృత్యుః సర్వహరశ్చాహముద్భవశ్చ భవిష్యతామ్ ।**
**కీర్తిః శ్రీర్వాక్చ నారీణాం స్మృతిర్మేధా ధృతిః క్షమా ॥**

*భావం : సమస్తాన్ని హరించే మృత్యువుని, భవిష్యత్తులో పుట్టే సమస్తానికి పుట్టుకని నేనే. స్త్రీల లోని కీర్తి, సంపద, వాక్కు, జ్ఞాపకశక్తి, బుద్ధిబలం, ధైర్యం, ఓర్పు నేనే.*

**35. బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్ ।**
**మాసానాం మార్గశీర్షోహమ్ ఋతూనాం కుసుమాకరః ॥**

*భావం : అలాగే సామవేద గానంలో బృహత్సామం నేనే. ఛందస్సులలో గాయత్రిని. మాసాల్లో మార్గశిరాన్ని. ఋతువుల్లో వసంత ఋతువుని నేనే.*

**36. ద్యూతం ఛలయతామస్మి తేజస్తేజస్వినామహమ్ ।**
**జయోస్మి వ్యవసాయోస్మి సత్త్వం సత్త్వవతామహమ్ ॥**

*భావం : వంచకులలో జూదాన్ని నేనే. తేజోవంతులలోని తేజస్సుని (విజేతల) జయాన్ని, ప్రయత్నాన్ని, సాత్వికుల్లోని సత్వగుణాన్ని నేనే.*

**37. వృష్ణీనాం వాసుదేవోస్మి పాండవానాం ధనంజయః ।**
**మునీనామప్యహం వ్యాసః కవీనాముశనా కవిః ॥**

*భావం : యాదవుల్లో వాసుదేవుడ్ని. పాండవుల్లో అర్జునుడ్ని. మునులలో వేదవ్యాసుడ్ని. కవులలో శుక్రాచార్యుడిని.*

**38. దండో దమయతామస్మి నీతిరస్మి జిగీషితామ్ ।**
**మౌనం చైవాస్మి గుహ్యానాం జ్ఞానం జ్ఞానవతామహమ్ ॥**

*భావం : దండించే వారి యొక్క శిక్షని నేనే. జయించే కోరిక గల వారి పథకం నేనే. రహస్యాలలో మౌనాన్ని. జ్ఞానులలోని తత్త్వజ్ఞానం నేనే.*

**39. యచ్చాపి సర్వభూతానాం బీజం తదహమర్జున ।**
**న తదస్తి వినా యత్స్యాన్మయా భూతం చరాచరమ్ ॥**

*భావం : ఓ అర్జునా! సర్వప్రాణుల ఉత్పత్తికి మూల కారణం నేనే. ఎందుకంటే, నేను లేకుండా చరాచరమైనవి లేవు.*

**40. నాంతోస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప ।**
**ఏష తూద్దేశతః ప్రోక్తో విభూతేర్విస్తరో మయా ॥**

*భావం : ఓ పరంతపా! నా దివ్య ఐశ్వర్యానికి అంతమే లేదు. దాని విస్తృతిని గురించి నీకు సంక్షిప్తంగా చెప్పాను.*

**41. యద్యద్విభూతిమత్ సత్త్వం శ్రీమదూర్జితమేవ వా ।**
**తత్తదేవావగచ్ఛ త్వం మమ తేజోంశసంభవమ్ ॥**

*భావం : ఐశ్వర్యంతో, ప్రకాశంతో కూడినది, శక్తివంతమైంది అయిన వస్తువు లేక ప్రాణి నా తేజస్సులోని అంశం నించే వచ్చిందని తెలుసుకో.*

**42. అథవా బహునైతేన కిం జ్ఞాతేన తవార్జున ।**
**విష్టభ్యాహమిదం కృత్స్నమేకాంశేన స్థితోజగత్ ॥**

*భావం : ఓ అర్జునా! విస్తారమైన ఈ జ్ఞానంతో నీకేం ప్రయోజనం? ఈ సంపూర్ణ జగత్తుని నేను ఒక్క అంశంతో ధరించి ఉన్నాను.*

**తాపత్రయోద్భవా పీడా నైవ వ్యాధి ర్భవే త్క్వచిత్ ।**
**న శ్యాపో నైవ పాపం చ దుర్గతి ర్నరకం న చ ॥**
భావం : గీతని పూజించే ఇళ్ళల్లోని వారు తాపత్రయం వల్ల కలిగే బాధలు, రోగాలు, ఇంకా శాపం, దుర్గతి, నరకం అనుభవించరు.

# పదకొండో అధ్యాయం
# విశ్వరూప సందర్శన యోగం

**అర్జున ఉవాచ**

1. **మదనుగ్రహాయ పరమం గుహ్యమధ్యాత్మ సంజ్ఞితమ్ ।**
**యత్త్వయోక్తం వచస్తేన మోహోఽయం విగతో మమ ॥**

*భావం : అర్జునుడు చెప్పాడు : నన్ను అనుగ్రహించడానికి సర్వోన్నతమైన, రహస్యమైన అధ్మాత్మం అనే పేరు గల ఏ విషయాన్ని నువ్వు ఉపదేశించావో దాని వల్ల నా అజ్ఞానం తొలగింది.*

2. **భవాప్యయౌ హి భూతానాం శ్రుతౌ విస్తరశోమయా ।**
**త్వత్తః కమలపత్రాక్ష మాహాత్మ్యమపి చావ్యయమ్ ॥**

*భావం : ఓ కమలాక్షా! శాశ్వతమైన నీ మహత్యం గురించి, సర్వప్రాణుల ఉత్పత్తి, వినాశనాల గురించి సవిస్తరంగా విన్నాను.*

3. **ఏవమేతద్యథాత్థ త్వమాత్మానం పరమేశ్వర ।**
**ద్రష్టుమిచ్ఛామి తే రూపమైశ్వరం పురుషోత్తమ ॥**

*భావం : ఓ పరమేశ్వరా! నీ గురించి నువ్వు చెప్పింది సత్యమే. ఓ పురుషోత్తమా! నీ ఈశ్వర సంబంధమైన రూపాన్ని చూడాలని అనుకుంటున్నాను.*

**4. మన్యసే యది తచ్ఛక్యం మయా ద్రష్టుమితి ప్రభో ।**
**యోగేశ్వర తతో మే త్వం దర్శయాత్మాన మవ్యయమ్ ॥**

భావం : *ప్రభూ! నీ స్వరూపాన్ని నేను చూడడం సాధ్యం అని నువ్వు భావిస్తే, ఓ యోగేశ్వరా! నాశరహితమైన నీ దివ్యరూపాన్ని నాకు చూపించు.*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**5. పశ్య మే పార్థ రూపాణి శతశోథ సహస్రశః ।**
**నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీనిచ ॥**

భావం : *భగవంతుడు చెప్పాడు : ఓ అర్జునా! అనేక విధాలైన, దివ్యమైన, అనేక రంగులు, ఆకారాలు గల వేలాది నా రూపాలని చూడు.*

**6. పశ్యాదిత్యాన్ వసూన్ రుద్రానశ్వినౌ మరుతస్తథా ।**
**బహూన్యదృష్టపూర్వాణి పశ్యాశ్చర్యాణి భారత ॥**

భావం : *ఓ అర్జునా! సూర్యులని, వసువులని, రుద్రులని, అశ్వినీ దేవతలని, మరుత్తులని చూడు. అలాగే ఇంతకు మునుపు ఎన్నడూ చూడని అనేక ఆశ్చర్యాలని కూడా చూడు.*

**7. ఇహైకస్థం జగత్ కృత్స్నం పశ్యాద్య సచరాచరమ్ ।**
**మమ దేహే గుడాకేశ యచ్చాన్యద్ద్రష్టుమిచ్ఛసి ॥**

భావం : *ఓ అర్జునా! చరచరాత్మకమైన, సమస్త ప్రపంచాన్ని, ఇంకా నువ్వు చూడదల్చుకున్న వాటిని కూడా ఒకే చోట నా రూపంలో చూడు.*

**8. న తు మాం శక్యసే ద్రష్టుమనేనైవ స్వచక్షుషా ।**
**దివ్యం దదామి తే చక్షుః పశ్య మే యోగమైశ్వరమ్ ॥**

భావం : *నీ మానవనేత్రాలతో నన్ను చూడలేవు. కాబట్టి నీకు దివ్యనేత్రాలని ఇస్తున్నాను. వాటితో నా ఐశ్వర్యాన్ని, యోగ మహిమని చూడు.*

**సంజయ ఉవాచ**

**9. ఏవముక్త్వా తతో రాజన్ మహాయోగేశ్వరో హరిః ।**
**దర్శయామాస పార్థాయ పరమం రూపమైశ్వరమ్ ॥**

*భావం : సంజయుడు చెప్పాడు : ధృతరాష్ట్ర మహారాజా! గొప్ప యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు ఇలా చెప్పి, సర్వోత్తమమైన, ఈశ్వర సంబంధమైన (విశ్వ) రూపాన్ని అర్జునుడికి ప్రదర్శించాడు.*

**10. అనేకవక్త్రనయన మనేకాద్భుతదర్శనమ్ ।**
**అనేకదివ్యాభరణం దివ్యానేకోద్యతాయుధమ్ ॥**

**11. దివ్యమాల్యాబరధరం దివ్యగంధానులేపనమ్ ।**
**సర్వాశ్చర్యమయం దేవమనంతం విశ్వతోముఖమ్ ॥**

*భావం : అనేక ముఖాలు, నేత్రాలు, అనేక అద్భుతమైన దర్శనాలు, అనేక దివ్యమైన ఆభరణాలు, ఎక్కుపెట్టిన అనేక దివ్య ఆయుధాలు, దివ్య మాలికలు, వస్త్రాలు, దివ్య గంధపు పూత గల అనేక ఆశ్చర్యాల మయమై ప్రకాశించే అంతు లేని అనంత ముఖాలు గల విశ్వరూపాన్ని అర్జునుడు చూసాడు.*

**12. దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా ।**
**యది భాస్సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః ॥**

*భావం : ఆకాశంలో వేల కొలది సూర్యుళ్ళ కాంతి ఒక్క సారి ప్రసరిస్తే వచ్చే కాంతి కూడా ఆ మహాత్ముడి కాంతికి సాటి రాదు.*

**13. తత్రైకస్థం జగత్ కృత్స్నం ప్రవిభక్తమనేకధా ।**
**అపశ్యద్దేవదేవస్య శరీరే పాండవస్తదా ॥**

*భావం : అప్పుడు అనేక విభాగాలుగా విభజింపబడ్డ సమస్త జగత్తుని ఒకే చోట దేవదేవుని శరీరంలో అర్జునుడు చూసాడు.*

14. తతః స విస్మయావిష్టో హృష్టరోమా ధనంజయః ।
ప్రణమ్య శిరసా దేవం కృతాంజలిరభాషత ॥

*భావం : తర్వాత అర్జునుడు ఆశ్చర్యం, గగుర్పాటు చెంది, భగవానుడికి శిరస్సు వంచి నమస్కరించి, చేతులు జోడించి ఇలా పలికాడు.*

**అర్జున ఉవాచ**

15. పశ్యామి దేవాంస్తవ దేవ దేహే
సర్వాంస్తథా భూతవిశేషసంఘాన్ ।
బ్రహ్మాణమీశం కమలాసనస్థ
మృషీంశ్చ సర్వానురగాంశ్చ దివ్యాన్ ॥

*భావం : అర్జునుడు చెప్పాడు : ఓ దేవా! నీ శరీరంలో సమస్త దేవతలని, అలాగే అనేక ప్రాణికోటిని, కమలాసనుడైన బ్రహ్మని, సమస్త ఋషులని, దివ్యసర్పాలని చూస్తున్నాను.*

16. అనేకబాహూదరవక్త్రనేత్రం
పశ్యామి త్వాం సర్వతోనంతరూపమ్ ।
నాంతం న మధ్యం న పునస్తవాదిం
పశ్యామి విశ్వేశ్వర విశ్వరూప ॥

*భావం : ఓ విశ్వేశ్వరా! విశ్వరూపా! అనేక చేతులు, ఉదరాలు, ముఖాలు, కళ్ళు గల అనంతరూపుడైన నిన్ను అంతటా చూస్తున్నాను. నీ మొదలు కానీ, మధ్యం కానీ, అంతం కానీ కనపడటం లేదు.*

17. కిరీటినం గదినం చక్రిణం చ
తేజోరాశిం సర్వతో దీప్తిమంతమ్ ।
పశ్యామి త్వాం దుర్నిరీక్ష్యం సమంతా
ద్దీప్తానలార్కద్యుతి మప్రమేయమ్ ॥

*భావం : కిరీటం, గద, చక్రం ధరించి జ్యోతిర్మయుడై అంతటా ప్రకాశిస్తూ, జ్వలించే అగ్ని, సూర్యుడి తేజస్సు గల పరిమితి లేని నీ రూపాన్ని చూస్తున్నాను.*

**18. త్వమక్షరం పరమం వేదితవ్యం**
**త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**త్వమవ్యయశ్శాశ్వతధర్మగోప్తా**
**సనాతనస్త్వం పురుషో మతో మే ॥**

*భావం : నువ్వు అక్షర పరబ్రహ్మవి, ఈ విశ్వానికి ఆధారానివి, నాశరహితుడివి, శాశ్వతమైన ధర్మాలని కాపాడేవాడివి, సనాతన పురుషుడివి అని నా నమ్మకం.*

**19. అనాది మధ్యాంతమనంతవీర్య**
**మనంతబాహుం శశిసూర్యనేత్రమ్ ।**
**పశ్యామి త్వాం దీప్తహుతాశవక్త్రం**
**స్వతేజసా విశ్వమిదం తపంతమ్ ॥**

*భావం : మొదలు, మధ్యం, తుది లేనివాడివి. అపరిమిత శక్తిశాలివి. అనేక చేతులు గలవాడివి. సూర్యచంద్రులు కళ్ళుగా కలవాడివి. అగ్నిలా జ్వలించే ముఖం కలవాడివి. నీ తేజస్సుతో ఈ ప్రపంచాన్ని తపింపచేసే వాడిగా నిన్ను చూస్తున్నాను.*

**20. ద్యావాపృథివ్యోరిదమంతరం హి**
**వ్యాప్తం త్వయైకేన దిశశ్చ సర్వాః ।**
**దృష్ట్వాద్భుతం రూపముగ్రం తవేదం**
**లోకత్రయం ప్రవ్యథితం మహాత్మన్ ॥**

*భావం : ఓ మహాత్మా! భూమ్యాకాశాల మధ్య ప్రదేశం, ఇంకా దిక్కులన్నీ నీ చేత వ్యాపించబడి ఉన్నాయి. భయంకరమైన, ఆశ్చర్యకరమైన నీ ఈ రూపాన్ని చూసి ముల్లోకాలు భయపడుతున్నాయి.*

**21. అమీ హి త్వాం సురసంఘా విశంతి**
**కేచిద్భీతాః ప్రాంజలయో గృణంతి ।**
**స్వస్తీత్యుక్త్వా మహర్షి సిద్ధసంఘాః**
**స్తువంతి త్వాం స్తుతిభిః పుష్కలాభిః ॥**

భావం : *ఈ దేవతలంతా నీలో ప్రవేశిస్తున్నారు. కొందరు భయపడి చేతులు జోడించి నిన్ను స్తుతిస్తున్నారు. మహర్షులు, సిద్ధులు స్వస్తి వచనాలు పలికి ఉత్తమ స్తోత్రాలతో నిన్ను కీర్తిస్తున్నారు.*

**22. రుద్రాదిత్యా వసవో యే చ సాధ్యా**
**విశ్వేఽశ్వినౌ మరుతశ్చోష్మపాశ్చ ।**
**గంధర్వయక్షాసురసిద్ధసంఘాః**
**వీక్షంతే త్వాం విస్మితాశ్చైవ సర్వే ॥**

భావం : *రుద్రులు, సూర్యులు, వసువులు, సాధ్యులు, విశ్వేదేవతలు, అశ్వినీ దేవతలు, గంధర్వ యక్ష, అసుర సిద్ధుల సముదాయాలు సంభ్రమాశ్చర్యాలతో నిన్నే చూస్తున్నారు.*

***23.*** **రూపం మహత్తే బహువక్త్రనేత్రం**
**మహాబాహో బహుబాహూరుపాదమ్ ।**
**బహూదరం బహుదంష్ట్రాకరాళం**
**దృష్ట్వా లోకాః ప్రవ్యథితా స్తథాహమ్ ॥**

భావం : *ఓ కృష్ణా! అనేక ముఖాలు, కళ్ళు, అనేక చేతులు, తొడలు, పాదాలు, ఉదరాలు, అనేక కోరలు గల భయంకరమైన నీ దివ్య రూపాన్ని చూసి జనులు భయపడుతున్నారు. నేను కూడా భయపడుతున్నాను.*

**24. నభఃస్పృశం దీప్తమనేకవర్ణం**
**వ్యాత్తాననం దీప్తవిశాలనేత్రమ్ ।**

**దృష్ట్వా హి త్వాం ప్రవ్యథితాంతరాత్మా**
**ధృతిం న విందామి శమం చ విష్ణో ॥**

*భావం : ఓ విష్ణుమూర్తీ! ఆకాశాన్ని తాకుతూ, అనేక రంగులతో ప్రకాశిస్తూ తెరచుకున్న నోరు, జ్వలించే విశాలమైన కళ్ళు గల నిన్ను చూసి నా మనసు భయపడింది. నేను ధైర్యాన్ని, శాంతిని కోల్పోయాను.*

**25.** **దంష్ట్రాకరాళాని చ తే ముఖాని**
**దృష్ట్వైవ కాలానల సన్నిభాని ।**
**దిశో న జానే న లభే చ శర్మ**
**ప్రసీద దేవేశ జగన్నివాస ॥**

*భావం : భయంకరమైన కోరలు గల నీ మోహం ప్రళయాగ్నిలా ఉండి, నేను దిగ్భ్రమ చెందాను. నా నెమ్మది శూన్యమైంది. ఓ దేవేశా! ప్రసన్నుడవు జగన్నివాసా!*

**26.** **అమీచ త్వాం ధృతరాష్ట్రస్య పుత్రాః**
**సర్వే సహైవావనిపాలసంఘైః ।**
**భీష్మో ద్రోణస్సూతపుత్ర స్తథాసౌ**
**సహాస్మదీయైరపి యోధముఖ్యైః ॥**

**27.** **వక్త్రాణి తే త్వరమాణా విశంతి**
**దంష్ట్రాకరాళాని భయానకాని ।**
**కేచిద్విలగ్నా దశనాంతరేషు**
**సందృశ్యంతే చూర్ణితైరుత్తమాంగైః ॥**

*భావం : ధృతరాష్ట్రుని కొడుకులు, భీష్ముడు, ద్రోణుడు, కర్ణుడు, (కౌరవ సేనలోని) అందరు రాజులు, అలాగే మా వారి లోని ముఖ్యమైన యోధులు కూడా భయంకరమైన కోరలు గల భయంకరమైన నీ నోళ్ళల్లోకి వేగంగా చేరుతున్నారు. కొందరు నీ పళ్ళ సందుల్లో చిక్కుకుని తలలు నుగ్గునుగ్గవుతూ కనిపిస్తున్నారు.*

**28. యథా నదీనాం బహవోంబువేగాః**
**సముద్రమేవాభిముఖా ద్రవంతి ।**
**తథా తవామీ నరలోకవీరాః**
**విశంతి వక్త్రాణ్యభివిజ్వలంతి ॥**

భావం : *నదీ ప్రవాహాలు సముద్రం వైపు ఎలా ప్రవహిస్తాయో, అలా ఈ మనుష్య లోకం లోని వీరులంతా బాగా జ్వలించే నీ నోళ్ళలోకి ప్రవేశిస్తున్నారు.*

**29. యథా ప్రదీప్తం జ్వలనం పతంగా**
**విశంతి నాశాయ సమృద్ధవేగాః ।**
**తథైవ నాశాయ విశంతి లోకా**
**స్తవాపి వక్త్రాణి సమృద్ధవేగాః ॥**

భావం : *మిడతలన్నీ వినాశనానికై ఎలా అధిక వేగంతో బాగా మండే అగ్నిలోకి ప్రవేశిస్తాయో, అలా జనులు కూడా మిక్కిలి వేగంతో నీ నోళ్ళల్లోకి ప్రవేశించి నాశనమౌతున్నారు.*

**30. లేలిహ్యసే గ్రసమానస్సమంతా**
**ల్లోకాన్ సమగ్రాన్ వదనైర్జ్వలద్భిః ।**
**తేజోభిరాపూర్య జగత్ సమగ్రం**
**భాసస్తవోగ్రాః ప్రతపంతి విష్ణో ॥**

భావం : *ఓ విష్ణుమూర్తీ! మండే నోళ్ళతో సమస్త జనులని, నలువైపులా మింగుతూ ఆస్వాదిస్తున్నావు. నీ భయంకరమైన కాంతులు తేజస్సుతో సమస్త జగత్తుని వ్యాపించి తపింప చేస్తున్నాయి.*

**31. ఆఖ్యాహి మే కో భవానుగ్రరూపో**
**నమోస్తు తే దేవవర ప్రసీద ।**
**విజ్ఞాతుమిచ్ఛామి భవంతమాద్యం**
**న హి ప్రజానామి తవ ప్రవృత్తిమ్ ॥**

*భావం : ఓ పరమాత్మా! భయంకరమైన ఆకారం గల నువ్వు ఎవరివో నాకు చెప్పు. ఎందుకంటే, నీ ప్రవృత్తిని నేను తెలుసుకోలేక పోతున్నాను. ఆది పురుషుడివైన నిన్ను పూర్తిగా తెలుసుకోవాలని అనుకుంటున్నాను. నీకు నమస్కారం! నన్ను అనుగ్రహించు!*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**32. కాలోస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో**
**లోకాన్ సమాహర్తుమిహ ప్రవృత్తః ।**
**ఋతేపి త్వాం న భవిష్యంతి సర్వే**
**యేవస్థితాః ప్రత్యనీకేషు యోధాః ॥**

*భావం : భగవానుడు చెప్పాడు : లోక సంహారం చేయడానికి విజృంభించిన కాలుడిని నేను. జనాన్ని చంపడానికి ఈ ప్రపంచంలో సంచరిస్తున్నాను. నువ్వు యుద్ధం చేయకపోయినా ప్రతిపక్షం లోని వీరుల్లో ఎవరూ జీవించి ఉండరు.*

**33. తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ**
**జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్ ।**
**మయైవైతే నిహతాః పూర్వమేవ**
**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥**

*భావం : కాబట్టి నువ్వు లే. శత్రువులని జయించి, కీర్తిని పొంది సమృద్ధి అయిన రాజ్యాన్ని అనుభవించు. వీరంతా ఇదివరకే నా చేత చంపబడ్డారు. ఓ అర్జునా! నువ్వు నిమిత్తమాత్రుడివి.*

**34. ద్రోణం చ భీష్మం చ జయద్రథం చ**
**కర్ణం తథాన్యానపి యోధవీరాన్ ।**
**మయా హతాంస్త్వం జహి మా వ్యథిష్ఠా**
**యుధ్యస్వ జేతాసి రణే సపత్నాన్ ॥**

*భావం : నా చేత చంపబడిన ద్రోణుడు, భీష్ముడు, జయద్రధుడు, కర్ణుడు ఇంకా ఇతర యుద్ధవీరులని నువ్వు చంపు. భయపడకు. యుద్ధం చెయ్యి. నువ్వు శత్రువులని గెలుస్తావు.*

**సంజయ ఉవాచ**

**35.** **ఏతచ్ఛ్రుత్వా వచనం కేశవస్య**
**కృతాంజలిర్వేపమానః కిరీటీ ।**
**నమస్కృత్వా భూయ ఏవాహ కృష్ణం**
**సగద్గదం భీతభీతః ప్రణమ్య ॥**

*భావం : సంజయుడు చెప్పాడు : అర్జునుడు శ్రీకృష్ణుడు చెప్పిన ఈ మాటలని విని వణుకుతూ చేతులు జోడించి, శ్రీకృష్ణుడికి నమస్కరించి, మిక్కిలి భయంతో ప్రణమిల్లి గద్గదంగా ఇలా చెప్పాడు.*

**అర్జున ఉవాచ**

**36.** **స్థానే హృషీకేశ తవ ప్రకీర్త్యా**
**జగత్ప్రహృష్యత్యనురజ్యతే చ ।**
**రక్షాంసి భీతాని దిశో ద్రవంతి**
**సర్వే నమస్యంతి చ సిద్ధసంఘాః ॥**

*భావం : అర్జునుడు చెప్పాడు : ఓ కృష్ణా! లోకం నీ నామాన్ని మిక్కిలి ప్రేమతో ఉచ్చరిస్తోంది. భయపడ్డ రాక్షసులు నలు దిక్కులా పారిపోతున్నారు. సిద్ధగణాలు నీకు నమస్కరిస్తున్నాయి.*

**37.** **కస్మాచ్చ తే న నమేరన్మహాత్మన్**
**గరీయసే బ్రహ్మణోప్యాదికర్త్రే ।**
**అనంత దేవేశ జగన్నివాస**
**త్వమక్షరం సదసత్తత్పరం యత్ ॥**

*భావం : ఓ మహాత్మా! అనంతరూపా! దేవేశా! జగన్నివాసా! సత్ (ఉన్నది) అసత్ (లేనిది) ఇంకా వాటికి పరమైన, నాశనం లేని పరబ్రహ్మనివి నువ్వే. బ్రహ్మదేవుని జన్మకి నువ్వే కారణం. సర్వ శ్రేష్టుడైన నీకు ఎవరు నమస్కరించకుండా ఉంటారు?*

**38. త్వమాదిదేవః పురుషః పురాణ**
**స్త్వమస్య విశ్వస్య పరం నిధానమ్ ।**
**వేత్తాసి వేద్యం చ పరం చ ధామ**
**త్వయా తతం విశ్వమనంతరూప ॥**

*భావం : ఓ అనంతరూపా! నువ్వు ఆది దేవుడివి. పురాణ పురుషుడివి. ఈ ప్రపంచానికి గొప్ప ఆధారానివి. సర్వజ్ఞుడవి. తెలుసుకోతగ్గవాడివి. నువ్వు సర్వోత్తమమైన స్థానానివి. ఈ ప్రపంచం అంతా నీతో నిండి ఉంది.*

**39. వాయుర్యమోగ్నిర్వరుణ శ్శశాంకః**
**ప్రజాపతిస్త్వం ప్రపితామహశ్చ ।**
**నమో నమస్తేస్తు సహస్రకృత్వః**
**పునశ్చ భూయోపి నమో నమస్తే ॥**

*భావం : నువ్వే వాయుదేవుడివి, యముడివి, అగ్నివి, వరుణుడివి, చంద్రుడివి, ప్రజాపతివి, బ్రహ్మదేవుడి తండ్రివి. నీకు అనేక వేల నమస్కారాలు. మళ్ళీ మళ్ళీ నీకు నమస్కారాలు. ఇంకా కూడా నమస్కారాలు.*

**40. నమః పురస్తాదథ పృష్ఠతస్తే**
**నమోస్తుతే సర్వత ఏవ సర్వ ।**
**అనంతవీర్యామితవిక్రమస్త్వం**
**సర్వం సమాప్నోషి తతోసి సర్వః ॥**

*భావం : సర్వ సామర్థ్యం గల ఓ కృష్ణా! ముందు నించి, వెనక నించి నీకు నమస్కరిస్తున్నాను. అనంత పరాక్రమశాలివైన నువ్వు సమస్తాన్ని చక్కగా వ్యాపించి ఉన్నావు. అందువల్ల అన్ని రూపాలు నువ్వే.*

**41. సఖేతి మత్వా ప్రసభం యదుక్తం**
**హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి ।**
**అజానతా మహిమానం తవేదం**
**మయా ప్రమాదాత్ప్రణయేన వాపి ॥**

**42. యచ్చాపహాసార్థమసత్కృతోసి**
**విహారశయ్యాసనభోజనేషు ।**
**ఏకోథవాప్యచ్యుత తత్సమక్షం**
**తత్ క్షామయే త్వామహమప్రమేయమ్ ॥**

*భావం : ఓ కృష్ణా! నీ మహిమ తెలీక అజ్ఞానంతో, చనువుతో చెలికాడివని 'ఓ కృష్ణా, ఓ యాదవా, ఓ సఖా' అని అమర్యాదగా నిన్ను సంబోధించాను. ఇంకా విహార సమయంలో, పడుకున్నప్పుడు, కూర్చున్నప్పుడు, భోజనం చేసేప్పుడు, ఏకాంతంలో, ఇతరుల ఎదుట సరసంగా నిన్ను కించపరిచాను. ఊహకి అందని నిన్ను ఆ అపరాధాలన్నీ క్షమించమని వేడుకుంటున్నాను.*

**43. పితాసి లోకస్య చరాచరస్య**
**త్వమస్య పూజ్యశ్చ గురుర్గరీయాన్ ।**
**న త్వత్సమోస్త్యభ్యధికః కుతోన్యో**
**లోకత్రయేప్య ప్రతిమ ప్రభావ ॥**

*భావం : సాటి లేని ప్రభావం గల ఓ కృష్ణా! నువ్వు ఈ సమస్త చరాచర జగత్తుకి తండ్రివి. పూజ్యుడివి. సర్వశ్రేష్టుడివైన గురువువి. ముల్లోకాల్లో నీతో సమానమైన వాడు లేడు. నిన్ను మించిన వాడు ఇంకొకడు ఎలా ఉంటాడు?*

**44. తస్మాత్ప్రణమ్య ప్రణిధాయ కాయం**
**ప్రసాదయే త్వామహమీశ మీడ్యమ్ ।**
**పితేవ పుత్రస్య సఖేవ సఖ్యుః**
**ప్రియః ప్రియాయార్హసి దేవ సోఢుమ్ ॥**

*భావం : అందువల్ల నా శరీరాన్ని నేలకి వంచి నీకు సాష్టాంగ నమస్కారం చేస్తున్నాను. ఈశ్వరుడివి, స్తుతింపదగ్గ వాడివి అయిన నిన్ను ప్రసన్నుడు అవమని ప్రార్థిస్తున్నాను. ఓ దేవా! కొడుకుని తండ్రి, మిత్రుడ్ని మిత్రుడు, భార్యని భర్త క్షమించినట్లు (నా తప్పుని) క్షమించు.*

**45. అదృష్టపూర్వం హృషితోస్మి దృష్ట్వా**
**భయేన చ ప్రవ్యథితంమనో మే।**
**తదేవ మే దర్శయ దేవ రూపం**
**ప్రసీద దేవేశ జగన్నివాస ॥**

*భావం : మునుపెన్నడూ చూడని నీ విశ్వరూపాన్ని చూసి సంతోషించాను. నా మనసు భయంతో కలవర పడుతోంది. ఓ దేవా! మునుపటి రూపాన్నే నాకు చూపించు. దేవేశా! జగన్నివాసా! నన్ను అనుగ్రహించు.*

**46. కిరీటినం గదినం చక్రహస్త**
**మిచ్ఛామి త్వాం ద్రష్టుమహం తథైవ ।**
**తేనైవ రూపేణ చతుర్భుజేన**
**సహస్రబాహో! భవ విశ్వమూర్తే ॥**

*భావం : నేను మునుపటిలా కిరీటం, గద, చక్రాలతో కూడిన నిన్ను చూడాలని అనుకుంటున్నాను. అనేక చేతులు గల వాడా! ఓ విశ్వమూర్తీ! నీ చతుర్భుజ రూపాన్ని చూపించు.*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**47. మయా ప్రసన్నేన తవార్జునేదం**
**రూపం పరం దర్శిత మాత్మయోగాత్ ।**
**తేజోమయం విశ్వమనంత మాద్యం**
**యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్ ॥**

*భావం : భగవానుడు చెప్పాడు : ఓ అర్జునా! ప్రకాశమైంది, ప్రపంచమే రూపంగా కలది, అంతం లేనిది, మొదటిది, నువ్వు తప్ప ఇంతకు ముందు ఎవరూ చూడనిది అయిన ఈ సర్వోత్తమమైన విశ్వరూపాన్ని అనుగ్రహంతో నా యోగశక్తితో (నీకు) చూపించాను.*

**48. న వేదయజ్ఞాధ్యయనైర్న దానై**
**ర్న చ క్రియాభిర్న తపోభిరుగ్రైః ।**
**ఏవం రూపశ్శక్య అహం నృలోకే**
**ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర ॥**

భావం : *ఓ అర్జునా! ఈ రూపాన్ని మనుష్యలోకంలో నువ్వు తప్ప మరెవరూ చూడలేదు. వేదాధ్యయనం, యజ్ఞాధ్యయనం, దానాల చేత, ఘోరతపస్సు చేత ఇది చూడడం అసాధ్యం.*

**49. మాతే వ్యథా మా చ విమూఢభావో**
**దృష్ట్వా రూపం ఘోరమీదృన్మమేదమ్ ।**
**వ్యపేతభీః ప్రీతమనాః పునస్త్వం**
**తదేవ మే రూపమిదం ప్రపశ్య ॥**

భావం : *ఇలాంటి భయంకరమైన నా రూపాన్ని చూసి బాధని కానీ, చిత్తభ్రమని కానీ పొందకు. భయపడకు. ఇష్టంతో కూడిన మనసుతో నా పూర్వ రూపాన్నే మళ్ళీ బాగా చూడు.*

**సంజయ ఉవాచ**

**50. ఇత్యర్జునం వాసుదేవస్తథోక్త్వా**
**స్వకం రూపం దర్శయామాస భూయః ।**
**ఆశ్వాసయామాస చ భీతమేనం**
**భూత్వా పునస్సౌమ్యవపుర్మహాత్మా ॥**

భావం : *సంజయుడు చెప్పాడు : ఇలా చెప్పి శ్రీకృష్ణుడు తన పూర్వ రూపాన్ని తిరిగి చూపించాడు. ఆ మహాత్ముడు మళ్ళీ శాంత రూపాన్ని దాల్చి భయపడ్డ అర్జునుడ్ని ఓదార్చాడు.*

**అర్జున ఉవాచ**

**51. దృష్ట్వేదం మానుషం రూపం తవ సౌమ్యం జనార్దన ।**
**ఇదానీమస్మి సంవృత్తస్సచేతాః ప్రకృతిం గతః ॥**

*భావం : అర్జునుడు చెప్పాడు : ఓ కృష్ణా! నీ శాంతమైన మనుష్యరూపాన్ని చూసి తేటపడ్డాను. స్వస్థత పొందాను.*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**52. సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ ।**
**దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః ॥**

*భావం : భగవానుడు చెప్పాడు : నువ్వు ఏ రూపాన్ని చూసావో అది (ఇతరులకి) అత్యంత దుర్లభం. దేవతలు కూడా సదా దాన్ని చూడాలని ఉవ్విళ్ళూరుతూంటారు.*

**53. నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా ।**
**శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా ॥**

*భావం : నువ్వు చూసిన నా రూపం వేదాధ్యయనంతో కానీ, తపస్సుతో కానీ, దానం చేత లేదా యజ్ఞం చేత కాని చూడటం సాధ్యం కాదు.*

**54. భక్త్యా త్వనన్యయా శక్యః అహమేవంవిధోఽర్జున ।**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప ॥**

*భావం : ఓ అర్జునా! ఇలాంటి నన్ను ఏకాగ్ర భక్తితో మాత్రమే తెలుసుకోగలరు. చూడగలరు. (నాలో) ఐక్యం చెందగలరు.*

**55. మత్కర్మకృన్మత్పరమో మద్భక్తస్సంగవర్జితః ।**
**నిర్వైరస్సర్వభూతేషు యస్స మామేతి పాండవ ॥**

*భావం : ఓ అర్జునా! ఎవడు నా కోసమే (ఈశ్వరార్పణ బుద్ధితో) కర్మలని చేస్తూ, నన్నే పొందదగ్గ వాడిగా నమ్మి, నా భక్తుడై లౌకిక సుఖాలని త్యజించి, సమస్త ప్రాణుల మీదా ద్వేషం లేకుండా ఉంటాడో వాడే నన్ను పొందుతాడు.*

**పిత్రూనుద్దిశ్య యః శ్రాద్ధే గీతాపాఠం కరోతి హి।**

**సంతుష్టాః పితర స్తస్య నిరయా ద్యాంతి స్వర్గతిం।**

భావం : శ్రాద్ధకాలంలో పితృదేవతలనిఉద్దేశించి గీతని పఠిస్తే వారు సంతృప్తి చెంది నరకం నించి స్వర్గానికి వెళ్తారు.

# పన్నెండో అధ్యాయం - భక్తి యోగం

అర్జున ఉవాచ

1. ఏవం సతతయుక్తా యే భక్తాస్త్వాం పర్యుపాసతే ।
యే చాప్యక్షరమవ్యక్తం తేషాం కే యోగవిత్తమాః ॥

*భావం : అర్జునుడు చెప్పాడు : ఇలా సదా నీ మీదే మనసుని ఉంచి నిన్ను ఉపాసించే భక్తులు, (విగ్రహారాధకులు) ఇంకా ఇంద్రియాలకి గోచరం కాని శాశ్వత పరబ్రహ్మని ధ్యానించే భక్తులు (నిర్గుణోపాసకులు) వీరిలో ఎవరు యోగంలో శ్రేష్టులు?*

శ్రీ భగవాన్ ఉవాచ

2. మయ్యావేశ్య మనోయే మాం నిత్యయుక్తా ఉపాసతే ।
శ్రద్ధయా పరయోపేతాః తేమే యుక్తతమా మతాః ॥

*భావం : భగవానుడు చెప్పాడు : ఎవరు నా మీద సదా మనసు నిలిపి నన్ను అమితశ్రద్ధతో ఉపాసిస్తారో వారు ఉత్తమ యోగులని నా అభిప్రాయం.*

3. యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే ।
సర్వత్రగమచింత్యం చ కూటస్థమచలం ధ్రువమ్ ॥

4. సంనియమ్యేంద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।
తే ప్రాప్నువంతి మామేవ సర్వభూతహితే రతాః ॥

భావం : ఇంద్రియాలని చక్కగా వశం చేసుకుని, సర్వప్రాణుల మీద సమభావం కలిగి, వారికి మంచి చేస్తూ, ఊహించ లేని అవ్యక్తమైన, నిర్వికారమైన, స్థిరమైన, నిత్యమైన, అంతటా వ్యాపించిన. నాశరహితమైన (నిర్గుణ) పరబ్రహ్మాన్ని ఎవరు ధ్యానిస్తారో వారు నన్నే (పరబ్రహ్మాన్నే) పొందుతారు.

5. **క్లేశోధికతరస్తేషామవ్యక్తాసక్తచేతసామ్ ।**
**అవ్యక్తా హి గతిర్దుఃఖం దేహవద్భిరవాప్యతే ॥**

భావం : అవ్యక్త పరబ్రహ్మం మీద మనసు కలవారికి (సగుణోపాసకుల కంటే) కష్టం అధికంగా ఉంటుంది. ఎందుకంటే, నిర్గుణోపాసన మార్గం, దేహాభిమానం గల వారికి కష్టం మీదే సాధ్యమవుతుంది.

**6. యే తు సర్వాణి కర్మాణి మయి సన్న్యస్య మత్పరాః ।**
**అనన్యేనైవ యోగేన మాం ధ్యాయంత ఉపాసతే ॥**

**7. తేషామహం సముద్ధర్తా మృత్యుసంసారసాగరాత్ ।**
**భవామి న చిరాత్పార్థ మయ్యావేశితచేతసామ్ ॥**

భావం : ఓ అర్జునా! ఎవరు సమస్త కర్మలని నాకు సమర్పించి, నా మీదే మనసు ఉంచి, ప్రాపంచిక భోగాలని విస్మరించి యోగంతో నన్నే ధ్యానించి, ఉపాసించి, నా మీద మనసుని ఏకాగ్రం చేస్తారో వారిని నేను మృత్యురూపమైన సంసార సాగరం నించి త్వరగా ఉద్ధరిస్తాను.

**8. మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశయ ।**
**నివసిష్యసి మయ్యేవ అత ఊర్ధ్వం న సంశయః ॥**

భావం : నా మీదే మనసుని స్థిరంగా నిలుపు. నా మీదే బుద్ధిని లగ్నం చెయ్యి. ఆ తర్వాత నిస్సందేహంగా నాలోనే నివశించగలవు.

9 **అథ చిత్తం సమాధాతుం న శక్నోషి మయి స్థిరమ్ ।**
**అభ్యాసయోగేన తతో మామిచ్ఛాప్తుం ధనంజయ ॥**

*భావం : ఓ ధనంజయా! ఒకవేళ అలా మనసుని నా మీద స్థిరంగా నిలిపే శక్తి లేక పోతే అభ్యాసయోగంతో నన్ను పొందే ప్రయత్నం చెయ్.*

10. **అభ్యాసేప్యసమర్థోసి మత్కర్మపరమో భవ ।**
**మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి ॥**

*భావం : అభ్యాసం చెయ్యడానికి అసమర్థుడివైతే, నా సంబంధమైన (నిష్కామ) కర్మలు చెయ్యి. అలా నా కోసం కర్మలని చేసినా మోక్షసిద్ధిని పొందగలవు.*

11. **అథైతదప్యశక్తోసి కర్తుం మద్యోగమాశ్రితః ।**
**సర్వకర్మఫలత్యాగం తతః కురు యతాత్మవాన్ ॥**

*భావం : నా ప్రీత్యర్థం (నిష్కామ) కర్మలు చేయడానికి కూడా శక్తి లేకపోతే, మనసుని స్వాధీనపరచుకుని సమస్త కర్మల ఫలాలని విడిచిపెట్టు.*

12. **శ్రేయో హి జ్ఞానమభ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే ।**
**ధ్యానాత్ కర్మఫలత్యాగః త్యాగాచ్ఛాంతిరనంతరమ్ ॥**

*భావం : (వివేకం లేకుండా చేసే) అభ్యాసం కంటే, శాస్త్ర జ్ఞానం శ్రేష్ఠమైనది. శాస్త్ర జ్ఞానం కంటే ధ్యానం శ్రేష్టమైనది. ధ్యానం కంటే కర్మఫలాలని విడిచిపెట్టడం శ్రేష్టమైనది. అలా విడవగానే శాంతి కలుగుతుంది.*

13. **అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ ।**
**నిర్మమో నిరహంకారః సమదుఃఖసుఖః క్షమీ ॥**

14. **సంతుష్టస్సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః ।**
**మయ్యర్పితమనోబుద్ధిర్యో మద్భక్తస్స మే ప్రియః ॥**

భావం : సమస్త ప్రాణుల మీద ద్వేషం లేనివాడు, మిత్రభావం, దయ కలవాడు, అహంకార మమకారాలు లేనివాడు, సుఖదుఃఖాల్లో సమభావం కలవాడు, ఓర్పు కలవాడు, సదా సంతృప్తితో ఉండేవాడు, యోగి, మనసుని స్వాధీనం చేసుకున్న వాడు, దృఢనిశ్చయం కలవాడు, మనసుని, బుద్ధిని నాకే సమర్పించిన వాడు అయిన నా భక్తుడు నాకు ఇష్టుడు.

**15. యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః ।**
**హర్షామర్షభయోద్వేగైర్ముక్తో యస్స చ మే ప్రియః ॥**

భావం : ఎవరి వల్ల ప్రజలు భయం పొందరో, ప్రజల వల్ల ఎవరు భయం పొందరో, ఎవరు సంతోషం, ఉద్వేగాలు మొదలైనవి లేకుండా ఉంటాడో వాడు నాకు ఇష్టుడు.

**16. అనపేక్ష శ్శుచిర్దక్ష ఉదాసీనో గతవ్యథః ।**
**సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః ॥**

భావం : కోరిక లేనివాడు, శరీరం, మనసు శుచిగా ఉన్నవాడు, కార్యసమర్థుడు, తటస్థుడు, దిగులు లేనివాడు, సమస్త కర్మల కర్తృత్వాన్ని వదిలేసినవాడు, నా మీదే భక్తి గలవాడు నాకు ఇష్టుడు.

**17. యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।**
**శుభాశుభ పరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః ॥**

భావం : ఎవడు సంతోషించడో, ద్వేషించడో, దుఃఖించడో, ఏదీ కోరడో, శుభాశుభాలని వదిలేసాడో, వాడు నాకు ప్రియుడు.

**18. సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః ।**
**శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగవివర్జితః ॥**

**19. తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।**
**అనికేతః స్థిరమతిర్భక్తిమాన్మే ప్రియో నరః ॥**

భావం : *శత్రు మిత్రులు, మానావమానాలు, శీతోష్ణ సుఖదుఃఖాల పట్ల సమభావం కలవాడు, దేని మీదా ఆసక్తి లేని వాడు, పొగడ్తలని నిందలని సమానంగా చూసేవాడు, మౌనంగా ఉండి దొరికిన దాంతో తృప్తి పొందేవాడు, స్వంత నివాసస్థానం లేనివాడు, స్థిరమైన బుద్ధి కలవాడు, భక్తుడు అయిన మనిషి నాకు ఇష్టుడు.*

**20. యే తు ధర్మ్యామృతమిదం యథోక్తం పర్యుపాసతే ।**
**శ్రద్ధధానా మత్పరమా భక్తాస్తే తీవ మే ప్రియాః ॥**

భావం : *శ్రద్ధతో ఎవరైతే నా మీదే ఆసక్తి కలిగి అమృతరూపమైన ధర్మాన్ని (ఇప్పుడు) చెప్పిన ప్రకారం అనుష్టిస్తారో అలాంటి భక్తులు నాకు అత్యంత ఇష్టులు.*

**మహాపాపాదిపాపాని గీతాధ్యానం కరోతి చేత్।**
**క్వచిత్స్పర్శం న కుర్వంతి నళినీదళ మంభసా।**
భావం : తామరాకుని నీరు అంటనట్లుగా, గీతా ధ్యానం చేసేవాడిని మహా పాపాలు కొంచెమైనా అంటవు.

# పదమూడవ అధ్యాయం

# క్షేత్రక్షేత్రజ్ఞ విభాగయోగం

అర్జున ఉవాచ

1. ప్రకృతిం పురుషం చైవ క్షేత్రం క్షేత్రజ్ఞ మేవ చ
ఏతద్వేదితుమిచ్ఛామి జ్ఞానం జ్ఞేయం చ కేశవ

*భావం : అర్జునుడు చెప్పాడు : ఓ కృష్ణా! ప్రకృతి, పురుషుడు, క్షేత్రం, క్షేత్రజ్ఞుడు, జ్ఞానం, పరమాత్మలని గురించి తెలుసుకోవాలని కోరుతున్నాను.*

శ్రీ భగవాన్ ఉవాచ

2. ఇదం శరీరం కౌంతేయ క్షేత్రమిత్యభిధీయతే ।
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః ॥

*భావం : భగవానుడు చెప్పాడు : ఓ అర్జునా! ఈ శరీరాన్ని క్షేత్రం అని, దీన్ని తెలుసుకున్న వాడిని క్షేత్రజ్ఞుడు అని తెలిసిన వారు చెప్తారు.*

3. క్షేత్రజ్ఞం చాపి మాం విద్ధి సర్వక్షేత్రేషు భారత ।
క్షేత్రక్షేత్రజ్ఞయోః జ్ఞానం యత్తద్ జ్ఞానం మతం మమ ॥

*భావం : ఓ అర్జునా! అన్ని క్షేత్రాల(శరీరాలు) లోని క్షేత్రజ్ఞుడు (జీవాత్మ) నేనే. క్షేత్ర, క్షేత్రజ్ఞులని గురించిన జ్ఞానమే నిజమైన జ్ఞానమని నా అభిప్రాయం.*

4. **తత్క్షేత్రం యచ్చ యాదృక్చ యద్వికారి యతశ్చ యత్ ।**
**స చ యో యత్ప్రభావశ్చ తత్సమాసేన మే శృణు ॥**

*భావం : క్షేత్రం అంటే ఏమిటి? ఎలా ఉంటుంది? దాని వికారాలు ఏమిటి? క్షేత్రజ్ఞుడు ఎవరు? ఎలాంటి ప్రభావం కలవాడు? అవి సంక్షిప్తంగా చెప్తాను. విను.*

5. **ఋషిభిర్బహుధా గీతం ఛందోభిర్వివిధైః పృథక్ ।**
**బ్రహ్మసూత్రపదైశ్చైవ హేతుమద్భిర్వినిశ్చితైః ॥**

*భావం : ఋషుల చేత, వేదాల చేత, పలువిధాల (క్షేత్రక్షేత్రజ్ఞ జ్ఞానం) వేరువేరుగా ప్రతిపాదించబడింది. హేతువాదంతో కూడి, బాగా నిశ్చయించబడ్డ బ్రహ్మసూత్ర వాక్యాలతో కూడా అది చెప్పబడింది.*

6. **మహాభూతాన్యహంకారో బుద్ధిరవ్యక్తమేవ చ ।**
**ఇంద్రియాణి దశైకం చ పంచ చేంద్రియగోచరాః ॥**

7. **ఇచ్ఛా ద్వేషస్సుఖం దుఃఖం సంఘాతశ్చేతనా ధృతిః ।**
**ఏతత్ క్షేత్రం సమాసేన సవికార ముదాహృతమ్ ॥**

*భావం : పంచ మహాభూతాలు, అహంకారం, బుద్ధి, మూలప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలు (దృష్టి, వాసన, స్మర్శ, వినికిడి, రుచి) పంచ కర్మేంద్రియాలు (కళ్ళు, ముక్కు, చర్మం, చెవులు, నోరు) మనసు (మొత్తం పదకొండు ఇంద్రియాలు) కోరిక, ద్వేషం, సుఖం, దుఃఖం, దేహేంద్రియాల సముదాయం, తెలివి, ధైర్యం అనే వికారాలతో కూడిన క్షేత్రం (దేహం) సంక్షిప్తంగా చెప్పబడింది.*

8. **అమానిత్వమదంభిత్వమహింసా క్షాంతిరార్జవమ్ ।**
**ఆచార్యోపాసనం శౌచం స్థైర్యమాత్మవినిగ్రహః ॥**

9. **ఇంద్రియార్థేషు వైరాగ్యమనహంకార ఏవ చ ।**
**జన్మ మృత్యుజరావ్యాధిదుఃఖదోషానుదర్శనమ్ ॥**

**10. అసక్తి రనభిష్వంగః పుత్రదారగృహాదిషు ।**
**నిత్యం చ సమచిత్తత్వమిష్టానిష్టోపపత్తిషు ॥**

**11. మయి చానన్య యోగేన భక్తిరవ్యభిచారిణీ ।**
**వివిక్తదేశ సేవిత్వమరతిర్జనసంసది ॥**

**12. ఆధ్యాత్మజ్ఞాననిత్యత్వం తత్త్వజ్ఞానార్థదర్శనమ్ ।**
**ఏతద్‌జ్ఞానమితి ప్రోక్తమజ్ఞానం యదతోన్యథా॥**

*భావం : నమ్రత, నిగర్వం, అహింస, ఓర్పు, నిజాయితీ, గురుసేవ, శారీరక, మానసిక శుభ్రత, (మోక్షమార్గంలో) పట్టుదల, మానసిక నిగ్రహం, ఇంద్రియ విషయాల్లో (భోగాల్లో) విరక్తి కలిగి ఉండడం, అహంభావం లేకపోవడం, 'పుట్టుక, మరణం, ముసలితనం, వ్యాధి' వల్ల కలిగే దోషాలని చూడటం, 'సంతానం, భార్య, ఇల్లు' మీద ఆసక్తి కాని, బంధం కాని లేకపోవడం, ఇష్టాయిష్టాల్లో ఒకే భావంతో ఉండడం, నా మీద (పరమాత్మ) ఏకాగ్రబుద్ధితో, చలించనట్టి భక్తి కలిగి ఉండడం, ఏకాంతంలో నివశిస్తూ జన సమూహంలో ఉండడానికి ఇష్టపడకపోవడం, సదా ఆత్మనిష్టలో ఉండడం, తత్త్వజ్ఞానాన్ని దర్శించడం అనే ఇవన్నీ జ్ఞానం అని తెలుసుకో. దీనికి వ్యతిరేకమైనదంతా అజ్ఞానం. (పైవన్నీ జ్ఞానప్రాప్తికి సాధనాలు)*

**13. జ్ఞేయం యత్తత్ప్రవక్ష్యామి యద్ జ్ఞాత్వామృతమశ్నుతే ।**
**అనాదిమత్పరం బ్రహ్మ న సత్తన్నాసదుచ్యతే ॥**

*భావం : ఏది తెలియదగ్గదో, దేనిని తెలుసుకుంటే మనిషి మోక్షాన్ని పొందుతాడో అది విశదంగా చెప్తాను. పరబ్రహ్మం ఉందని కానీ, లేదని కానీ చెప్పను.*

**14. సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్ ।**
**సర్వతః శ్రుతిమల్లోకే సర్వమావృత్య తిష్ఠతి ॥**

*భావం : అది అంతటా చేతులు, కాళ్ళు, కళ్ళు, తలలు, ముఖాలు, చెవులు కలది. ఈ ప్రపంచంలోని సమస్తాన్ని ఆవరించుకుని ఉన్నది.*

**15. సర్వేంద్రియగుణాభాసం సర్వేంద్రియవివర్జితమ్ ।**
**అసక్తం సర్వభృచ్చైవ నిర్గుణం గుణభోక్తృ చ**

**16. బహిరంతశ్చ భూతానామచరం చరమేవ చ ।**
**సూక్ష్మత్వాత్తదవిజ్ఞేయం దూరస్థం చాంతికే చ తత్ ॥**

**17. అవిభక్తం చ భూతేషు విభక్తమివ చ స్థితమ్ ।**
**భూతభర్తృ చ తద్ జ్ఞేయం గ్రసిష్ణు ప్రభవిష్ణు చ ॥**

**18. జ్యోతిషామపి తజ్జ్యోతిః తమసః పరముచ్యతే ।**
**జ్ఞానం జ్ఞేయం జ్ఞానగమ్యం హృది సర్వస్య విష్ఠితమ్ ॥**

*భావం : ఆ బ్రహ్మం ఇంద్రియాలని పని చేయిస్తుంది. కానీ ఇంద్రియాలు లేనిది. దేనినీ అంటనిది, సమస్తాన్ని పోషించేది, త్రిగుణాలు లేనిది, ప్రాణుల లోపల బయట ఉండేది, కదలనిది, కదిలేది, సూక్ష్మమైనది, తెలియబడనిది, దూరంగా ఉండేది, దగ్గరగా కూడా ఉండేది, విభజించబడకపోయినా ప్రాణుల్లో వివిధ రూపాల్లో వేరువేరుగా కనపడేది, ప్రాణులని సృష్టించి, పోషించి లయింపచేసేది, తెలుసుకోదగినది. ప్రకాశించే వస్తువులకి ప్రకాశాన్ని ఇచ్చేది, మాయాతీతమైనది, జ్ఞాన స్వరూపమైనది, తెలుసుకోతగినది, జ్ఞానానికి గమ్యమైనది, సమస్త ప్రాణుల హృదయాల్లో నివశించేది.*

**19. ఇతి క్షేత్రం తథా జ్ఞానం జ్ఞేయం చోక్తం సమాసతః ।**
**మద్భక్త ఏతద్విజ్ఞాయ మద్భావాయోపపద్యతే ॥**

*భావం : ఈ ప్రకారం క్షేత్రం, జ్ఞానం, జ్ఞేయం గురించి సంక్షిప్తంగా చెప్పాను. నా భక్తుడు ఈ తత్త్వాన్ని తెలుసుకుంటే నా స్వరూపాన్ని (మోక్షాన్ని) పొందడానికి అర్హుడవుతాడు.*

**20. ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి ।**
**వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతి సంభవాన్ ॥**

*భావం : ప్రకృతి, పురుషుడు ఆది లేనివని తెలుసుకో. ఇంద్రియ వికారాలు, త్రిగుణాలు ప్రకృతి నించే సంభవించాయని తెలుసుకో.*

**21. కార్యకారణకర్తృతే హేతుః ప్రకృతిరుచ్యతే ।**
**పురుషః సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే ॥**

*భావం : కార్యం, కారణం పుట్టడానికి హేతువు ప్రకృతే. సుఖదుఃఖాలని అనుభవించడానికి పురుషుడే కారణం అని తెలుసుకో.*

**22. పురుషః ప్రకృతిస్థో హి భుంక్తే ప్రకృతిజాన్ గుణాన్ ।**
**కారణం గుణసంగోస్య సదసద్యోనిజన్మసు ॥**

*భావం : పురుషుడు (జీవుడు) ప్రకృతి నించే పుట్టి, సుఖదుఃఖాలని అనుభవిస్తున్నాడు. జీవుడు మంచి, చెడ్డ జన్మలు ఎత్తడానికి కారణం త్రిగుణాలతో జీవుడికి గల సంబంధమే.*

**23. ఉపద్రష్టానుమంతా చ భర్తా భోక్తా మహేశ్వరః ।**
**పరమాత్మేతి చాప్యుక్తో దేహేస్మిన్ పురుషః పరః ॥**

*భావం : ఆత్మ శరీరంలో ఉన్నప్పటికీ దానికి వేరుగా, సాక్షిగా ఉంటాడు. అనుమతించే వాడు, భరించేవాడు, అనుభవించే వాడు ఐన ఆ పరమేశ్వరుడే పరమాత్మ.*

**24. య ఏవం వేత్తి పురుషం ప్రకృతిం చ గుణైస్సహ ।**
**సర్వథా వర్తమానోపి న స భూయోభిజాయతే ॥**

*భావం : ఎవరైతే ఇలా ఆత్మ తత్త్వాన్ని, త్రిగుణాలతో కూడిన ప్రకృతి తత్త్వాన్ని తెలుసుకున్నాడో అతను ఎలా ప్రవర్తించినప్పటికీ తిరిగి జన్మించడు.*

**25. ధ్యానేనాత్మని పశ్యంతి కేచిదాత్మానమాత్మనా ।**
**అన్యే సాంఖ్యేన యోగేన కర్మయోగేన చాపరే ॥**

*భావం : కొందరు పరమాత్మని సూక్ష్మమైన బుద్ధితో ధ్యానయోగం ద్వారా తమ మనసులో చూస్తారు. ఇంకొందరు జ్ఞానయోగం ద్వారా, మరి కొందరు కర్మయోగం ద్వారా ఆ పరమాత్మని అనుభూతి చెందుతారు.*

**26. అన్యే త్వేవ మజానంతః శ్రుత్వాన్యేభ్య ఉపాసతే ।**
**తేపి చాతితరంత్యేవ మృత్యుం శ్రుతిపరాయణాః ॥**

*భావం : మరి కొందరు ఈ సాధనా మార్గాలని తెలుసుకోలేక, ఇతరులు చెప్పగా విని అనుష్టిస్తున్నారు. ఆ శ్రవణ పరాయణులు కూడా సంసారబంధం నించి తప్పక బయటపడతారు.*

**27. యావత్సంజాయతే కించిత్సత్త్వం స్థావరజంగమమ్ ।**
**క్షేత్రక్షేత్రజ్ఞసంయోగాత్తద్విద్ధి భరతర్షభ ॥**

*భావం : ఓ అర్జునా! చరచరాత్మకమైనవి అన్నీ క్షేత్ర క్షేత్రజ్ఞుల సంయోగం వల్లే ఉత్పన్నం అవుతున్నాయని తెలుసుకో.*

**28. సమం సర్వేషు భూతేషు తిష్ఠంతం పరమేశ్వరమ్ ।**
**వినశ్యత్స్వవినశ్యంతం యః పశ్యతి స పశ్యతి ॥**

*భావం : దేహాలు నశించినా సమస్త ప్రాణుల్లో సమానంగా ఉన్న పరమాత్మ నశించదని ఎవడు తెలుసుకుంటాడో, వాడు యదార్థాన్ని చూస్తున్నాడు.*

**29. సమం పశ్యన్హి సర్వత్ర సమవస్థిత మీశ్వరమ్ ।**
**న హినస్త్యాత్మనాత్మానం తతో యాతి పరాం గతిమ్ ॥**

*భావం : సమస్త ప్రాణులని, వారిలోని పరమేశ్వరుడ్ని సమభావంతో చూసేవాడు తన ఆత్మని హింసించుకోడు. కాబట్టి మోక్షాన్ని పొందుతాడు.*

**30. ప్రకృత్యైవ చ కర్మాణి క్రియమాణాని సర్వశః ।**
**యః పశ్యతి తథాత్మానమకర్తారం స పశ్యతి ॥**

*భావం : సమస్త కర్మలు ప్రకృతి ద్వారానే జరుగుతున్నాయని, ఆత్మ కర్త కాదని తెలుసుకున్నవాడు నిజాన్ని చూసేవాడు.*

**31. యదా భూతపృథగ్భావమేకస్థమనుపశ్యతి ।**
**తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా ॥**

*భావం : సమస్త ప్రాణులు వేరువేరుగా కనిపించినా, అవన్నీ ఆత్మలోనే ఉన్నాయని, అలాగే అవన్నీ ఆత్మ నించే విస్తరించాయని ఎవడు తెలుసుకుంటాడో వాడు మోక్షాన్ని పొందుతాడు.*

**32. అనాదిత్వాన్నిర్గుణత్వాత్పరమాత్మాయ మవ్యయః ।**
**శరీరస్థోపి కౌంతేయ న కరోతి న లిప్యతే ॥**

*భావం : ఓ అర్జునా! శాశ్వతమైన పరమాత్మ ఆది లేని వాడు, త్రిగుణాలు లేని వాడు అవడం చేత శరీరంలో ఉన్నా ఏ కర్మలకీ కర్త కాదు. కర్మలు అతన్ని అంటవు.*

**33. యథా సర్వగతం సౌక్ష్మ్యాదాకాశం నోపలిప్యతే ।**
**సర్వత్రావస్థితో దేహే తథాత్మా నోపలిప్యతే ॥**

*భావం : అన్ని చోట్లా వ్యాపించి ఉన్న ఆకాశం సూక్ష్మం అవడం వల్ల, ఏదీ (ధూళి మొదలైనవి) దానికి ఎలా అంటదో, అలా సకల శరీరాల్లో ఉన్న (నిర్గుణ) పరమాత్మకి గుణదోషాలు అంటవు.*

**34. యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః ।**
**క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత ॥**

*భావం : అర్జునా! సూర్యుడు ఒక్కడే ఈ సమస్త లోకాన్ని ఎలా ప్రకాశింప చేస్తున్నాడో, అలా క్షేత్రజ్ఞుడైన పరమాత్మ సమస్తమైన క్షేత్రాలని (సర్వ ప్రాణులని) ప్రకాశింప చేస్తున్నాడు.*

**35. క్షేత్రక్షేత్రజ్ఞయోరేవమంతరం జ్ఞానచక్షుషా ।**
**భూతప్రకృతిమోక్షం చ యే విదుర్యాంతి తే పరమ్ ॥**

*భావం : ఎవరు జ్ఞానదృష్టితో ఇలా క్షేత్ర, క్షేత్రజ్ఞుల మధ్య భేదాన్ని, భూతాల నించి, ప్రకృతి నించి విముక్తిని కలగచేసే ఉపాయాన్ని తెలుసుకుంటారో వారు మోక్షాన్ని పొందుతారు.*

**పాదంవావ్యర్ధపాదంవా శ్లోకం శోకార్ధమేవవ ।**
**నిత్యం ధారయతే యస్తు సమోక్ష మదిగచ్ఛతి ।**
భావం : గీతలోని ఒక్క శ్లోకాన్ని కాని, సగం శ్లోకాన్ని కాని, ఒక్క పాదాన్ని కాని, లేదా పాదార్ధాన్ని కాని సదా ఎవడు మనసులో స్మరిస్తూంటాడో అతను మోక్షాన్ని పొందుతాడు.

# పధ్నాలుగో అధ్యాయం

# గుణత్రయవిభాగ యోగం

శ్రీ భగవాన్ ఉవాచ

1. **పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।**
**యద్ జ్ఞాత్వా మునయస్సర్వే పరాం సిద్ధిమితో గతాః ॥**

*భావం : భగవానుడు చెప్పాడు : దేన్ని తెలుసుకుని మునులంతా సంసార బంధం నించి విడివడి, సర్వోత్తమమైన మోక్షసిద్ధిని పొందారో అలాంటి జ్ఞానాల్లో కెల్లా ఉత్తమమైన (ఆత్మ) జ్ఞానాన్ని మళ్ళీ చెప్తున్నాను.*

2. **ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః ।**
**సర్గేపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ ॥**

*భావం : ఈ జ్ఞానాన్ని ఆశ్రయించిన వారు నాలో ఐక్యం చెంది మళ్ళీ సృష్టి కాలంలో పుట్టరు. ప్రళయకాలంలో నశించరు.*

3. **మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్గర్భం దధామ్యహమ్ ।**
**సంభవస్సర్వభూతానాం తతో భవతి భారతః ॥**

*భావం : ఓ అర్జునా! గొప్పదైన మూల ప్రకృతి (మాయ) నా సర్వప్రాణుల జన్మస్థానం. దాన్లో నేను చైతన్యమైన బీజాన్ని ఉంచుతాను. దాంతో సమస్తప్రాణులు ఉత్పత్తి అవుతున్నాయి.*

**4. సర్వయోనిషు కౌంతేయ మూర్తయస్సంభవంతియాః ।**
**తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా ॥**

*భావం : ఓ అర్జునా! అనేక యోనుల్లో జన్మించే ప్రాణులని తన గర్భంలో ధరించే మూల ప్రకృతే తల్లి. నేను బీజాన్ని ఉంచే తండ్రిని.*

**5. సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।**
**నిబధ్నంతి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ ॥**

*భావం : ఓ అర్జునా! ప్రకృతి నించి పుట్టే సత్త్వ రజ తమో గుణాలు మూడూ నాశనం లేని జీవాత్మని శరీరంలో బంధిస్తున్నాయి.*

**6. తత్ర సత్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్ ।**
**సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ ॥**

*భావం : ఓ అర్జునా! ఆ మూడింటిలో సత్త్వగుణం స్వచ్ఛమైనది, ప్రకాశవంతమైనది, వికారం లేనిది. అది ఇంద్రియ సుఖం మీద ఆసక్తి చేత, జ్ఞానం మీద ఆసక్తి చేత జీవుడ్ని బంధిస్తోంది.*

**7. రజో రాగాత్మకం విద్ధి తృష్ణా సంగసముద్భవమ్ ।**
**తన్నిబధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్ ॥**

*భావం : ఓ అర్జునా! రజోగుణం ప్రపంచ భోగాల మీద ప్రీతిని కలగచేస్తోంది. అది కోరికని, ఆసక్తిని కలుగచేసి కర్మఫలాలతో జీవుడ్ని చక్కగా బంధిస్తోంది.*

**8. తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।**
**ప్రమాదాలస్యనిద్రాభి స్తన్నిబధ్నాతి భారత॥**

*భావం : ఓ అర్జునా! అజ్ఞానం లోంచి పుట్టే తమో గుణం సమస్త ప్రాణులని అవివేకులుగా చేస్తోందని తెలుసుకో. అది పరాకు, సోమరితనం, నిద్ర మొదలైన వాటితో బంధిస్తోంది.*

9. **సత్త్వం సుఖే సంజయతి రజౌ కర్మణి భారత ।**
**జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత ॥**

*భావం : ఓ అర్జునా! సత్త్వగుణం సుఖం మీద, రజో గుణం కర్మ మీద, తమోగుణం జ్ఞానాన్ని కప్పివేసి జీవుడ్ని ప్రమాదంలో ముంచేస్తున్నాయి. ఎంత ఆశ్చర్యం!*

10. **రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।**
**రజఃసత్త్వం తమశ్చైవ తమః సత్త్వం రజస్తథా ॥**

*భావం : ఓ అర్జునా! రజో, తమో గుణాలని అణగదొక్కి బలం కలిగిన సత్త్వగుణం పైకి వస్తుంది. ఇలాగే బలం కలిగిన రజోగుణం సత్త్వ తమో గుణాలని, బలం కలిగిన తమోగుణం సత్త్వ రజోగుణాలని అణచి వేసి వృద్ధి చెందుతాయి.*

11. **సర్వద్వారేషు దేహేస్మిన్ ప్రకాశ ఉపజాయతే ।**
**జ్ఞానం యదా తదా విద్యాద్వివృద్ధం సత్త్వమిత్యుత ॥**

*భావం : ఎప్పుడు శరీరంలోని అన్ని ఇంద్రియాల్లో ప్రకాశరూపమైన వివేకశక్తి కలుగుతుందో, అప్పుడు సత్త్వగుణం వృద్ధి చెందిందని తెలుసుకోవాలి.*

12. **లోభః ప్రవృత్తిరారంభః కర్మణామశమః స్పృహా ।**
**రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ ॥**

*భావం : ఓ అర్జునా! రజోగుణం వృద్ధి చెందినప్పుడు, లోభం, ప్రాపంచిక విషయాల మీద ఆసక్తి, అశాంతి, కోరికలు తీర్చుకునే కర్మలు చేయడం, ఆశ అనే లక్షణాలు ఉంటాయి.*

13. **అప్రకాశో ప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।**
**తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన ॥**

*భావం : ఓ అర్జునా! తమోగుణం అధికమైనప్పుడు బుద్ధిమాంద్యం, సోమరితనం, కర్మల మీద విముఖత, అజాగ్రత్త, అజ్ఞానం లేదా మూఢత్వం కలుగుతాయి.*

**14. యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రళయం యాతి దేహభృత్ ।**
**తదోత్తమవిదాం లోకానమలాన్ ప్రతిపద్యతే ॥**

*భావం : ఎప్పుడైతే సత్త్వగుణం అభివృద్ధి చెందుతూండగా మనిషి మరణిస్తాడో, అప్పుడు ఉత్తములు ఉండే పరిశుద్ధమైన లోకాన్ని చేరతాడు.*

**15. రజసి ప్రళయం గత్వా కర్మసంగిషు జాయతే ।**
**తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే ॥**

*భావం : రజోగుణం అధికమైనప్పుడు మరణిస్తే, కర్మాసక్తులైన వారికి పుడతాడు. అలాగే తమోగుణం వృద్ధి చెందినప్పుడు మరణిస్తే, పామర (పశుపక్షి కీటకాది) అవివేక జన్మలు ఎత్తుతాడు.*

**16. కర్మణః సుకృతస్యాహు స్సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।**
**రజసస్తు ఫలం దుఃఖమజ్ఞానం తమసః ఫలమ్ ॥**

*భావం : సాత్త్విక (పుణ్య) కర్మలు చేయడం ద్వారా ఫలంగా నిర్మలసుఖం లభిస్తుంది. రజోగుణ కర్మలకి ఫలం దుఃఖం. తామస కర్మల ఫలం అవివేకం అని పెద్దలు చెప్తున్నారు.*

**17. సత్త్వాత్స0ంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।**
**ప్రమాదమోహౌ తమసో భవతోజ్ఞానమేవ చ ॥**

*భావం : సత్త్వగుణం వల్ల జ్ఞానం, రజోగుణం వల్ల మోహం, తమోగుణం వల్ల అజాగ్రత్త, అవివేకం, మరపు, పరాకు మొదలైనవి కలుగుతాయి.*

**18. ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః మధ్యే తిష్ఠంతి రాజసాః ।**
**జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛంతి తామసాః ॥**

*భావం : సత్త్వగుణం వారు పై లోకాలకి వెళ్తున్నారు. రజోగుణం వారు మధ్యమ (మానవ) లోకంలో జన్మిస్తున్నారు. తమోగుణ ప్రవృత్తి గల వారు అధోలోకాలకి (పశు జన్మలకి) వెళ్తున్నారు.*

**19. నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి ।**
**గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోధిగచ్ఛతి ॥**

భావం : *గుణాల కంటే వేరే కర్త లేదని, తను ఆ గుణాలకి భిన్నమైన వాడని వివేకవంతుడు ఎప్పుడు తెలుసుకుంటాడో అప్పుడు అతను మోక్షాన్ని పొందుతాడు.*

**20. గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।**
**జన్మమృత్యుజరాదుఃఖైః విముక్తోమృతమశ్నుతే ॥**

భావం : *దేహోత్పత్తికి కారణమైన ఈ మూడు గుణాలని అధిగమించిన వాడు పుట్టుక, చావు, ముసలితనం, దుఃఖం అనే వాటి నించి పూర్తిగా విడవబడి మోక్షాన్ని పొందుతాడు.*

**అర్జున ఉవాచ**

**21. కైర్లింగైస్త్రీన్గుణానేతా నతీతో భవతి ప్రభో ।**
**కిమాచారః కథం చైతాం స్త్రీన్గుణానతివర్తతే ॥**

భావం : *అర్జునుడు అడిగాడు : ఓ కృష్ణా! ఈ మూడు గుణాలని దాటిన వాడి లక్షణాలు ఏమిటి? అతను ఎలా ప్రవర్తిస్తాడు? ఈ మూడు గుణాలని ఎలా దాటుతున్నాడు?*

**శ్రీ భగవాన్ ఉవాచ**

**22. ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।**
**న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥**

**23. ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే ।**
**గుణా వర్తంత ఇత్యేవ యోవతిష్ఠతి నేంగతే ॥**

**24. సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః ।**
**తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః ॥**

**25. మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారిపక్షయోః ।**
**సర్వారంభపరిత్యాగీ గుణాతీతస్స ఉచ్యతే ॥**

*భావం : భగవానుడు చెప్పాడు : ఓ పాండవా! సత్త్వగుణ సంబంధమైన సుఖం కానీ, రజోగుణ సంబంధమైన కార్యప్రవృత్తి కాని, తమోగుణ సంబంధమైన నిద్ర, పరాకు మొదలైనవి కానీ తనకి సంప్రాప్తించినప్పుడు, వాటిని ద్వేషించని వాడు, అవి తొలగిపోతే వాటిని కోరని వాడు, ఆ త్రిగుణాల చేత ప్రభావితుడు కాక తటస్థంగా ఉండేవాడు, గుణాలు తనలో ప్రవర్తిస్తున్నాయని తెలుసుకున్న వాడు, దేనికీ చలించని వాడు, సుఖదుఃఖాలని సమానంగా చూసేవాడు, ఆత్మలోనే స్థిరంగా ఉండేవాడు, మట్టి, రాయి, బంగారాలని ఒకటిగా చూసేవాడు, ఇష్టాయిష్టాల్లో సమభావం కలిగి ఉండేవాడు, ఆత్మ, అనాత్మ వివేకం కలవాడు, తనని ఇతరులు దూషించినా, మెచ్చుకున్నా స్పందన (మనోవికారం) లేని వాడు, సన్మాన, అవమానాలని, శత్రుమిత్రులని సమభావంతో చూసేవాడు, తను చేసే అన్ని కర్మల్లో కర్తృత్వబుద్ధి లేనివాడు గుణాతీతుడు అవుతాడు.*

**26. మాం చ యోవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।**
**స గుణాన్సమతీతత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥**

*భావం : ఎవరు నన్నే ఏకాగ్ర భక్తియోగంతో సేవిస్తాడో అతడు ఈ త్రిగుణాలని చక్కగా దాటి మోక్షానికి అర్హుడు అవుతున్నాడు.*

**27. బ్రహ్మణో హి ప్రతిష్ఠాహ మమృతస్యావ్యయస్య చ ।**
**శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాంతికస్య చ ॥**

*భావం : ఎందుకంటే నాశరహితము, నిర్వికారము, శాశ్వత ధర్మం, అఖండ ఆనంద స్వరూపమైన బ్రహ్మకి నేనే ఆధారం.*

**ఇదం శాస్త్రం మయా ప్రోక్తం గుహ్యవేదార్థ దర్పణం।**
**యః పఠేత్ప్రయతో భూత్వా సగచ్ఛేద్విష్ణు శాశ్వతం।**
భావం : నేను చెప్పిన ఈ గీతాశాస్త్రం రహస్యాలైన వేదార్థాలని, అద్దంలోలా ప్రతిబింబిస్తోంది. ఎవడు దీన్ని ఇష్టంతో పఠిస్తాడో అతడు శాశ్వతమైన విష్ణుసాన్నిధ్యాన్ని (ముక్తిని) పొందుతాడు.

# పదిహేనవ అధ్యాయం

# పురుషోత్తమప్రాప్తి యోగం

శ్రీ భగవాన్ ఉవాచ

1. **ఊర్ధ్వమూలమధశ్శాఖ మశ్వత్థం ప్రాహురవ్యయమ్ ।**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥**

*భావం : భగవానుడు చెప్పాడు : సంసారమనే రావి చెట్టుకి వేదాలు ఆకులు. అది వేళ్ళు పైన, కొమ్మలు కింద ఉండి నాశనం లేనిదిగా పెద్దలు చెప్తారు. దానిని ఎవడు తెలుసుకుంటే అతడే వేదార్థాలు తెలిసినవాడు అవుతాడు.*

2. **అధశ్చోర్ధ్వం ప్రసృతాస్తస్యశాఖా**
**గుణప్రవృద్ధా విషయప్రవాలాః ।**
**అధశ్చ మూలాన్యనుసంతతాని**
**కర్మానుబంధీని మనుష్యలోకే ॥**

*భావం : ఈ సంసార వృక్షపు కొమ్మలు త్రిగుణాలతో వృద్ధి చెందాయి. ఇంద్రియ భోగాలు చిగుళ్ళు. ఇవి కిందికీ, పైకీ వ్యాపించి ఉన్నాయి. మనుష్యలోకంలో కర్మబంధాలైన దాని వేళ్ళు కిందికి బాగా విస్తరించాయి.*

3. **న రూపమస్యేహ తథోపలభ్యతే**
**నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా ।**

**అశ్వత్థమేనం సువిరూఢమూల**
**మసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా ॥**

**4. తతః పదం తత్పరిమార్గితవ్యం**
**యస్మిన్ గతా న నివర్తంతి భూయః ।**
**తమేవ చాద్యం పురుషం ప్రపద్యే**
**యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ ॥**

*భావం : ఈ సంసార వృక్ష స్వరూపం ఈ లోకంలో తెలియకుండా ఉంది. దాని మొదలు కానీ, మధ్య కానీ, చివర కానీ కనపడడం లేదు. వేళ్ళు బలంగా నాటుకున్న ఈ సంసారమనే రావి చెట్టుని వైరాగ్యం అనే బలమైన ఆయుధంతో నరికి మోక్షాన్ని పొందితే ఇక తిరిగి వెనక్కి రారు. (పుట్టరు) 'ఎవరి నించి సనాతనమైన ఈ సంసారవృక్షం వ్యాపించి ఉందో, ఆ ఆది పురుషుడైన పరమాత్మనే శరణు వేడుకుంటున్నాను' అని ప్రార్థిస్తూ మోక్షాన్ని అన్వేషించాలి.*

**5. నిర్మానమోహా జితసంగదోషా**
**అధ్యాత్మనిత్యా వినివృత్తకామాః ।**
**ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞైః**
**గచ్ఛంత్యమూఢాః పదమవ్యయం తత్ ॥**

*భావం : అభిమానం, భోగాసక్తి అనే దోషాలని జయించిన వారు, సదా బ్రహ్మనిష్ఠ కలవారు, కోరికలన్నీ తొలగిన వారు, సుఖదుఃఖాలనే ద్వంద్వాలని విడిచిన వారు అయిన జ్ఞానులు అలాంటి శాశ్వతమైన మోక్షాన్ని పొందుతారు.*

**6. న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః ।**
**యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥**

*భావం : నా పరంధామాన్ని సూర్య చంద్రులు కానీ, అగ్ని కానీ ప్రకాశింప చేయలేవు. దేనిని చేరుకుంటే తిరిగి జన్మించరో అది నా శ్రేష్ఠమైన స్థానం.*

**7. మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః ।**
**మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥**

*భావం : జీవలోకం లోని సనాతనమైన జీవాత్మ నా అంశమే. ప్రకృతి లోని మనసు, పంచేంద్రియాలని అది తన వైపు ఆకర్షిస్తోంది.*

**8. శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।**
**గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ ॥**

*భావం : దేహేంద్రియాలకి ప్రభువైన జీవాత్మ శరీరాన్ని విడిచి పెట్టినప్పుడు, వాసనలని గ్రహించి గాలి ఎలా తీసుకు వెళ్తుందో అలామనసు, ఇంద్రియాలని గ్రహించి వెంట తీసుకు వెళ్తోంది.*

**9. శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ।**
**అధిష్ఠాయ మనశ్చాయం విషయా నుపసేవతే ॥**

*భావం : ఈ జీవాత్మ చెవి, కళ్ళు, చర్మం, నాలుక, ముక్కు, మనసుల ద్వారా ప్రపంచ భోగాలని అనుభవిస్తోంది.*

**10. ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।**
**విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥**

*భావం : జీవాత్మ శరీరంలో ఉన్నా, వదిలినా, ప్రపంచ భోగాలు అనుభవిస్తున్నా త్రిగుణాలతో కూడిన అజ్ఞానులు (ఆ జీవాత్మని) తెలుసుకోలేరు. జ్ఞానదృష్టి కలవారు మాత్రమే ఇది తెలుసుకోగలరు.*

**11. యతంతో యోగినశ్చైనం పశ్యంన్త్యాత్మన్యవస్థితమ్ ।**
**యతంతోప్యకృతాత్మానో నైనం పశ్యంత్యచేతసః ॥**

*భావం : చిత్తశుద్ధి గల యోగులు తమలో ఉన్న ఈ ఆత్మని తెలుసుకోగలరు. చిత్తశుద్ధి లేని అజ్ఞానులు ఎంత ప్రయత్నించినా ఈ ఆత్మని తెలుసుకోలేరు.*

**12. యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఖిలమ్ ।**
**యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥**

*భావం : సమస్త ప్రపంచాన్ని ప్రకాశింప చేసే సూర్య చంద్రులలో, అగ్నిలో ఏ తేజస్సు ఉందో అది మొత్తం నా (పరమాత్మ) తేజస్సే అని తెలుసుకో.*

**13. గామావిశ్య చ భూతాని ధారయామ్యహ మోజసా ।**
**పుష్ణామి చౌషధీః సర్వాః సోమో భూత్వా రసాత్మకః ॥**

*భావం : ఇంకా నేను భూమిలో ప్రవేశించి నా శక్తితో సర్వప్రాణులని ధరిస్తున్నాను. అమృతమయుడైన చంద్రుడిగా నేనే సమస్త ఔషధులని ఇస్తున్నాను.*

**14. అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహమాశ్రితః ।**
**ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥**

*భావం : నేను వైశ్వానరుడు అనే అగ్ని (జఠరాగ్ని) రూపంలో ప్రాణుల శరీరాలని ఆశ్రయించి ప్రాణ, అపాన వాయువులతో అన్నాన్ని నాలుగు విధాలుగా జీర్ణం చేస్తున్నాను.*

**15. సర్వస్య చాహం హృది సన్నివిష్టో**
**మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ ।**
**వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో**
**వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥**

*భావం : సమస్త ప్రాణుల హృదయాల్లో నేను అంతర్యామిగా ఉన్నాను. నా నించే జ్ఞాపకశక్తి, మరపు, తెలివి కలుగుతున్నాయి. వేదాల ద్వారా తెలుసుకోదగిన వాడిని నేనే. వేదాంతకర్తని నేనే. వేదాన్ని తెలిసినవాడిని నేనే. (నేనే = పరమాత్మ)*

**16. ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।**
**క్షరస్సర్వాణి భూతాని కూటస్థోక్షర ఉచ్యతే ॥**

*భావం : ఈ ప్రపంచంలో నశించేవాడు, నశించని వాడు అనే ఇద్దరు పురుషులు ఉన్నారు. సకల ప్రాణుల శరీరాలు నశించేవి. జీవాత్మ నశించని వాడు.*

17. **ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః ।**
**యో లోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥**

*భావం : ఎవరు ఈ మూడు లోకాల్లోకి ప్రవేశించి అందర్నీ భరించి పోషిస్తున్నాడో, అలాంటి నాశరహితుడైన ఈశ్వరుడు, భిన్నమైన వాడు, ఉత్తమ పురుషుడు పరమాత్మే.*

18. **యస్మాత్క్షర మతీతోహమక్షరాదపి చోత్తమః ।**
**అతోస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥**

*భావం : నేను నశించే దాన్ని (దేహాన్ని) మించినవాడ్ని. నాశనం లేని ఆత్మ కంటే శ్రేష్టుడ్ని (పరమాత్మని) అందువల్ల ప్రపంచంలో, వేదాల్లో కూడా పురుషోత్తముడిగా ప్రసిద్ధి చెందాను.*

19. **యో మామేవమసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।**
**స సర్వవిద్భజతి మాం సర్వభావేన భారత ॥**

*భావం : ఓ అర్జునా! ఎవడు అజ్ఞానం లేక ఈ ప్రకారం నన్ను పురుషోత్తముడిగా తెలుసుకున్నాడో, అతడు సమస్తాన్ని తెలుసుకున్న వాడే. అతడు సంపూర్ణ మనసుతో నన్ను ధ్యానిస్తాడు.*

20. **ఇతి గుహ్యతమం శాస్త్రమిదముక్తం మయానఘ ।**
**ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్ కృతకృత్యశ్చ భారత ॥**

*భావం : ఓ అర్జునా! ఈ ప్రకారం అతి రహస్యమైన ఈ శాస్త్రాన్ని నీకు చెప్పాను. దీన్ని తెలుసుకున్న మనుషుడు జ్ఞానియై కృతార్థుడు అవుతాడు.*

**మలనిర్మోచనం పుంసాం గంగాస్నానం దినేదినే।**
**సకృద్గీతాంభసి స్నానం సంసారమలమోచనం॥**
భావం : ప్రతీ దినం చేసే గంగాస్నానం మనుషుల శరీర మాలిన్యాన్ని పోగొడుతుంది. కాని గీత అనే జలంలో ఒక్కసారి స్నానం చేస్తే సంసార (జనన,మరణ) మాలిన్యం అంతా తుడిచి పెట్టుకుపోతుంది.

# పదహారవ అధ్యాయం

# దైవాసుర సంపద్విభాగ యోగం

శ్రీ భగవాన్ ఉవాచ

**1.** అభయం సత్త్వసంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః ।
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయ స్తప ఆర్జవమ్ ॥

**2.** అహింసా సత్యమక్రోధః త్యాగః శాంతిరపైశునమ్ ।
దయా భూతేష్వలోలత్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥

**3.** తేజః క్షమా ధృతిః శౌచమద్రోహో నాతిమానితా ।
భవంతి సంపదం దైవీమ్ అభిజాతస్య భారత ॥

భావం : *ఓ అర్జునా! నిర్భయత్వం, చిత్తశుద్ధి, జ్ఞానయోగంలో దృఢస్థితి, దానం, ఇంద్రియ నిగ్రహం, యజ్ఞం, అధ్యయనం, తపస్సు, కపటం లేకపోవడం, అహింస, నిజమే చెప్పడం, కోపం లేకపోవడం, త్యాగబుద్ధి, శాంతస్వభావం, ఎవరినీ నిందించక పోవడం, సర్వ ప్రాణుల మీద దయ, భోగాసక్తి లేకపోవడం, మృదుత్వం, ఓర్పు, ధైర్యం, శుభ్రత, ఎవరికీ ద్రోహం చేయకపోవడం, అహంకారం లేకపోవడం అనే ఈ (26) సుగుణాలు దైవీ సంపదతో పుట్టిన వారి లక్షణాలు.*

4. **దంభో దర్పోభిమానశ్చ క్రోధః పారుష్య మేవ చ ।**
**అజ్ఞానం చాభిజాతస్య పార్థ సంపదమాసురీమ్ ॥**

*భావం : ఓ అర్జునా! కపటం, గర్వం, అహం, కోపం, కాఠిన్యం, అవివేకం అనే (6) దుర్గుణాలు రాక్షస సంపదతో పుట్టిన వారి లక్షణాలు.*

5. **దైవీ సంపద్విమోక్షాయ నిబంధాయాసురీ మతా ।**
**మా శుచః సంపదం దైవీ మభిజాతోసి పాండవ ॥**

*భావం : ఓ అర్జునా! దైవీ సంపద మోక్షాన్ని, రాక్షస సంపద సంసారబంధాన్ని కలుగ చేస్తాయి. నువ్వు దైవీ సంపదతో పుట్టావు కాబట్టి దుఃఖించకు.*

6. **ద్వౌ భూతసర్గౌ లోకేస్మిన్ దైవ ఆసుర ఏవ చ ।**
**దైవో విస్తరశః ప్రోక్త ఆసురం పార్థ మే శృణు ॥**

*భావం : ఓ అర్జునా! లోకంలో దైవ సంపద, రాక్షస సంపద గల రెండు రకాల ప్రాణులు సృష్టించ బడతారు. దైవీ సంపద గురించి నీకు వివరంగా చెప్పాను. ఇప్పుడు రాక్షస సంపద గురించి చెప్తాను. విను.*

7. **ప్రవృత్తిం చ నివృత్తిం చ జనా న విదురాసురాః ।**
**న శౌచం నాపి చాచారో న సత్యం తేషు విద్యతే ॥**

*భావం : రాక్షస స్వభావం కల వారికి ధర్మప్రవృత్తి (పుణ్యకార్యాలు) నివృత్తి (అధర్మకార్యాలు) తెలీవు. వారిలో శుభ్రత కానీ, మంచి ప్రవర్తన కానీ, నిజం చెప్పడం కానీ ఉండవు.*

8. **అసత్యమప్రతిష్ఠం తే జగదాహురనీశ్వరమ్ ।**
**అపరస్పరసంభూతం కిమన్యత్ కామహైతుకమ్ ॥**

*భావం : ఈ ప్రపంచం అసత్యం అని (ఆధారమైంది లేదని) ధర్మాధర్మాలు లేవని (దీన్ని సృష్టించిన) ఈశ్వరుడు లేడని, కేవలం కామం, స్త్రీ పురుషుల సంబంధంతో సృష్టి జరిగిందని, ఇంక ఈ జగత్తుకి వేరే కారణం లేదని చెప్తారు.*

**9. ఏతాం దృష్టి మవష్టభ్య నష్టాత్మానోల్పబుద్ధయః ।**
**ప్రభవంత్యుగ్రకర్మాణః క్షయాయ జగతోహితాః ॥**

*భావం : వారు (రాక్షస గుణాలు కలవారు) నాస్తిక దృష్టితో ఆత్మని పట్టించుకోక నష్టపోతారు. మందబుద్ధులై క్రూరమైన పనులు చేస్తారు. లోక కంటకులైన వీరు ప్రపంచ వినాశనానికి పుడుతున్నారు.*

**10. కామమాశ్రిత్య దుష్పూరం దంభమానమదాన్వితాః ।**
**మోహాద్గృహీత్వాసద్గ్రాహాన్ ప్రవర్తంతే శుచివ్రతాః ॥**

*భావం : వారు దంబం, దురభిమానం, మదాలతో ఎప్పటికీ తనివి తీరని కోరికలని తీర్చుకుంటున్నారు. అవివేకంతో భ్రష్టాచారులని అనుసరించి నీచమైన పనులని చేస్తున్నారు.*

**11. చింతామపరిమేయాం చ ప్రళయాంతాముపాశ్రితాః ।**
**కామోపభోగపరమా ఏతావదితి నిశ్చితాః ॥**

**12. ఆశాపాశశతైర్బద్ధాః కామక్రోధపరాయణాః ।**
**ఈహంతే కామభోగార్థయమన్యాయేనార్థసంచయాన్ ॥**

*భావం : ఇంకా మరణించే దాకా వారు అంతు లేని కోరికలని ఆశ్రయించి ప్రాపంచిక భోగాలని అనుభవిస్తారు. ఇంతకు మించి వేరే సుఖం లేదని భావిస్తారు. అనేక ఆశలకి కట్టుబడి కామక్రోధాలని కలిగి కోరికలు తీర్చుకుంటూ (అన్యాయదారుల్లో) ధనార్జనకి పాల్పడతారు.*

**13. ఇదమద్య మయా లబ్ధ మిమం ప్రాప్స్యే మనోరథమ్ ।**
**ఇదమస్తీదమపి మే భవిష్యతి పునర్ధనమ్ ॥**

**14. అసౌ మయా హతశ్శత్రుః హనిష్యే చాపరానపి ।**
**ఈశ్వరోహమహం భోగీ సిద్ధోహం బలవాన్సుఖీ ॥**

15. ఆఢ్యోభిజనవానస్మి కోన్యోస్తిసదృశో మయాః ।
యక్ష్యే దాస్యామి మోదిష్య ఇత్యజ్ఞానవిమోహితాః ॥

16. అనేకచిత్తవిభ్రాంతాః మోహజాలసమావృతాః ।
ప్రసక్తాః కామభోగేషు పతంతి నరకేశుచౌ ॥

*భావం : 'ఈ కోరికని తీర్చుకున్నాను. దీన్ని మళ్ళీ పొందగలను. నా దగ్గర డబ్బుంది. ముందు ముందు ఇంకా ఎంతో డబ్బుని సంపాదించగలను. నేను ఈ శత్రువుని చంపాను. మిగిలిన శత్రువులని కూడా చంపగలను. నేను సర్వాధిపతిని. సమస్త భోగాలని అనుభవించగలను. నేను అనుకున్న పనిని సాధించగలను. బలవంతుడ్ని. సుఖించే వాడిని. ధనవంతుడ్ని. అనేక పరివారం కలవాడిని. నాతో సమానమైన వాడు ఇంకోడు ఎవరున్నారు? యజ్ఞయాగాలు చేస్తాను. దానాలు చేస్తాను. ఆనందాన్ని అనుభవిస్తాను' ఈ విధంగా అజ్ఞానంతో, కోరికల మీద ప్రేమతో చిత్త చాంచల్యానికి గురై, ప్రాపంచిక భోగాల మీదే ఆసక్తులై ఘోర నరకాల్లో పడిపోతున్నారు.*

17. ఆత్మసంభావితాః స్తబ్ధాః ధనమానమదాన్వితాః ।
యజంతే నామయజ్ఞైస్తే దంభేనావిధిపూర్వకమ్ ॥

18. అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః ।
మామాత్మాపరదేహేషు ప్రద్విషంతోభ్యసూయకాః ॥

*భావం : తమకి తామే గొప్పవారని భావిస్తూ, వినయం లేక, ధనమదంతో, దురహంకారంతో, పశుబలంతో, గర్వంతో, కోరికతో, కోపంతో కూడిన తమ శరీరాల్లో, ఇతర శరీరాల్లో (సాక్షిగా) ఉన్న నన్ను బాగా ద్వేషిస్తారు. అసూయాపరులై వారు దంబంతో శాస్త్ర విరుద్ధంగా నామమాత్రపు యజ్ఞాలతో యాగాలని చేస్తున్నారు.*

19. తానహం ద్విషతః క్రూరాన్సంసారేషు నరాధమాన్ ।
క్షిపామ్యజస్ర మశుభా నాసురీష్వేవ యోనిషు ॥

భావం : ఇలా నన్ను ద్వేషించే క్రూరులు, పాపాత్ములు అయిన ఆ నరాధములని నేను (జననమరణ) సంసారంలో సదా నీచ జన్మల్లో పడేస్తూంటాను.

**20. ఆసురీం యోనిమాపన్నా మూఢా జన్మని జన్మని ।**
**ఆమప్రాప్యైవ కౌంతేయ తతో యాంత్యధమాం గతిమ్ ॥**

భావం : ఓ అర్జునా! రాక్షస గుణాలతో జన్మని పొందిన ఆ అవివేకులు, ప్రతీ జన్మలో నన్ను పొందక, అంతకంటే హీనమైన జన్మకి వెళ్తున్నారు.

**21. త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః ।**
**కామః క్రోధస్తథా లోభః తస్మాదేతత్త్రయం త్యజేత్ ॥**

భావం : కామం (కోరిక) కోపం, లోభం అనే ఈ మూడూ నరకద్వారాలు. నాశనాన్ని కలుగచేస్తాయి కాబట్టి ఈ మూడిటిని వదిలేయాలి.

**22. ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారైః త్రిభిర్నరః ।**
**ఆచరత్యాత్మనః శ్రేయః తతో యాతి పరాం గతిమ్ ॥**

భావం : ఓ అర్జునా! ఈ మూడు నరక ద్వారాల నించి బయటపడ్డ మనిషి తనకి మేలు చేసుకుంటున్నాడు. దాంతో సర్వోత్కృష్టమైన మోక్షాన్ని పొందుతున్నాడు.

**23. యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః ।**
**న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్ ॥**

భావం : ఎవడు శాస్త్రోక్తమైన విధిని వదిలేసి యథేచ్ఛగా ప్రవర్తిస్తాడో అతను జ్ఞాన సిద్ధిని కానీ, సుఖాన్ని కానీ, ఉత్తమమైన మోక్షాన్ని కానీ పొందడు.

**24. తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ ।**
**జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి ॥**

భావం : కాబట్టి చేయదగినది, చేయకూడనిది నిర్ణయించాల్సి వచ్చినప్పుడు, శాస్త్రమే ప్రమాణం. శాస్త్రంలో చెప్పింది తెలుసుకుని, నువ్వు ఈ ప్రపంచంలో కర్మని చేస్తూండు.

**ఆపదం నరకం ఘోరం గీతాధ్యాయీ న పస్యతి ।**
**భావం : గీతని అధ్యయనం చేసే వాడు ఆపదలని కాని,**
**ఘోర నరకాన్ని కాని ఎన్నటికీ చూడడు.**

# పదిహేడవ అధ్యాయం

# శ్రద్ధాత్రయ విభాగయోగం

అర్జున ఉవాచ

1. **యే శాస్త్రవిధిముత్సృజ్య యజంతే శ్రద్ధయాన్వితాః ।**
**తేషాం నిష్ఠా తు కా కృష్ణ సత్త్వమాహో రజస్తమః ॥**

*భావం : అర్జునుడు అడిగాడు : ఓ కృష్ణా! ఎవరు శాస్త్రవిధిని విడిచి శ్రద్ధతో దైవ పూజలని చేస్తారో వారి ప్రవృత్తి సాత్వికమా? రాజసమా? లేక తామసమా?*

శ్రీ భగవాన్ ఉవాచ

2. **త్రివిధా భవతి శ్రద్ధా దేహినాం సా స్వభావజా ।**
**సాత్త్వికీ రాజసీ చైవ తామసీ చేతి తాం శృణు ॥**

*భావం : భగవానుడు చెప్పాడు : ప్రాణుల యొక్క స్వభావం (పూర్వజన్మ సంస్కారం) వల్ల కలిగే శ్రద్ధ సాత్త్విక శ్రద్ధ, రజోగుణ శ్రద్ధ, తామస శ్రద్ధ అని మూడు విధాలుగా ఉంటుంది. దాన్ని విను.*

3. **సత్త్వానురూపా సర్వస్య శ్రద్ధా భవతి భారత ।**
**శ్రద్ధామయోఽయం పురుషో యో యచ్ఛ్రద్ధస్స ఏవ సః ॥**

*భావం : ఓ అర్జునా! సమస్త జీవులకి వారి మనసుకి తగ్గట్టుగా శ్రద్ధ ఉంటుంది. ఈ జీవుడు శ్రద్ధామయుడు. ఎవడు ఎలాంటి శ్రద్ధ గలవాడో అతడిలో అలాంటి శ్రద్ధే కొనసాగుతూంటుంది.*

**4. యజంతే సాత్త్వికా దేవాన్ యక్షరక్షాంసి రాజసాః ।**
**ప్రేతాన్ భూతగణాంశ్చాన్యే యజంతే తామసా జనాః ॥**

*భావం : సాత్త్వికులు దేవతలని, రజోగుణస్థులు యక్ష రాక్షసులని, తమో గుణస్థులు భూతప్రేతాలని పూజిస్తున్నారు.*

**5. అశాస్త్రవిహితం ఘోరం తప్యంతే యే తపో జనాః ।**
**దంభాహంకారసంయుక్తాః కామరాగబలాన్వితాః ॥**

**6. కర్శయంతశ్శరీరస్థం భూతగ్రామమచేతసః ।**
**మాం చైవాంతశ్శరీరస్థం తాన్ విద్ధ్యాసురనిశ్చయాన్ ॥**

*భావం : శరీరం లోని పంచభూతాలని (ఉపవాసాలతో) శుష్కింప చేస్తూ, శరీరంలో అంతర్యామిగా ఉన్న నన్ను కష్టపెడుతున్న వారు, దంబాహంకారాలతో, కోరిక, ఆసక్తి, పశుబలం కల అవివేకులు, శాస్త్రంలో చెప్పినట్లుగా కాక ఘోరమైన తపస్సుని ఆచరిస్తున్న వారు రాక్షస స్వభావం కలవారని తెలుసుకో.*

**7. ఆహార స్త్వపి సర్వస్య త్రివిధో భవతి ప్రియః ।**
**యజ్ఞస్తపస్తథా దానం తేషాం భేదమిమం శృణు ॥**

*భావం : ఆహారాన్ని కూడా త్రిగుణాలని (సత్త్వ, రజస్సు, తమస్సు) బట్టి మూడు విధాలుగా ఇష్టపడతారు. అలాగే యజ్ఞం, తపస్సు, దానాలని కూడా మూడు విధాలుగా ఇష్టపడతారు. ఆ విధాలని విను.*

**8. ఆయుస్సత్త్వబలారోగ్య సుఖప్రీతివివర్ధనాః ।**
**రస్యాస్స్నిగ్ధాః స్థిరా హృద్యా ఆహారాస్సాత్త్వికప్రియాః ॥**

*భావం : ఆయుష్షు, బుద్ధి బలం, దేహబలం, ఆరోగ్యం, ప్రీతి సౌఖ్యాలని వృద్ధి పొందించే రసం కలవి, చమురు కలవి, దేహంలో ఎక్కువ కాలం ఉండేవి, హృద్యమైనవి ఐన ఆహార పదార్థాలు సత్త్వగుణం వారికి ఇష్టమైనవి.*

9. **కట్వామ్ల లవణాత్యుష్ణతీక్ష్ణ రూక్షవిదాహినః ।**
**ఆహారా రాజసస్యేష్టా దుఃఖశోకామయప్రదాః ॥**

*భావం : చేదు, పులుపు, ఉప్పు, ఎక్కువ వేడి, కారం, చమురు లేనివి, బాగా దాహం కలిగించేవి, దుఃఖాన్ని, శోకాన్ని కలిగించే ఆహారపదార్థాలు రజోగుణస్థులకి ఇష్టమైనవి.*

10. **యాతయామం గతరసం పూతి పర్యుషితం చ యత్ ।**
**ఉచ్ఛిష్టమపి చామేధ్యం భోజనం తామసప్రియమ్ ॥**

*భావం : ఉడికీ ఉడకనివి, వండి జాము దాటినవి, సారం నశించినవి, దుర్గంధమైనవి, పాచిపోయినవి, ఎంగిలి చేసినవి (ఒకరు తినగా మిగిలినవి) శుచి లేనివి (పరమాత్మకి నివేదన చేయనిది) అయిన ఆహారపదార్థాలు తమోగుణస్థులకి ఇష్టమైనవి.*

11. **అఫలాకాంక్షిభిర్యజ్ఞో విధిదృష్టో య ఇజ్యతే ।**
**యష్టవ్యమేవేతి మనస్సమాధాయ స సాత్త్వికః ॥**

*భావం : 'ఇది చేయదగ్గదే' అని మనసులో నిశ్చయించుకుని, ఫలాపేక్ష కోరక చేసే శాస్త్రసమ్మతమైన యజ్ఞం సాత్త్విక యజ్ఞం.*

12. **అభిసంధాయ తు ఫలం దంభార్థమపి చైవ యత్ ।**
**ఇజ్యతే భరతశ్రేష్ఠ తం యజ్ఞం విద్ధి రాజసమ్ ॥**

*భావం : ఓ అర్జునా! ఫలాన్ని కోరక ఆడంబరం కోసం చేసే యజ్ఞం రాజసమైనది.*

13. **విధిహీనమసృష్టాన్నం మంత్రహీనమదక్షిణమ్ ।**
**శ్రద్ధావిరహితం యజ్ఞం తామసం పరిచక్షతే ॥**

*భావం : శాస్త్రప్రకారం చేయనిది, అన్న దానం, మంత్రం, దక్షిణ, శ్రద్ధ లేని యజ్ఞం తామస యజ్ఞం.*

14. దేవద్విజగురుప్రాజ్ఞ పూజనం శౌచమార్జవమ్ ।
బ్రహ్మచర్యమహింసా చ శారీరం తప ఉచ్యతే ॥

*భావం : దేవతలని, బ్రాహ్మణులని, గురువులని, మహాత్ములని పూజించడం, శుచి, నిరాడంబరత్వం, బ్రహ్మచర్యం, అహింసలని శారీరక తపస్సు అంటారు.*

15. అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్ ।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాంగ్మయమ్ తప ఉచ్యతే ॥

*భావం : ఉద్వేగం కలిగించని, సత్యమైన, ప్రియమైన, మేలుని కలిగించే సంభాషణం, వేదాంత పురాణ అధ్యయనాన్ని వాక్కుతో చేసే తపస్సు అంటారు.*

16. మనఃప్రసాదస్సౌమ్యత్వం మౌనమాత్మవినిగ్రహః ।
భావసంశుద్ధిరిత్యేత త్తపో మానసముచ్యతే ॥

*భావం : ప్రసన్న మనసు, సౌమ్యత్వం, భగవత్ చింతన, మానసిక నిగ్రహం, పరిశుద్ధమైన భావాలు కలిగి ఉండడం మానసిక తపస్సు అవుతుంది.*

17. శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్త్రివిధం నరైః ।
అఫలాకాంక్షిభిర్యుక్తైస్సాత్త్వికం పరిచక్షతే ॥

*భావం : ఫలాపేక్ష కోరక దైవీభావంతో, శ్రద్ధ గల మనుషులు ఆచరించే ఆ మూడు తపస్సులని (వాక్ తపస్సు, శారీరక తపస్సు, మానసిక తపస్సు) సాత్త్విక తపస్సులు అంటారు.*

18. సత్కారమానపూజార్థం తపో దంభేన చైవ యత్ ।
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్ ॥

*భావం : ఇతరుల నించి సత్కారం, గౌరవం, పూజ అందుకోవాలని, దంబంతో (స్వార్థ ప్రయోజనంతో) ఏ తపస్సు చేయబడుతుందో అస్థిర, అనిశ్చిత ఫలాన్ని ఇచ్చే దాన్ని రాజసిక తపస్సు అంటారు.*

**19. మూఢగ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః ।**
**పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్ ॥**

*భావం : ఇతరులకి కీడు కలిగించే ఉద్దేశంతో, తనని పీడించుకుని (ఉపవాసం లాంటివి) మొండి పట్టుదలతో చేయబడే తపస్సుని తామసిక తపస్సు అంటారు.*

**20. దాతవ్యమితి యద్దానం దీయతేనుపకారిణే ।**
**దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్ ॥**

*భావం : ఇవ్వాల్సిందే అనుకుని ఏ దానాన్ని, ఏ ప్రదేశంలో, ఏ కాలంలో ప్రత్యుపకారం చేసే శక్తి లేని యోగ్యులైన వారికి ఇస్తారో అది సాత్త్వికదానం అవుతుంది.*

**21. యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వా పునః ।**
**దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్ ॥**

*భావం : ప్రత్యుపకారం ఆశించి, ప్రతిఫలాపేక్ష కోరి కానీ, అయిష్టంగా కాని ఇవ్వబడే దానం రాజసిక దానం అవుతుంది.*

**22. అదేశకాలే యద్దాన మపాత్రేభ్యశ్చ దీయతే ।**
**అసత్కృతమవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్ ॥**

*భావం : అగౌరవంగా, అమర్యాదతో ఇవ్వబడే అపాత్ర దానం తామస దానం అవుతుంది.*

**23. ఓం తత్సదితి నిర్దేశో బ్రహ్మణస్త్రివిధః స్మృతః ।**
**బ్రాహ్మణా స్తేన వేదాశ్చ యజ్ఞాశ్చ విహితాః పురా ॥**

*భావం : పరబ్రహ్మానికి 'ఓం' 'తత్' 'సత్' అని మూడు పేర్లు ఉన్నాయి. సృష్టి మొదట్లో ఈ పరమాత్మ నించే బ్రాహ్మణులు, వేదాలు, యజ్ఞాలు ఏర్పడ్డాయి.*

**24. తస్మాదోమిత్యుదాహృత్య యజ్ఞదానతపఃక్రియాః ।**
**ప్రవర్తంతే విధానోక్తాః సతతం బ్రహ్మవాదినామ్ ॥**

భావం : అందువల్ల వేదాలని తెలిసిన వారు యజ్ఞం, దానం, తపస్సు అనే కర్మలని సదా 'ఓం' అని చెప్పాకే ఆరంభిస్తారు.

**25. తదిత్యనభిసంధాయ ఫలం యజ్ఞతపః క్రియాః ।**
**దానక్రియాశ్చ వివిధాః క్రియంతే మోక్షకాంక్షిభిః ॥**

భావం : మోక్ష కాంక్ష కలవారు ప్రతిఫలాన్ని కోరక యజ్ఞ, దాన, తపస్సులని 'తత్' అనే నామాన్ని ఉచ్చరించి చేస్తున్నారు.

**26. సద్భావే సాధుభావే చ సదిత్యేతత్ప్రయుజ్యతే ।**
**ప్రశస్తే కర్మణి తథా సచ్ఛబ్దః పార్థ యుజ్యతే ॥**

భావం : ఓ అర్జునా! సద్భావంతో, సాధుభావంతో చేసే కర్మలు, అలాగే ఉత్తమమైన కర్మల్లో కూడా 'సత్' అనే నామాన్ని వాడుతున్నారు.

**27. యజ్ఞే తపసి దానే చ స్థితిస్సదితి చోచ్యతే ।**
**కర్మ చైవ తదర్థీయం సదిత్యేవాభిధీయతే ॥**

భావం : యజ్ఞం, తపస్సు, దానాల్లోని నిష్ఠని, భగవత్ ప్రీత్యర్థం చేసే కర్మని 'సత్' అంటారు.

**28. అశ్రద్ధయా హుతం దత్తం తపస్తప్తం కృతం చ యత్ ।**
**అసదిత్యుచ్యతే పార్థ న చ తత్ప్రేత్య నో ఇహ ॥**

భావం : ఓ అర్జునా! అశ్రద్ధతో చేసే హోమం కానీ, దానం కానీ, తపస్సు కానీ, ఇతర కర్మలని కానీ 'అసత్' అంటారు. అది పర లోకంలో కానీ, ఇహ లోకంలో కానీ ప్రయోజనాన్ని ఇవ్వదు.

**సోపానాష్టాదశైరేవ భుక్తి ముక్తి సముచ్ఛ్రితైః।**
**క్రమశః చిత్తశుద్ధిః స్యాత్ప్రేమ భక్త్యా కర్మసు।**
భావం : భుక్తి, ముక్తి ఉపదేశాలతో సమున్నతమైన 18 అధ్యాయాలనే మెట్ల ద్వారా ప్రేమ, భక్తి లాంటి కర్మల్లో ప్రవేశించిన జీవులకి క్రమంగా చిత్తశుద్ధి కలుగుతుంది.

# పద్దెనిమిదో అధ్యాయం

# మోక్షసన్న్యాస యోగం

అర్జున ఉవాచ

**1.** సన్న్యాసస్య మహాబాహో తత్త్వమిచ్ఛామి వేదితుమ్ ।
త్యాగస్య చ హృషీకేశ పృథక్కేశినిషూదన ॥

*భావం : అర్జునుడు చెప్పాడు : ఓ మహాబాహో! హృషీకేశా! (ఇంద్రియ నియామకుడా!) కేశినిషూదనా! (కేసి అనే రాక్షసుడ్ని సంహరించినవాడా) సన్న్యాస త్యాగ తత్త్వాలని వేరువేరుగా తెలుసుకోవాలని అనుకుంటున్నాను.*

శ్రీ భగవాన్ ఉవాచ

**2.** కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః ।
సర్వకర్మఫలత్యాగం ప్రాహుస్త్యాగం విచక్షణాః ॥

*భావం : భగవానుడు చెప్పాడు : కోరికలు తీరే కర్మలని త్యాగం చేయడమే సన్న్యాసంగా పండితులు చెప్తారు. సమస్త కర్మల ఫలాన్ని వదిలేయడమే త్యాగంగా మరి కొందరు పండితులు చెప్తారు.*

**3.** త్యాజ్యం దోషవదిత్యేకే కర్మ ప్రాహుర్మనీషిణః ।
యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యమితి చాపరే ॥

*భావం : కొందరు మనుషులు కర్మలు దోషమైనవని, విడిచి పెట్టాలని చెప్తారు. మరి కొందరు యజ్ఞం, దానం, తపస్సు అనే కర్మలని విడిచి పెట్టకూడదని చెప్తారు.*

4. **నిశ్చయం శృణు మే తత్ర త్యాగే భరతసత్తమ ।**
**త్యాగో హి పురుషవ్యాఘ్ర త్రివిధస్సంప్రకీర్తితః ॥**

*భావం : ఓ అర్జునా! పురుషశ్రేష్టా! వాటి (సన్న్యాసం, త్యాగం) లో మొదట త్యాగం గురించి నా అభిప్రాయాన్ని విను. త్యాగం మూడు విధాలుగా చెప్పబడింది.*

5. **యజ్ఞదానతపఃకర్మ న త్యాజ్యం కార్యమేవ తత్ ।**
**యజ్ఞోదానం పతశ్చైవ పావనాని మనీషిణామ్ ॥**

*భావం : యజ్ఞం, దానం, తపస్సు అనే కర్మలు వదిలిపెట్టకూడదు. అవి చేయతగ్గవి. అవి మనుషులకి చిత్తశుద్ధిని కలుగ చేస్తాయి.*

6. **ఏతాన్యసి తు కర్మాణి సంగం త్యక్త్వా ఫలాని చ ।**
**కర్తవ్యానీతి మే పార్థ నిశ్చితం మతముత్తమమ్ ॥**

*భావం : ఓ అర్జునా! ఈ యజ్ఞదాన తపఃకర్మలని కూడా ఫలాసక్తిని విడిచి పెట్టి చేయడం శ్రేష్టం అని నా నిశ్చితాభిప్రాయం.*

7. **నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే ।**
**మోహాత్తస్య పరిత్యాగః తామసః పరికీర్తితః ॥**

*భావం : వేదశాస్త్రాలు విధించిన కర్మలని వదలడం సరైంది కాదు. అజ్ఞానంతో ఆ కర్మలని విడిచిపెట్టడం తామస త్యాగం అవుతుంది.*

8. **దుఃఖమిత్యేవ యత్కర్మ కాయక్లేశభయాత్త్యజేత్ ।**
**స కృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్**

*భావం : శరీరానికి కష్టానికి భయపడి, దుఃఖం కలిగిస్తుందని కర్మలని వదిలేయడం రజోగుణ త్యాగం. ఈ త్యాగం వల్ల ఎలాంటి ఫలితం లభించదు.*

**9. కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేర్జున ।**
**సంగం త్యక్త్వా ఫలం చైవ స త్యాగస్సాత్త్వికో మతః ॥**

*భావం : ఓ అర్జునా! శాస్త్రం విధించిన కర్మలు చేయతగ్గవి అని భావించి, వాటి మీద అభిమానాన్ని, ఫలాన్ని విడిచి కర్మలు చేస్తే అది సాత్త్విక త్యాగం అవుతుంది.*

**10. న ద్వేష్ట్యకుశలం కర్మ కుశలేనానుషజ్జతే ।**
**త్యాగీ సత్త్వసమావిష్టో మేధావీ ఛిన్నసంశయః ॥**

*భావం : సత్త్వగుణం కలిగినవాడు, మేధావి, సంశయాలు లేనివాడు అయిన త్యాగశీలుడు అశుభ (కోరిక తీరే) కర్మని ద్వేషించడు. శుభ (నిష్కామ) కర్మ మీద అభిమానం కలిగి ఉండడు.*

**11. న హి దేహభృతా శక్యం త్యక్తుం కర్మాణ్యశేషతః ।**
**యస్తు కర్మఫలత్యాగీ స త్యాగీత్యభిధీయతే ॥**

*భావం : కర్మలని పూర్తిగా వదలడం మనిషికి సాధ్యం కాదు. ఎవడు కర్మ ఫలాలని విడిచిపెడ్తున్నాడో అతడే త్యాగి.*

**12. అనిష్టమిష్టం మిశ్రం చ త్రివిధం కర్మణః ఫలమ్ ।**
**భవత్యత్యాగినాం ప్రేత్య న తు సన్న్యాసినాం కచిత్ ॥**

*భావం : మంచి (ఉత్తమ జన్మ) చెడు (నీచజన్మ) మిశ్రమం (సుఖదుఃఖాలు) కలిగించే కర్మలకి మూడు రకాలైన ఫలాలు ఉంటాయి. కర్మఫల త్యాగం చేయనివాడు మరణించాక వాటిని అనుభవించి తీరాలి. కర్మఫల త్యాగం చేసిన వారు దాన్ని ఎన్నడూ అనుభవించరు.*

**13. పంచైతాని మహాబాహో కారణాని నిబోధ మే ।**
**సాంఖ్యే కృతాంతే ప్రోక్తాని సిద్ధయే సర్వకర్మణామ్ ॥**

*భావం : ఓ అర్జునా! కర్మబంధాన్ని నశింప చేసే మార్గాన్ని తెలిపే వేదాంతశాస్త్రంలో (సాంఖ్య) సర్వకర్మల సిద్ధికి ఐదు కారణాలు చెప్తారు. వాటిని చెప్తాను. విను.*

**14. అధిష్ఠానం తథా కర్తా కరణం చ పృథగ్విధమ్ ।**
**వివిధాశ్చ పృథక్చేష్టా దైవం చైవాత్ర పంచమమ్ ॥**

*భావం : కర్మని చేయడానికి ఈ ఐదూ కారణాలు. 1. శరీరం. 2. కర్మ. 3. వివిధ ఇంద్రియాలు. 4. నానావిధాలైన వేరు వేరు క్రియలు. 5. దైవం.*

**15. శరీరవాంగ్మనోభిర్య త్కర్మ ప్రారభతే నరః ।**
**న్యాయ్యం వా విపరీతం వా పంచైతే తస్య హేతవః ॥**

*భావం : మనిషి శరీరం, వాక్కు, మనస్సులతో శాస్త్రానుకూలమైన (న్యాయమైన) లేదా అశాస్త్రీయమైన (అధర్మమైన) కర్మలు ప్రారంభించడానికి ఐదు కారణాలు ఉన్నాయి.*

**16. తత్రైవం సతి కర్తార మాత్మానం కేవలం తు యః ।**
**పశ్యత్యకృత బుద్ధిత్వా న్న స పశ్యతి దుర్మతిః ॥**

*భావం : కర్మ చేయడానికి (14వ శ్లోకంలో చెప్పిన ఐదు కారణాలు కాక) ఎవడు విపరీత బుద్ధితో, శుద్ధ స్వరూపుడైన ఆత్మని (సమస్త కర్మలకి) కర్తగా భావిస్తున్నాడో అలాంటి అవివేకి నిజాన్ని (కర్మ-ఆత్మ స్వరూపాలని) గ్రహించలేడు.*

**17. యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య న లిప్యతే ।**
**హత్వాపి స ఇమాంల్లోకా న్న హంతి న నిబధ్యతే ॥**

*భావం : కర్తృత్వభావం లేని వాడి బుద్ధి ప్రాపంచిక విషయాలని, కర్మ ఫలితాలని అంటదు. అలాంటి వాడు లోకంలోని ప్రాణులందర్నీ చంపినా నిజానికి హంతకుడు కాడు. అతనికి కర్మబంధం ఉండదు.*

**18. జ్ఞానం జ్ఞేయం పరిజ్ఞాతా త్రివిధా కర్మచోదనా ।**
**కరణం కర్మ కర్తేతి త్రివిధః కర్మసంగ్రహః ॥**

*భావం : తెలివి (జ్ఞానం) తెలియదగిన వస్తువు (జ్ఞేయం) తెలియు వాడు (జ్ఞాత) అని కర్మ ప్రేరణలు మూడు రకాలు. అలాగే కర్త, కరణం (సాధనం) కర్మ (క్రియ) అని కర్మకి మూడు రకాల ఆధారాలు ఉన్నాయి.*

**19. జ్ఞానం కర్మ చ కర్తా చ త్రిధైవ గుణభేదతః ।**
**ప్రోచ్యతే గుణసంఖ్యానే యథావచ్ఛృణు తాన్యపి ॥**

*భావం : జ్ఞానం, కర్మ, కర్త అనే మూడు త్రిగుణాలని అనుసరించి గుణభేదాలని సాంఖ్యశాస్త్రంలో మూడు రకాలుగా చెప్పారు. వాటి గురించి శాస్త్రంలో చెప్పిన ప్రకారం చెప్తాను. విను.*

**20. సర్వభూతేషు యేనైకం భావమవ్యయమీక్షతే ।**
**అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్ ॥**

*భావం : వేరువేరుగా కనిపించే సమస్త ప్రాణులలో శాశ్వతమైన పరమాత్మ ఏకంగా (విభజింపబడక) ఉన్నట్లుగా చూసే జ్ఞానాన్ని 'సాత్త్విక జ్ఞానం' అంటారు.*

**21. పృథక్త్వేన తు యద్జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్ ।**
**వేత్తి సర్వేషు భూతేషు తద్జ్ఞానం విద్ధి రాజసమ్ ॥**

*భావం : సమస్త ప్రాణుల్లో వేరువేరుగా ఉన్న అనేక జీవులని, వేరువేరుగా భావిస్తే అలాంటి జ్ఞానాన్ని 'రాజసిక జ్ఞానం' అంటారు.*

22. యత్తు కృత్స్నవదేకస్మి న్కార్యేసక్తమహైతుకమ్ ।
అతత్త్వార్థవదల్పం చ తత్తామసముదాహృతమ్ ॥

భావం : (శరీరానికి సంబంధించిన) ఒకే పనిని సమస్తంగా భావించి ఆసక్తిగా ఉండటం, తత్త్వాన్ని తెలియక అది కారణం లేనిది, అల్పమైనది అనుకునే జ్ఞానం తామస జ్ఞానం.

23. నియతం సంగరహిత మరాగద్వేషతః కృతమ్ ।
అఫలప్రేప్సునా కర్మ యత్తత్ సాత్త్వికముచ్యతే ॥

భావం : ఫలాపేక్ష, ఆసక్తి, రాగద్వేషాలు లేకుండా శాస్త్రంలో చెప్పినట్లుగా చేసే కర్మని 'సాత్త్విక కర్మ' అంటారు.

24. యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వా పునః ।
క్రియతే బహులాయాసం తద్రాజసముదాహృతమ్ ॥

భావం : భోగలాలసుడు (ఫలాపేక్షతో) తనే కర్త అనే భావంతో, మిక్కిలి శ్రమతో చేసే కర్మని 'రాజసకర్మ' అంటారు.

25. అనుబంధం క్షయం హింసామ్ అనపేక్ష్య చ పౌరుషమ్ ।
మోహాదారభ్యతే కర్మ యత్తత్తామసముచ్యతే ॥

భావం : మంచిచెడ్డల ఫలాన్ని (నాశనం, హింస,సామర్థ్యాన్ని) ఆలోచించక మూర్ఖత్వంతో ప్రారంభించే కర్మని 'తామసకర్మ 'అంటారు.

26. ముక్తసంగోనహంవాదీ ధృత్యుత్సాహసమన్వితః ।
సిద్ధ్యసిద్ధ్యో ర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే ॥

భావం : ఫలాపేక్ష వదిలి, తానే కర్తననే భావం లేక ధైర్యంతో, ఉత్సాహంతో ఫలితం వచ్చినా రాకపోయినా పట్టించుకోక పనిని చేసే కర్తని 'సాత్త్విక కర్త' అంటారు.

**27. రాగీ కర్మఫలప్రేప్సు ర్లుబ్ధో హింసాత్మకోశుచిః ।**
**హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః ॥**

*భావం : ఆసక్తితో, కర్మఫలాపేక్షతో లోభియై, హింసతో, అపవిత్రతతో కర్మ చేసే కర్తకి సత్ఫలితం వస్తే సంతోషం రాకపోతే దుఃఖం కలిగితే ఆ కర్తని 'రాజసకర్త' అంటారు.*

**28. అయుక్తః ప్రాకృతః స్తబ్ధ శ్శఠో నైష్కృతికోలసః ।**
**విషాదీ దీర్ఘసూత్రీ చ కర్తా తామస ఉచ్యతే ॥**

*భావం : మనోనిగ్రహం లేనివాడు, అవివేకి, వినయం లేనివాడు, మోసగాడు, అకారణంగా ఇతరులకి నష్టం చేసేవాడు, సోమరి, ఎప్పుడూ దుఃఖంగా ఉండేవాడు, పనులని అశ్రద్ధతో వాయిదా వేసేవాడు అయిన కర్త 'తామసకర్త.'*

**29. బుద్ధేర్భేదం ధృతేశ్చైవ గుణతస్త్రివిధం శృణు ।**
**ప్రోచ్యమానమశేషేణ పృథక్త్వేన ధనంజయ ॥**

*భావం : ఓ ధనంజయా! బుద్ధి, ధైర్యాల భేదాన్ని, వాటి గుణాలని బట్టి మూడు విధాలుగా, వేరువేరుగా వివరంగా చెప్తాను. విను.*

**30. ప్రవృత్తిం చ నివృత్తిం చ కార్యాకార్యే భయాభయే ।**
**బంధం మోక్షం చ యా వేత్తి బుద్ధిస్సా పార్థ సాత్త్వికీ ॥**

*భావం : ఓ అర్జునా! ప్రవృత్తి మార్గాన్ని (చేయదగ్గది) నివృత్తి మార్గాన్ని (చేయకూడనిది) అలాగే, భయాన్ని, నిర్భయత్వాన్ని, బంధాన్ని, మోక్షాన్ని తెలుసుకునే బుద్ధి సాత్త్వికమైంది.*

**31. యయా ధర్మమధర్మం చ కార్యం చాకార్య మేవ చ ।**
**అయథావత్ ప్రజానాతి బుద్ధిస్సా పార్థ రాజసీ ॥**

*భావం : ఓ పార్థా! ధర్మాధర్మాలు (చేయదగినవి, చేయకూడనివి) వాస్తవంగా కాక ఇంకో విధంగా తెలుసుకునే బుద్ధి 'రాజసబుద్ధి.'*

**32. అధర్మం ధర్మమితి యా మన్యతే తమసావృతా ।**
**సర్వార్థాన్ విపరీతాంశ్చ బుద్ధిస్సా పార్థ తామసీ ॥**

*భావం : ఓ అర్జునా! అవివేకంతో అధర్మాన్ని ధర్మంగా, సమస్త పదార్థాలని వాటికి విరుద్ధంగా భావించే బుద్ధిని 'తామసబుద్ధి' అంటారు.*

**33. ధృత్యా యయా ధారయతే మనఃప్రాణేంద్రియక్రియాః ।**
**యోగేనావ్యభిచారిణ్యా ధృతిస్సా పార్థ సాత్త్వికీ ॥**

*భావం : ఓ పార్థా! చలించని ధారణశక్తితో, ధైర్యంతో, మనస్సు, ప్రాణం ఇంద్రియాల క్రియలని యోగసాధనతో ఎవరు ధారణ చేస్తారో ఆ ధృతి (శక్తి) సాత్త్వికమైనది.*

**34. యయా తు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతేర్జున ।**
**ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతిస్సాపార్థ రాజసీ ॥**

*భావం : ఓ పార్థా! మిక్కిలి ఆసక్తితో, ఫలాపేక్షతో, ధర్మాన్ని, కామాన్ని, ధనాన్ని ఏ ధైర్యంతో అనుష్ఠిస్తున్నాడో ఆ ధైర్యాన్ని 'రాజసధృతి' అంటారు.*

**35. యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవ చ ।**
**న విముంచతి దుర్మేధా ధృతిస్సా పార్థ తామసీ ॥**

*భావం : ఓ అర్జునా! దుర్బుద్ధి, నిద్ర, భయం, దుఃఖం, శోకం, మదాలని విడవని ధృతి తామసమైనది.*

**36. సుఖం త్విదానీం త్రివిధం శృణు మే భరతర్షభ ।**
**అభ్యాసాద్రమతే యత్ర దుఃఖాంతం చ నిగచ్ఛతి ॥**

*భావం : ఓ భరతశ్రేష్ఠా! దేని అభ్యాసంతో ఆనందం పొంది, దుఃఖానికి దూరమవుతాడో మూడు విధాలైన ఆ సుఖాన్ని గురించి చెప్తాను. విను.*

**37. యత్తదగ్రే విషమివ పరిణామేమృతోపమమ్ ।**
**తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మబుద్ధిప్రసాదజమ్ ॥**

*భావం : వివేకం ప్రసాదించే ఏ సుఖం ఆరంభంలో విషంగా, చివరికి అమృతంలా ఉంటుందో, ఆ సుఖం 'సాత్త్వికసుఖం.'*

**38. విషయేంద్రియసంయోగా ద్యత్తదగ్రేమృతోపమమ్ ।**
**పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతమ్ ॥**

*భావం : ఏ సుఖం విషయేంద్రియ సంబంధం వల్ల మొదట అమృతంతో సమానంగా ఉండి, చివరికి (అనుభవం తర్వాత) విషంలా ఉంటుందో ఆ సుఖం 'రాజస సుఖం.'*

**39. యదగ్రే చానుబంధే చ సుఖం మోహనమాత్మనః ।**
**నిద్రాలస్యప్రమాదోత్థం తత్తామసముదాహృతమ్ ॥**

*భావం : నిద్ర, సోమరితనం, మోహం లోంచి పుట్టే ఏ సుఖం ఆరంభంలో, అంతంలో తనకి భ్రమని కలిగిస్తుందో అది 'తామస సుఖం.'*

**40. న తదస్తి పృథివ్యాం వా దివి దేవేషు వా పునః ।**
**సత్త్వం ప్రకృతిజైర్ముక్తం యదేభిస్స్యాత్ త్రిభిర్గుణైః ॥**

*భావం : ప్రకృతి (మాయ) నించి పుట్టిన ఈ మూడు గుణాలతో కలవని ప్రాణి భూలోకంలో కానీ, స్వర్గలోకంలో కానీ, దేవలోకంలో కానీ ఎక్కడా లేదు.*

**41. బ్రాహ్మణ క్షత్రియవిశాం శూద్రాణాం చ పరంతప ।**
**కర్మాణి ప్రవిభక్తాని స్వభావప్రభవైర్గుణైః ॥**

*భావం : ఓ పరంతపా! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకి వారి స్వభావం (పూర్వజన్మ సంస్కారం) వల్ల పుట్టిన గుణాలు వేరువేరుగా విభజింపబడ్డాయి.*

**42. శమో దమస్తపశ్శౌచం క్షాంతి రార్జవమేవ చ ।**
**జ్ఞానం విజ్ఞానమా స్తిక్యం బ్రాహ్మం కర్మ స్వభావజమ్ ॥**

*భావం : మనోనిగ్రహం, ఇంద్రియ నిగ్రహం, తపస్సు, శుభ్రత, ఓర్పు, నిజాయితీ, శాస్త్రజ్ఞానం, అనుభవజ్ఞానం, దైవం, గురువు, శాస్త్రాల్లో నమ్మకం గల స్వభావాల నించి పుట్టినది 'బ్రాహ్మణకర్మ.'*

**43. శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్ ।**
**దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥**

*భావం : పరాక్రమం, తేజస్సు, (కీర్తి) ధైర్యం, సామర్థ్యం, యుద్ధంలో చివరి దాకా పోరాడటం, దానం, ధర్మపరిపాలన అనే స్వభావాల నించి పుట్టినది 'క్షత్రియకర్మ.'*

**44. కృషిగోరక్షవాణిజ్యం వైశ్యం కర్మస్వభావజమ్ ।**
**పరిచర్యాత్మకం కర్మ శూద్రస్యాపి స్వభావజమ్ ॥**

*భావం : వ్యవసాయం, గోసంరక్షణ, వర్తక స్వభావాల నించి పుట్టినది 'వైశ్య కర్మ.' ఇంకా సేవించుట అనే కర్మ శూద్రులకి స్వభావసిద్ధం.*

**45. స్వే స్వే కర్మణ్యభిరత స్సంసిద్ధిం లభతే నరః ।**
**స్వకర్మ నిరతః సిద్ధిం యథా విందతి తచ్ఛృణు ॥**

*భావం : (కులాన్ని అనుసరించి) తమ స్వాభావిక కర్మ మీద శ్రద్ధ గల మనిషి సిద్ధిని పొందుతున్నాడు. తన స్వభావ కర్మ వల్ల సిద్ధిని ఎలా పొందుతున్నాడో విను.*

**46. యతః ప్రవృత్తి ర్భూతానాం యేన సర్వమిదం తతమ్ ।**
**స్వకర్మణా తమభ్యర్చ్య సిద్ధిం విందతి మానవః ॥**

భావం : ఎవరి వల్ల ప్రాణుల ఉత్పత్తి జరిగి, ఈ సమస్త ప్రపంచం ఎవరి వల్ల వ్యాపించబడి ఉందో అతన్ని (పరమాత్మని) మనుషుడు తన కులకర్మతో ఆరాధించి సిద్ధిని పొందుతున్నాడు.

**47. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మాత్ స్వనుష్ఠితాత్ ।**
**స్వభావనియతం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥**

భావం : తన ధర్మం గుణం లేనిదిగా కనపడ్డా, చక్కగా ఆచరించిన పరధర్మం కంటే, తన ధర్మమే శ్రేష్టమైనది. స్వభావాన్ని అనుసరించి (వర్ణాశ్రమ ధర్మాన్ని) చేసే కర్మ వల్ల పాపం అంటదు.

**48. సహజం కర్మ కౌంతేయ సదోషమపి న త్యజేత్ ।**
**సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్నిరివావృతాః ॥**

భావం : ఓ కౌంతేయా! స్వధర్మం దోషంతో కూడినదైనా వదలకూడదు. పొగతో అగ్ని కప్పబడినట్లు సర్వ కర్మలు ఏదో ఓ దోషంతో కలిసే ఉంటాయి.

**49. అసక్తిబుద్ధిస్సర్వత్ర జితాత్మా విగతస్పృహః ।**
**నైష్కర్మ్యసిద్ధిం పరమాం సన్న్యాసేనాధిగచ్ఛతి ॥**

భావం : ఓ అర్జునా! అన్నిటా ఆసక్తి లేక ఇంద్రియాలని, మనసుని జయించిన వాడు, ఆశ, కోరిక లేనివాడు కర్మఫల త్యాగం (లేదా జ్ఞానమార్గం) ద్వారా సర్వోత్కృష్టమైన నైష్కర్మ్య సిద్ధిని (మోక్షాన్ని) పొందుతాడు.

**50. సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ తథాప్నోతి నిబోధ మే ।**
**సమాసే నైవ కౌంతేయ నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥**

భావం : ఓ అర్జునా! జ్ఞానంతో శ్రేష్టమైన నైష్కర్మ్య సిద్ధిని పొందే విధానాన్ని, పరమాత్మని పొందే విధానాన్ని సంగ్రహంగా చెప్తాను. విను.

**51. బుద్ధ్యా విశుద్ధయా యుక్తో ధృత్యాత్మానం నియమ్య చ ।**
**శబ్దాదీన్విషయాం స్త్యక్త్వా రాగద్వేషౌ వ్యుదస్య చ ॥**

**52. వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।**
**ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥**

**53. అహంకారం బలం దర్పం కామం క్రోధం పరిగ్రహమ్ ।**
**విముచ్య నిర్మమ శ్శాంతో బ్రహ్మభూయాయ కల్పతే ॥**

*భావం : నిర్మలమైన బుద్ధి కలవాడు, ధైర్యంతో మనసుని స్వాధీనపరచుకుని భోగాలని, రాగద్వేషాలని విడిచి ఏకాంతవాసి అయి, మితమైన (సాత్త్విక) ఆహారాన్ని తీసుకునేవాడు, వాక్కుని, శరీరాన్ని, మనసుని స్వాధీనంలో ఉంచుకుని సదా ధ్యానయోగ తత్పరుడై ఉంటూ, వైరాగ్యాన్ని చక్కగా కలిగి ఉండేవాడు అహంకారాన్ని, బలాన్ని, దంభాన్ని, భోగాసక్తిని, కోపాన్ని, వస్తు సేకరణని పూర్తిగా వదిలి మమకారం లేక శాంతిగా ఉండేవాడు బ్రహ్మైక్యం పొందడానికి తగినవాడు.*

**54. బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి ।**
**సమస్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్ ॥**

*భావం : జీవన్ముక్తుడైన ప్రశాంతమనస్కుడు దేనికీ శోకించడు. దేనినీ కోరడు. సమస్త ప్రాణులని సమభావంతో చూస్తూ నా లోని ఉత్తమ భక్తిని పొందుతాడు.*

**55. భక్త్యా మామభిజానాతి యావాన్యశ్చాస్మి తత్త్వతః ।**
**తతో మాం తత్త్వతో జ్ఞాత్వా విశతే తదనంతరమ్ ॥**

*భావం : నేనెవరో, ఎంతటి వాడినో భక్తితో తెలుసుకుంటున్నాడు. ఇలా నా తత్త్వాన్ని యథాతథంగా తెలుసుకున్న తర్వాత నాలో లీనమవుతున్నాడు.*

**56. సర్వకర్మాణ్యపి సదా కుర్వాణో మద్వ్యపాశ్రయః ।**
**మత్ప్రసాదాదవాప్నోతి శాశ్వతం పదమవ్యయమ్ ॥**

*భావం : సదా సమస్త కర్మలని చేస్తున్నా, (కర్తృత్వ భావం లేకుండా) కర్మఫలాన్ని పొందకుండా నన్నే ఆశ్రయించి (కర్మ యోగి) నా అనుగ్రహంతో నాశరహితమైన సనాతన శాశ్వత మోక్షపదాన్ని పొందుతున్నాడు.*

**57. చేతసా సర్వకర్మాణి మయి సన్న్యస్య మత్పరః ।**
**బుద్ధియోగముపాశ్రిత్య మచ్చిత్తస్సతతం భవ ॥**

*భావం : సమస్త కర్మలని వివేకబుద్ధితో నాకే సమర్పించి, నన్నే పొందదగ్గ వాడిగా తెలుసుకుని తత్త్వ విచారణతో సదా నా మీదే మనసుని నిలుపు.*

**58. మచ్చిత్తః సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి ।**
**అథ చేత్త్వమహంకారాత్ న శ్రోష్యసి వినంక్ష్యసి ॥**

*భావం : మనసుని నా మీద నిలిపితే, నా అనుగ్రహంతో సమస్త దుఃఖాలని దాటుతావు. దీన్ని అహంకారంతో పెడచెవిన పెడితే భ్రష్టుడవుతావు.*

**59. యదహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే ।**
**మిథ్యైష వ్యవసాయ స్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి ॥**

*భావం : ఒక వేళ అహంకారంతో యుద్ధంతో చేయను అని నిశ్చయించడం వృధా. నీ (క్షత్రియ) స్వభావమే నిన్ను (యుద్ధంలోకి) దింపుతుంది.*

**60. స్వభావజేన కౌంతేయ నిబద్ధః స్వేన కర్మణా ।**
**కర్తుం నేచ్ఛసి యన్మోహా త్కరిష్యస్యవశోపి తత్ ॥**

*భావం : ఓ కౌంతేయా! నీ స్వభావంతో (పూర్వజన్మ సంస్కారంతో) అవివేకంగా దేన్ని చేయడానికి ఇష్టపడడం లేదో దాన్ని బంధింపబడ్డ కర్మకి ఆధీనుడివై చేస్తావు.*

**61. ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి ।**
**భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥**

భావం : ఓ అర్జునా! సర్వప్రాణుల శరీర యంత్రాలని అధిరోహించి, సమస్త ప్రాణుల హృదయంలో వెలిసిన అంతర్యామి తన మాయతో వారిని (కీలుబొమ్మల్లా) తిప్పుతున్నాడు. (వారి కర్మల ప్రకారం నడిచేలా చేస్తున్నాడు)

**62. తమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత ।**
**తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్ ॥**

భావం : ఓ అర్జునా! అన్ని విధాలా ఆ పరమేశ్వరుడ్నే శరణు పొందు. అతని అనుగ్రహంతో సర్వోన్నతమైన పరమశాంతిని, శాశ్వతమైన మోక్షాన్ని పొందుతావు.

**63. ఇతి తే జ్ఞానమాఖ్యాతం గుహ్యాద్గుహ్యతరం మయా ।**
**విమృశ్యైతదశేషేణ యథేచ్ఛసి తథా కురు ॥**

భావం : ఇలా అత్యంత రహస్యమైన జ్ఞానాన్ని (కర్మ, భక్తి, ధ్యాన, జ్ఞాన యోగాలు) నీకు చెప్పాను. దీన్ని సంపూర్ణంగా ఆలోచించి నీకు ఎలా ఇష్టమైతే అలా చెయ్యి.

**64. సర్వగుహ్యతమం భూయ శ్శృణు మే పరమం వచః ।**
**ఇష్టోసి మే దృఢమితి తతో వక్ష్యామి తే హితమ్ ॥**

భావం : రహస్యాలన్నిటి లోకి అత్యంత రహస్యమైనది, శ్రేష్ఠమైనది అయిన నేను చెప్పేది మళ్ళీ విను. నువ్వు నాకు అత్యంత ప్రియుడవు కాబట్టి నీకు మేలు చేసే విషయాన్ని చెప్తున్నాను.

**65. మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామే వైష్యసి సత్యం తే ప్రతి జానే ప్రియోసి మే ॥**

భావం : నా మీదే మనసు ఉంచు. నా భక్తుడివై నన్ను ఆరాధించు. నాకు నమస్కరించు. తద్వారా నన్నే పొందగలవు. నాకు ఇష్టుడివి కాబట్టి ఈ నిజాన్ని ప్రతిజ్ఞ చేసి చెప్తున్నాను.

**66. సర్వధర్మాన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః ॥**

*భావం : సర్వధర్మాలనీ విడిచి పెట్టి, నన్ను మాత్రమే శరణు పొందు. నేను నిన్ను సమస్త పాపాల నించి విముక్తుడ్ని చేస్తాను. శోకించకు.*

**67. ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన ।**
**న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోభ్యసూయతి ॥**

*భావం : తపస్సంపన్నుడు కాని వాడికి (సంసారబంధం నించి బయట పడాలనే తపన లేని వాడికి) భక్తుడు కాని వాడికి, వినడానికి ఇష్టం లేని వాడికి, నన్ను దూషించే వాడికి ఈ గీతాశాస్త్రాన్ని చెప్పకూడదు.*

**68. య ఇమం పరమం గుహ్యం మద్భక్తేష్వభిధాస్యతి ।**
**భక్తిం మయి పరాం కృత్వా మామేవైష్యత్యసంశయః ॥**

*భావం : ఎవడు అతి రహస్యమైన ఈ గీతాశాస్త్రాన్ని నా భక్తులకి చెప్తాడో వాడు నా మీద ఉత్తమ భక్తి కలవాడై నిస్సందేహంగా నన్నే పొందుతాడు.*

**69. న చ తస్మాన్మనుష్యేషు కశ్చిన్మే ప్రియకృత్తమః ।**
**భవితా న చ మే తస్మా దన్యః ప్రియతరో భువి ॥**

*భావం : మనుషులలో అలాంటి వాడి కంటే నాకు మిక్కిలి ప్రియుడు ఇంకొకడు లేనేలేడు. అతని కంటే నాకు మిక్కిలి ఇష్టమైంది ఈ భూలోకంలో ఇంకొకటి భవిష్యత్తులో ఉండబోదు.*

**70. అధ్యేష్యతే చ య ఇమం ధర్మ్యం సంవాదమావయోః ।**
**జ్ఞానయజ్ఞేన తేనాహ మిష్టః స్యామితి మే మతిః ॥**

*భావం : ఎవడైతే ధర్మస్వరూపమైన మన ఇద్దరి ఈ సంభాషణని అధ్యయనం చేస్తాడో (చదువుతాడో, వింటాడో) అతను జ్ఞానయజ్ఞం ద్వారా నన్నే ఆరాధిస్తున్నాడని నా అభిప్రాయం.*

71. శ్రద్ధావాననసూయశ్చ శృణుయాదపి యో నరః ।
సోఽపి ముక్తశ్శుభాన్ లోకాన్ ప్రాప్నుయాత్ పుణ్యకర్మణామ్ ॥

*భావం : ఏ మనిషి శ్రద్ధతో, అసూయ లేక (గీతని) వింటాడో ఆ మనిషి పాపవిముక్తుడై పుణ్యకర్మలు చేసినవారు పొందే ఉత్తమ జన్మలని పొందుతాడు.*

72. కచ్చిదేతచ్ఛ్రుతం పార్థ త్వయైకాగ్రేణ చేతసా ।
కచ్చిదజ్ఞానసమ్మోహః ప్రణష్టస్తే ధనంజయ ॥

*భావం : ఓ పార్థా! నా ఈ బోధని నువ్వు ఏకాగ్ర మనసుతో విన్నావు కదా? ఓ ధనంజయా! అజ్ఞానంతో పుట్టిన నీ మోహం (భ్రమ) పూర్తిగా నశించిందా?*

**అర్జున ఉవాచ**

73. నష్టో మోహఃస్మృతి ర్లబ్ధా త్వత్ప్రసాదాన్మయాచ్యుత ।
స్థితోస్మి గతసందేహః కరిష్యే వచనం తవ ॥

*భావం : అర్జునుడు చెప్పాడు, : ఓ అచ్యుతా! నీ అనుగ్రహంతో నా అజ్ఞానం నశించింది. జ్ఞానం పొందాను. నువ్వు చెప్పినట్లే చేస్తాను.*

**సంజయ ఉవాచ**

74. ఇత్యహం వాసుదేవస్య పార్థస్య చ మహాత్మనః ।
సంవాదమిమమశ్రౌష మద్భుతం రోమహర్షణమ్ ॥

*భావం : సంజయుడు చెప్పాడు : ఇలా నేను శ్రీకృష్ణుడు, మహాత్ముడైన అర్జునుడి మధ్య జరిగిన ఈ ఆశ్చర్యకరమైన గగుర్పాటు కలిగించే సంభాషణని విన్నాను.*

75. వ్యాసప్రసాదాచ్ఛ్రుతవా నేతద్గుహ్యతమం పరమ్ ।
యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్ సాక్షాత్కథయతఃస్వయమ్ ॥

*భావం : వేదవ్యాస కృపతో నేను అతి రహస్యమైంది, శ్రేష్ఠమైంది అయిన ఈ యోగ శాస్త్రాన్ని, యోగేశ్వరుడైన శ్రీకృష్ణ భగవానుడు స్వయంగా అర్జునుడికి చెప్పగా ప్రత్యక్షంగా విన్నాను.*

**76.** **రాజన్సంస్మృత్య సంస్మృత్య సంవాదమిమమద్భుతమ్ ।**
**కేశవార్జునయోః పుణ్యం హృష్యామి చ ముహుర్ముహుః ॥**

*భావం : ఓ ధృతరాష్ట్ర మహారాజా! ఆశ్చర్యకరమైన, పావనమైన కృష్ణార్జునుల ఈ సంభాషణని స్మరిస్తూంటే మాటిమాటికీ ఆనందం కలుగుతోంది.*

**77.** **తచ్చ సంస్మృత్య సంస్మృత్య రూపమత్యద్భుతం హరేః ।**
**విస్మయో మే మహాన్ రాజన్ హృష్యామి చ పునఃపునః ॥**

*భావం : ఓ రాజా! హరి యొక్క అత్యద్భుతమైన ఆ విశ్వరూపాన్ని స్మరిస్తూంటే నాకు గొప్ప ఆశ్చర్యం, మాటిమాటికీ సంతోషం కలుగుతోంది.*

**78.** **యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః ।**
**తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ ॥**

*భావం : ఎక్కడ యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు, ఎక్కడ ధనస్సుని చేపట్టిన అర్జునుడు ఉంటారో అక్కడ సర్వసంపదలు, విజయం, సకలైశ్వర్యాలు, స్థిరమైన నీతి ఉంటాయని నా అభిప్రాయం.*

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు । ఓం సర్వేషాం శాంతిర్భవతు ।
ఓం సర్వేషాం పూర్ణం భవతు । ఓం సర్వేషాం మంగళం భవతు ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**సర్వం శ్రీకృష్ణార్పణమస్తు**




(వెల రూ. 60.)




(వెల రూ. 120.)

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి చరిత్ర , భగవద్గీత

### పుస్తకాలని మీ ఇంటికే తెప్పించుకోండి

పై పుస్తకాలని మీరు మీ బంధుమిత్రులకి పెళ్ళిళ్ళు, ఉపనయనం లాంటి అనేక సందర్భాల్లో రిటర్న్ గిఫ్ట్‌గా ఇవ్వచ్చు. స్వర్గస్థులైన మీ పెద్దల జ్ఞాపికగా ఇవ్వడానికి కూడా ఈ పుస్తకాలని మీరు ఉపయోగించుకోవచ్చు. మీ ఊళ్ళోని మీ పుస్తకాల షాపుల్లో ఈ పుస్తకం లభ్యం కాకపోతే, వాటి ధరని మనియార్డర్ చేసినా లేదా ఆన్ లైన్ బేంకింగ్ చెల్లింపు జరిపినా, రిజిస్టర్డ్ బుక్ పోస్ట్/ ట్రాన్స్‌పోర్ట్ ద్వారా మీ చిరునామాకి మీరు కోరినన్ని కాపీలని పంపగలం. పుస్తక ప్రియులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు.

మరిన్ని వివరాలకి ఈ కింది ఫోన్ నంబర్లలో సంప్రదించండి.

BhagavadGeeta.com

*115-B,Ground Floor,*
*Vengalarao Nagar, Hyderabad - 500 038*
*Phone: 040 -65973335   Mobile: 9885 110110*
*Email: team@bhagavadgeeta.com*

## స్టాక్‌లో ఉన్న **మల్లాది వెంకట కృష్ణమూర్తి** రచనలు

| **ఆధ్యాత్మిక రచనలు** | **రూ.** |
|---|---|
| 1. ఆరాధన | 100 |
| 2. ప్రేరణ | 100 |
| 3. భజగోవిందం | 120 |
| 4. ఓ మై గాడ్ | 120 |
| 5. ఆధ్యాత్మిక చిన్న కథలు | 70 |
| 6. అఆఇఈ | 120 |
| 7. గుడ్ బెటర్ బెస్ట్ | 120 |
| 8. ఔన్నత్యం | 100 |
| 9. ప్రవచనం | 60 |
| 10. కర్మ జన్మ | 195 |
| **ఆధ్యాత్మిక నవలలు** | |
| 11. పరంజ్యోతి | 120 |
| 12. విధాత | 120 |
| **నవలలు** | |
| 13. నత్తలొస్తున్నాయి జాగ్రత్త | 110 |
| 14. పున్నమి | 110 |
| 15. విలన్ | 100 |
| 16. నిన్నటి పున్నమి | 100 |
| 17. రేపటి కొడుకు | 50 |
| 18. మిసెస్ పరాంకుశం | 50 |
| 19. అందమైన జీవితం | 120 |
| **కథలు** | |
| 20. మినీ క్రైమ్ కథలు | 120 |
| 21. పరాయి సిరా | 120 |
| 22. మిస్టరీ స్టోరీస్ | 120 |
| 23. మర్డర్ స్టోరీస్ | 120 |
| 24. పిల్లల హిత కథలు | 120 |
| **ఇతరాలు** | |
| 25. అమెరికాలో మరోసారి | 150 |
| 26. ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్ | 150 |
| 27. ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ & గ్రీస్ | 120 |
| 28. టిఫిన్ వెరైటీస్ | 30 |
| 29. వంటల పుస్తకం | 30 |
| 30. జరిగిన కథ | 120 |

పై జాబితా లోని కావాల్సిన పుస్తకాలకి మనీ ఆర్డర్/ బేంక్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పైకం పంపితే, మా ఖర్చుతో రిజిస్టర్డ్ బుక్ పోస్ట్ ద్వారా పంపుతాం. వివరాలకి ముందుగా ఈ కింది సెల్ నంబర్‌కి ఫోన్ చేయండి.


**Lipi Publications**

Gandhi Nagar, Hyderabad - 500 080

Cell Number: **98490 22344**

# భగవద్గీత

(తాత్పర్యం వాడుక భాషలో)

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

భగవద్గీత మీద 'గీతా మకరందము' అనే అద్భుత భాష్యం రాసిన శ్రీ విద్యా ప్రకాశానందగిరి గీతని ఇలా ప్రస్తుతించారు.

వ్యాసుడి రాత, ఉపనిషత్తుల మోత, అహంకారాదుల కోత, దివ్యజ్ఞాన దాత, పరమార్థ దృష్టికి మాత, దైవీ సంపదకి నేత, ముముక్షువులకి ఊత, భవసాగరానికి ఈత, ధర్మామృత పోత, కైవల్య పథ పూత అయిన భగవద్గీత సాక్షాత్తు శ్రీ కృష్ణుడి దూత.

'బాధ కలిగించే వాతావరణంలో ఉన్నా ఆ బాధ నాకు సోకక పోవడానికి కారణం భగవద్గీత' అని గాంధీ మహాత్ముడు చెప్పాడు.

'నా శరీరాభివృద్ధికి తల్లి పాలు ఎంత ఉపయోగ పడ్డాయో, నా బుద్ధి వికాసానికి భగవద్గీత అంతకంటే ఎక్కువ ఉపయోగపడింది' అని శ్రీ వినోబా భావే చెప్పారు.

'ఈ దార్శనిక గ్రంథం అనువదింప బడకపోతే ఆంగ్ల సాహిత్యం అసంపూర్ణంగా ఉండేది' అని శ్రీ ఎడ్విన్ ఆర్నాల్డ్ చెప్పాడు.

గీత ఆధ్యాత్మిక బోధలకే కాక, ప్రాపంచిక విషయాలకి కూడా చక్కటి మార్గదర్శి. ముఖ చిత్రంలోని పక్షి మనిషికి, దాని ప్రతిబింబం మాయకి ప్రతీక. ఆ మాయని జయించాలంటే నిత్యం గీతలో ఒక శ్లోకం లేదా కనీసం ఒక పాదం చదివినా చాలని పెద్దలు చెప్తారు. ఇంతదాకా గీతాశ్లోక తాత్పర్యాలు అచ్చ తెలుగులోనే మనకి దర్శనం ఇస్తున్నాయి. గీతా తాత్పర్యాన్ని తేలిక వాడుక భాషలో మొదటిసారి మల్లాది వెంకట కృష్ణమూర్తి ఈ పుస్తకంలో మీకు అందిస్తున్నారు.

BhagavadGeeta.com

115-B, Ground Floor, Vengalarao Nagar, Hyderabad - 500 038

Phone: 040 -6597 3335, Mobile: 98851 10110

Email: team@bhagavadgeeta.com